మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 29.1.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14 Pages: 14 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 234 ‖ వెల (Price) రూ.6.50 | భీష్మ ఏకాదశి

గురువారం, సూర్యోదయం: 6-49, సూర్యాస్తమయం: 6-10. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర ఋతువు మాఘ మాసం శుక్ల పక్షం తిథి: ఏకాదశి పగలు 1-56 వరకు. నక్షత్రం: రోహిణి ఉదయం 7-31 వరకు, తదుపరి మృగశిర తెల్లవారుజామున 5-29 వరకు. వర్జ్యం: పగలు 12-37 నుంచి పగలు 2-06 వరకు. రాహుకాలం: పగలు 1-54 నుంచి పగలు 3-18 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-36 నుంచి ఉదయం 11-21, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-07 నుంచి పగలు 3-52 వరకు. అమృతకాలం: రాత్రి 9-25 నుంచి రాత్రి 10-53 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



అమెజాన్‌లో 16 వేల మందిపై వేటు

అధికారికంగా ప్రకటించిన సంస్థ

> ‖



జాతీయాంశాలపై విభేదాలకు తావులేదు

- గాంధీ, నెహ్రూ, వాజ్‌పేయి స్ఫూర్తిగా ఐక్యవాణి
- వికసిత్ భారత్, స్వదేశీ, భద్రతపై ఒకటే మాట
- ఎంపీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు

> ‖ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

మంత్రుల ఏసీ ధర లక్ష!

పార్కింగ్ ఏరియాలో సీసీ కెమెరాలకు 4.80 లక్షలు

మార్కెట్ ధరలకన్నా రెట్టింపు ధరల చెల్లింపు

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): 'తన సొమ్ము కాకుంటే ఎంతైనా ఖర్చుచేస్తారు' అనే తరహాలోనే ఉన్నది రాష్ట్ర ప్రభుత్వం తీరు. పది రూపాయల పనికి వంద రూపాయలు ఖర్చుచేస్తున్నారు. మంత్రుల విలాసాలకు విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. చిన్నాచితకా పనులకు కూడా లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అంతేకాదు, మంత్రుల నివాస క్వార్టర్ల మరమ్మతులకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చు మార్కెట్ ధరలతో పొంతన లేకుండా ఉన్నది. మంత్రి క్వార్టర్‌లో ఏసీ కోసం దాదాపు లక్ష రూపాయలు, పార్కింగ్ ఏరియాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.4.80 లక్షలు ఖర్చుచేయడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటినుంచి ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు విడుదల కావాలంటే ఏదో ఒక పని చేసినట్టో, ఏదైనా వస్తువు కొనుగోలు చేసినట్టో రికార్డులు ఉండాలి. సంబంధిత శాఖకు చెందిన అధికారి పంపే ప్రతిపాదనల ఆధారంగా తొలుత అనుమతులు, ఆ తరువాత నిధులు విడుదల చేస్తారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. అయితే, ప్రభుత్వంలోని పెద్దల అండదండలుంటే పనులపై ఎటువంటి నిఘా ఉండదు. పనులు జరిగినా, జరగకున్నా నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖలో ఇదే తంతు కొనసాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రుల క్వార్టర్ల మరమ్మతు పనులకు ప్రభుత్వం విడుదలచేస్తున్న నిధులు చూస్తుంటే ఈ అరోపణలకు బలం చేకూరుతున్నది. ఒక్క బాత్రూమ్ మరమ్మతుకు రూ.76 లక్షలు, ఒక్కో ఏసీ కొనుగోలుకు రూ.95 వేలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు విడుదలచేయడం గమనార్హం. ఓ సామాన్యుడు ఇంటి నిర్మాణానికి చేస్తున్న ఖర్చుకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ ఖర్చు మంత్రుల బాత్రూమ్‌ల మరమ్మతులకు ఖర్చుచేస్తుండటం విమర్శలకు తావిస్తున్నది. ఆర్‌అండ్‌బీలో ఎంపికచేసిన కొందరు కాంట్రాక్టర్లకు రొటేషన్ పద్ధతిలో పనులను ధారాదత్తం చేస్తున్నట్టు సమాచారం. మంత్రుల అనుచరులుగా ఉన్న కొందరు కాంట్రాక్టర్లకే పనులు దక్కుతున్నట్టు ఆరోపణలున్నాయి.

బుధవారం ప్రభుత్వం విడుదలచేసిన నిధులు

బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని మంత్రుల నివాస సముదాయంలో క్వార్టర్ నంబర్-21లో రెండు ఏసీల ఏర్పాటు కోసం రూ.1.90 లక్షలు విడుదలచేస్తూ బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్లో ఏసీల ధరలు రూ.20,000 నుంచి గరిష్ఠంగా రూ.70 వేల వరకు ఉన్నాయి. విండో ఏసీ ధర రూ.20 వేల నుంచి రూ.35వేల వరకు ఉండగా, స్ప్లిట్ ఏసీ ధర రూ.30వేల నుంచి రూ.70 వేల వరకూ ఉన్నది. అయినా ప్రభుత్వం రెండు ఏసీలను సమకూర్చుకునేందుకు రూ.1.90 లక్షలు కేటాయించడం గమనార్హం.

క్వార్టర్ నంబర్-7లో బాత్రూమ్‌లో వివిధ రకాల మరమ్మతు పనుల కోసం మరో రూ.

> 2వ పేజీలో

ల్యాండ్ సెటిల్‌మెంట్లలో ఐపీఎస్‌లు

శాంతిభద్రతల అంశం గాలికొదిలిన అధికారులు

- ఓ కీలక పోలీస్ కమిషనర్‌కు అదే నిత్యకృత్యం
- వ్యక్తిగత ప్రచారం కోసం కొందరి పాకులాట
- అర్ధరాత్రి అరెస్టులు, ఇన్వెస్టిగేషన్ ఎవరి కోసం?
- కాంగ్రెస్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): 'పోలీస్ ఉన్నతాధికారి ఒకరు శాంతిభద్రతల పరిరక్షణ వదిలి ల్యాండ్ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నాడు. మరొక కీలక అధికారి భూ వివాదాలు, వ్యక్తిగత ప్రచారం కోసం పాకులాడుతున్నాడు' అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. వారి పేరు బయటికి చెప్పకుండానే వారెవరో తెలిసిపోయేంత సరళంగా వారిపై తీవ్ర ఆరోపణలు చేయడం గమనార్హం. సొంత వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని పరోక్షంగా ఇద్దరు కీలక ఐపీఎస్ అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొందరు పోలీస్ అధికారుల వల్ల ప్రజాప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ఒక కీలక పోలీస్ కమిషనర్ శాంతిభద్రతలను పర్యవేక్షించడం మానేసి, కేవలం భూ వివాదాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లపైనే ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారని విమర్శించారు. మరికొందరు అధికారులు నిజాయితీగా పనిచేయడమేమో కానీ, ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఎవరు కూడా అర్ధరాత్రి వేళలో ఇన్వెస్టిగేషన్ చేయమని, అరెస్టులు చేయాలని ఆదేశించరని, కానీ ఒక పోలీస్ అధికారి అత్యుత్సాహానికి పోయి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చారని మధుయాష్కీ మండిపడ్డారు. ప్రజాప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోవాలని, పబ్లిసిటీ కోసం అధికారులు పని చేయవద్దని హితవు పలికారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే కొందరు పోలీస్ అధికారులు డ్రగ్స్ పెడ్లర్లకు ఫ్రెండ్లీగా వ్యవహరించారనే తీవ్ర ఆరోపణ చేశారు. హెడ్‌లైన్స్‌లో రావడానికి ఉన్న అధికారిన్ని దుర్వినియోగం చేస్తున్నారని, అర్ధరాత్రి అరెస్టులతో వార్తల్లో హైలెట్ కావాలని చూస్తున్నారని విమర్శించారు. ఎవరిని అరెస్టు చేసినా ప్రొసీజర్ ప్రకారమే చేయాలని సూచించారు. కానీ ఓ కమిషనర్ అమాయకులపై ప్రతాపం చూపుతున్నారని ఆరోపించారు. ఏ కేసు అయినా, ఏ విచారణ అయినా, సీఎం రేవంత్‌రెడ్డి చట్టప్రకారం, ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్లాలని చెప్తున్నారని, కానీ కొందరు అధికారులు ఇన్వెస్టిగేషన్ అంటే అర్ధరాత్రి అరెస్ట్ చేస్తూ, ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. పోలీస్ ఉన్నతాధికారులు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తే మంచిదని హితవు పలికారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని ఈ సందర్భంగా మధుయాష్కీ గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీ నేతగా ఆయన అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. ఆయన పార్టీ మారాలనుకుంటే కేసీఆర్ హయాంలోనే మారేవారని, ఇప్పుడు పార్టీ మారుతారని అనుకోవడం అవివేకమేనని చెప్పారు. ఒక దశలో పార్టీ అధిష్ఠానం జీవన్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా కూడా నియమించాలని భావించిందని వెల్లడించారు. సీనియర్లకు పదవులు ఉన్నా, లేకపోయినా పార్టీ కోసమే పనిచేస్తారన్నారని చెప్పారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ నాయకులను కలుపుకొనిపోయేలా పార్టీని సమన్వయం చేయాల్సిన బాధ్యత చాన్‌చార్జి మంత్రులపైనే ఉన్నదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, పార్టీని సమన్వయం చేయడానికి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం అంటూ కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటే కుదరదని, వారు పాత కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఉత్తరకుమార ప్రగల్భాలు చేయడం మానేసి మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని సూచించారు.


అజిత్ పవార్ దుర్మరణం

బారామతిలో కుప్పకూలిన ప్రైవేట్ విమానం ▪ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సహా ఐదుగురు మృతి

- ఎన్నికల ప్రచారం కోసం వెళ్తుండగా దుర్ఘటన
- విజిబిలిటీ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్న విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- పవార్ మృతిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి
- కుట్ర కోణం ఉందన్న మమత.. దర్యాప్తునకు డిమాండ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్/ముంబై, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ (66) దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం పుణె జిల్లాలోని బారామతిలో కుప్పకూలింది. ఈ ఘటనలో పవార్‌తో పాటు ముంబై వ్యక్తిగత భద్రతాధికారి (పీఎస్‌వో) వదీప్ జావద్, విమానాన్ని నడుపుతున్న కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మృత్యువాతపడ్డారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఎయిర్‌పోర్టు రన్‌వేకు సమీపంలో ఈ విమానం కుప్పకూలింది. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలై మంటలు చెలరేగాయి. ఘటనాస్థలిలోనే విమానంలోని వాళ్లందరూ చనిపోయారని ప్రత్యక్షసాక్షులు పేర్కొన్నారు.


ఘటనా స్థలిలో కాలిపోతున్న విమానం



ప్రముఖుల సంతాపం
పవార్ మరణంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అభివృద్ధికి పవార్ ఎంతో కృషి చేశారని ముర్ము అన్నారు. అట్టడుగు స్థానం నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగిన పవార్ ప్రజల హృదయాల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారని మోదీ తెలిపారు. పవార్ మరణం ఎన్డీయే కుటుంబానికి తీవ్ర నష్టమని అమిత్ షా అన్నారు. పవార్ కుటుంబానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు సానుభూతి తెలియజేశారు. రాష్ట్రంలో మూడు రోజులు సంతాప దినాలుగా పాటిస్తామని సీఎం ఫడ్నవీస్ తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో గురువారం ఉదయం 11 గంటలకు జరుగనున్న అంత్యక్రియలకు ప్రధాని, హోం మంత్రి హాజరయ్యే అవకాశమున్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ప్రమాదంలో కుట్ర కోణం
పవార్ విమాన ప్రమాదంలో రాజకీయ కుట్ర కోణం కనిపిస్తున్నదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనుమానం వ్యక్తం చేశారు. 'పవార్ బీజేపీని వీడాలన్న యోచనలో ఉన్నారని రెండురోజుల కిందటే విన్నా. ఇంతలోనే ఈ ప్రమాదం జరిగింది. దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై ఈ ప్రమాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి. మరే ఇతర ఏజెన్సీలపై మాకు నమ్మకం లేదు' అని మమత అన్నారు. ఆమె వ్యాఖ్యలను తాము సమర్థిస్తున్నామని, ఈ ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, శివసేన యూబీటీ ఎంపీ అనిల్ దేశాయ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తదితరులు డిమాండ్ చేశారు. కాగా ఇది ప్రమాదవశాత్తు జరిగిన దుర్ఘటన అని, దీనికి రాజకీయ రంగు పులమద్దని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు.

కళ్లద్దాలు, వాచీని చూసి..

విమాన ప్రమాద సమయంలో నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విమానం కూలగానే పెద్దయెత్తున మంటలు వచ్చాయని, ప్రమాద తీవ్రతకు రెండు మృతదేహాలు బయటకు ఎగిరిపడ్డాయన్నారు. కళ్లద్దాలు, వాచీని చూసి అజిత్ పవార్‌ను గుర్తించి బయటకు లాగామని, అయితే అప్పటికే నష్టం జరిగిపోయిందని ఓ ప్రత్యక్ష సాక్షి కన్నీటిపర్యంతమయ్యారు.

2023లో అదే మోడల్ విమాన ప్రమాదం
ఢిల్లీకి చెందిన వీఎస్‌ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 మోడల్ విమానంలో చివరగా అజిత్ పవార్ ప్రయాణించారు. ఇదే మోడల్ విమానం 2023లో ముంబై విమానాశ్రయంలో క్రాష్ ల్యాండ్ అయ్యి రెండు ముక్కలైంది. ప్రమాద ంలో ఆరుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, తమ విమానం 100 శాతం సురక్షితమైనదని వీఎస్‌ఆర్ సంస్థ చెబుతున్నది.

విజిబిలిటీ లేకనే..!

విమాన ప్రమాదానికి కారణమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బారామతిలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి ఉదయం 8.10 గంటలకు పవార్ ముంబై నుంచి విమానంలో బయల్దేరారు. 8.30 గంటల సమయంలో విమానం ల్యాండ్ చేయడానికి పైలట్లు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే క్లియరెన్స్ కోసం బారామతి ఏటీసీ అధికారులను సంప్రదించారు. అయితే, ఎయిర్‌పోర్ట్‌లో విజిబులిటీ చాలా తక్కువగా ఉండటంతో.. 'రన్‌వే కనిపిస్తుందా? లేదా??' అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారు. ఈ మేరకు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఏటీసీ ప్రశ్నకు.. కనిపించడంలేదని పైలట్లు సమాధానమిచ్చారు. దీంతో క్లియరెన్స్ రాలేదని, ఈ క్రమంలో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్టు మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఏటీసీ అధికారుల ప్రశ్నకు పైలట్లు సానుకూలంగా స్పందించడంతో క్లియరెన్స్ ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 8.42 గంటల సమయంలో ల్యాండింగ్‌కు పైలట్లు ప్రయత్నించగా.. విజిబులిటీ సమస్యలతోపాటు నియంత్రణ కోల్పోవడంతో రన్‌వేకు దగ్గరగా ఉన్న ఓ బండరాయికి ఢీకొని 8.48గంటల ప్రాంతంలో పెద్ద మంటతో విమానం కూలిపోయినట్టు సమాచారం. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే ముందు గో ఎరౌండ్ పాటించారని, ఈ సమయంలో పైలట్ల నుంచి ఆపదలో ఉన్నట్టు తెలియజేసే ఎలాంటి మేడే కాల్స్ రాలేదని డీజీసీఏ వర్గాలు తెలిపాయి.


అజిత్ చివరి ఫొటో

పైలట్ల అనుభవం ఇది
లియర్‌జెట్-45 విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా వ్యవహరించిన కెప్టెన్ సుమిత్‌కు 16,500 గంటల విమానం నడిపిన అనుభవం ఉన్నదని అధికారులు తెలిపారు. యువ పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్ చిన్న వయసులోనే కమర్షియల్ విమానాలను నడిపే లైసెన్స్ పొందారని పేర్కొన్నారు. 2016-18లో సెకండరీ విద్యను పూర్తిచేసిన ఈమె.. ముంబై యూనివర్సిటీ నుంచి ఏవియేషన్‌లో డిగ్రీ పొందారు. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో శిక్షణ పొందారు.





మళ్లీ ఫోన్ చేస్తా నాన్నా..



విమాన ప్రమాదంలో మరణించిన ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలీ చివరిగా తనతో అన్న మాటలను ఆమె తండ్రి శివకుమార్ గుర్తు చేసుకొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తనతో ఫోన్‌లో మాట్లాడిన పింకీ.. 'నాన్న.. బుధవారం డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో కలిసి బారామతి వెళ్తున్నా.. ఆయన్ని డ్రాప్ చేశాక అటు నుంచి నాందేడ్ వెళ్తా. హోటల్‌కు చేరుకోగానే ఫోన్ చేస్తా' అని పింకీ తనతో అన్నట్టు ఆమె తండ్రి గుర్తు చేసుకొన్నారు. తన కుమార్తెతో మాట్లాడే అవకాశం ఇక మళ్లీ రాబోదన్న శివకుమార్.. మృతదేహాన్ని అప్పగిస్తే.. ఆమెకు గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తానని విజ్ఞప్తి చేశారు.


బాబాయ్ శరద్ పవార్‌తో అజిత్ పవార్

సీఎం కల నెరవేరకుండానే..

- **ఆరుసార్లు డిప్యూటీ సీఎంగానే..**
- **అజిత్ రాజకీయ ప్రయాణమిది**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): అజిత్ పవార్ 1959 జూలై 22న మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలోని డోలాయి ప్రవారా ప్రాంతంలో జన్మించారు. తండ్రి అనంత్‌రావ్ పవార్ సీనియర్ రాజకీయ నాయకుడు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్ పవార్‌కు అనంత్‌రావ్ పవార్ పెద్దన్న అవుతారు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అజిత్ పవార్.. 23 ఏండ్ల వయసులోనే అంటే 1982లో తొలిసారిగా కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏండ్లపాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1991లో తొలిసారిగా బారామతి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలిచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. అయితే, బాబాయ్ శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ సీటులో గెలిచారు. ఈ నియోజకవర్గం నుంచే 8 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అజిత్ పవార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సునేత్ర పవార్ రాజ్యసభ ఎంపీగా వ్యవహరిస్తున్నారు.

నలుగురు సీఎంలతో అలా..
కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ సీఎంగా ఉన్నప్పుడు అజిత్ పవార్ తొలిసారిగా 2010లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత చవాన్ హయాంలో 2012లో రెండోసారి, 2019లో దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో మూడోసారి, అదే ఏడాది ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఏర్పాటైన మహా వికాస్ అఘాడీ సంకీర్ణ ప్రభుత్వంలో నాలుగోసారి డిప్యూటీ సీఎంగా పని చేశారు. 2022లో శరత్ పవార్‌తో విడిపోయి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమితో చేతులు కలిపి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ఐదోసారి డిప్యూటీ సీఎంగా వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించింది. ఈ సమయంలో అజిత్ పవార్ సీఎంగా బాధ్యతలు చేపడుతారని అంతా భావించారు. అయితే చివరకు బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కే ఆ అవకాశం దక్కింది.

ఎన్సీపీని నడిపేదెవరు?


సునేత్ర

ముంబై: అజిత్ పవార్ మరణంతో ఎన్సీపీని నడిపే సమర్థవంతమైన నాయకుడు ఎవరన్న దానిపై మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అజిత్ పవార్ సతీమణి సునేత్ర ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నప్పటికీ, ఆమెకు పార్టీని నడిపే గత అనుభవం లేదని విశ్లేషకులు అంటున్నారు. అజిత్ పవార్ పార్టీ శ్రేణులను ఎన్సీపీ (ఎస్పీ) అధినేత, అజిత్ పవార్ బాబాయ్ శరద్ పవార్ ముందుకు తీసుకెళ్లవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇద్దరు పవార్‌లు జట్టు కట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే, పవార్ పార్టీకి చెందిన 41 మంది ఎమ్మెల్యేలను వదులుకోవడానికి ఫడ్నవీస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని మరికొందరు అంటున్నారు. ఎన్సీపీ ఎంపీలు ప్రఫుల్ పటేల్, సునీల్ తాత్కరే నేతృత్వంలో పవార్ పార్టీ ముందుకు వెళ్లొచ్చన్న అభిప్రాయాన్ని కూడా మరికొందరు వెలిబుచ్చుతున్నారు.

హోమీ భాభా నుంచి పవార్ వరకు..

విమాన ప్రమాదంలో మరణించిన ప్రముఖులు వీరే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయారు. గతంలోనూ పలువురు ప్రముఖులు విమాన ప్రమాదాల్లో మరణించడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.

పేరు	హోదా	సంవత్సరం
హోమీ జహంగీర్ భాభా	అణుకార్యక్రమ పితామహుడు	1966
సంజయ్ గాంధీ	ఎంపీ	1980
మాధవ్‌రావ్ సింధియా	కేంద్ర మంత్రి	2001
జీఎంసీ బాలయోగి	లోక్‌సభ స్పీకర్	2002
సెప్రియన్ సంగ్మా	మేఘాలయ మంత్రి	2004
సౌందర్య	ప్రముఖ నటి	2004
ఓంప్రకాశ్ జిందాల్	పారిశ్రామికవేత్త	2005
సురేందర్‌సింగ్	హర్యానా మంత్రి	2005
వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	ఉమ్మడి ఏపీ సీఎం	2009
దోర్జీ ఖండు	అరుణాచల్ సీఎం	2011
బిపిన్ రావత్	తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్	2021
విజయ్ రూపాణి	గుజరాత్ మాజీ సీఎం	2025

యూజీసీ కొత్త రూల్స్ ఉపసంహరించాలి

- దేశవ్యాప్తంగా జనరల్ క్యాటగిరీ విద్యార్థుల ఆందోళన
- మోదీ, షా పోస్టర్లపై నల్ల ఇంకు
- నిబంధనలపై విచారణకు సుప్రీం కోర్టు అంగీకారం



న్యూఢిల్లీ: యూజీసీ కొత్త నిబంధనలను వ్యతిరేకిస్తూ జనరల్ క్యాటగిరీ విద్యార్థులు, అగ్ర కులాల సభ్యులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్‌లో విద్యార్థుల నిరసనలు కొనసాగాయి. యూజీసీ నిబంధనలను నిరసిస్తూ అగ్రకులాలకు చెందిన విద్యార్థులు శిరోముండనం చేసుకున్నారు. బీహార్‌లో నిరసనకారులు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా పోస్టర్లపై నల్ల ఇంకు చల్లి తమ నిరసన తెలిపారు. యూపీలో ఓ నిరసనకారుడు రక్తంతో ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇక నిబంధనలను వ్యతిరేకిస్తూ బీజేపీలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. రాయ్‌బరేలీలో బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేశారు. కాగా, ఈ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ధర్మాసనం బుధవారం ప్రాథమిక వాదనలు ఆలకించింది.

'రిజర్వేషన్ కోసం మతమార్పిడా?'

న్యూఢిల్లీ: హిందూ అగ్ర కులానికి చెందిన ఓ వ్యక్తి బౌద్ధమతంలోకి మారి తనకు మైనారిటీ రిజర్వేషన్ కల్పించాలని కోరడం పట్ల సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇదో కొత్త రకం మోసమంటూ సీజేఐతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. మైనారిటీ అభ్యర్థినైన తనకు అడ్మిషన్ కల్పించాలని కోరుతూ నిఖిల్ కుమార్ పునియా అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. పునియా అన్న పేరు పెట్టుకున్న నువ్వు మైనారిటీవి ఎలా అవుతావని ధర్మాసనం ప్రశ్నించగా తాను జాట్ పునియానని, తాను బౌద్ధమతంలోకి మారానని, అది తన హక్కని పునియా తరపు న్యాయవాది వాదించారు. ఇదో కొత్త రకం మోసమంటూ సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.


బ్రాహ్మణులు రాజకీయంగా వెనుకబడ్డారా?

పరిశీలించనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందినవిగా విస్తృతంగా పరిగణించబడుతున్నప్పటికీ కింది స్థాయి స్థానిక సంస్థల్లో తక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రాహ్మణులను రాజకీయంగా వెనుకబడిన తరగతులు(పీబీసీ)గా వర్గీకరించి పంచాయతీ నియోజకవర్గాల్లో రిజర్వేషన్లు మంజూరు చేయాలా? అన్నదానిపై సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ ద్వారా యూత్ ఫర్ ఈక్వాలిటీ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ ప్రశ్నపై అధ్యయనం చేయడానికి అంగీకరించింది.

ఆధార్ సేవలు మరింత సులభతరం

కొత్త ఆధార్ యాప్ ప్రారంభం



న్యూఢిల్లీ, జనవరి 28: యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) కొత్త ఆధార్ యాప్‌ని ప్రారంభించింది. ప్రస్తుతం ఇది ఐఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్(ఐఓఎస్)తోపాటు ఆండ్రాయిడ్ యూజర్లకు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంది. ప్రజలు తమ ఆధార్ వివరాలను సురక్షితంగా నిర్వహించుకోవడంతోపాటు సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవడం, ఐడెంటిటీ డాటాను సురక్షితంగా షేర్ చేసుకునే విధంగా ఈ యాప్ రూపొందింది. ఈ కొత్త యాప్ తాజా వెర్షన్ ద్వారా మొబైల్ నంబర్, చిరునామా అప్‌డేషన్‌ని ఇందులో చేసుకోవచ్చు. ఐదుగురు కుటుంబ సభ్యుల పేర్లను చేర్చుకుని ప్రొఫైల్ మేనేజ్‌మెంట్ చేసుకోవచ్చు. సురక్షితంగా ఆఫ్‌లైన్ ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ ఆధారిత ఐడెంటిటీ కన్ఫర్మేషన్ చేసుకోవచ్చు. ఇందులో బయోమెట్రిక్ కూడా ఉంది.

జాతీయాంశాలపై విభేదాలకు తావు లేదు

- గాంధీ, నెహ్రూ, వాజ్‌పేయి స్ఫూర్తిగా ఐక్యవాణి వినిపించాలి
- వికసిత్ భారత్, స్వదేశీ ప్రచారం, దేశ భద్రతపై అందరిదీ ఒకటే మాట
- ఎంపీలకు రాష్ట్రపతి ముర్ము పిలుపు
- బడ్జెట్ సమావేశాలు ప్రారంభం



న్యూఢిల్లీ, జనవరి 28: వికసిత్ భారత్, స్వదేశీ ప్రచారంతోపాటు జాతీయ భద్రత కోసం పార్లమెంట్ సభ్యులంతా ఐక్యంగా నిలబడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఈ అంశాలన్నీ రాజకీయ విభేదాలకు అతీతమైనవని ఆమె స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగాన్ని ప్రభుత్వం మరింత పెంచుతూనే ఉంటుందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సాయుధ దళాల పరాక్రమాన్ని యావత్ ప్రపంచం చూసిందని, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయని ఆమె అన్నారు. తన ప్రసంగంలో గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, జయప్రకాష్ నారాయణ్, లోహియా, పండిట్ దీన్‌దయాళ్, వాజ్‌పేయిలను ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని, కాని కొన్ని అంశాలు విభేదాలకు అతీతమన్న విశ్వాసాన్ని వారు చాటిచెప్పారని రాష్ట్రపతి అన్నారు. వికసిత్ భారత్, దేశ భద్రత, ఆత్మనిర్భరత, స్వదేశీ ప్రచారం, జాతీయ సమైక్యత కోసం కృషి, స్వచ్ఛత వంటి అంశాలు దేశానికి సంబంధించినవని, వీటి విషయంలో పార్లమెంట్ సభ్యులందరూ ఐక్యంగా నిలబడాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉంది
ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూజీసీ జారీచేసిన కొత్త నిబంధనలపై కొన్ని వర్గాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ దళితులు, వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాలు, గిరిజన వర్గాలు సహా అందరి కోసం ప్రభుత్వం పూర్తి స్పృహతో పనిచేస్తున్నదని ముర్ము తెలిపారు

విపక్షాల నిరసనలు
వికసిత్ భారత్, వీబీ-జీ రామ్ జీ పథకం గురించి రాష్ట్రపతి ప్రస్తావించినపుడు విపక్ష సభ్యుల నుంచి పెద్ద పెట్టున నిరసనలు వ్యక్తమయ్యాయి. వీబీ-జీ రామ్ జీ పథకం గురించి ఆమె మాట్లాడుతున్న సమయంలో దాన్ని ఉపసంహరించుకోవాలంటూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ తయారీ, సేవా రంగాలకు ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు దేశ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని రాష్ట్రపతి తెలిపారు.

ఫ్లిప్‌కార్ట్, జొమాటో వ్యవస్థాపకుల నుంచి, 270 మంది ఐఏఎస్‌ల దాకా..!

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఐఐటీ-ఢిల్లీ పూర్వ విద్యార్థులు



న్యూఢిల్లీ, జనవరి 28: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీ(ఐఐటీ-ఢిల్లీ)కి చెందిన దాదాపు 10,000 మంది పూర్వ విద్యార్థులు బ్యాంకింగ్, ఇంజినీరింగ్ రంగాల్లో నాయకత్వ స్థానాల్లో ఉన్నారు. ఫ్లిప్‌కార్ట్, జొమాటో వ్యవస్థాపకుల నుంచి ఐఏఎస్ అధికారుల వరకు ఐఐటీ-ఢిల్లీకి చెందిన పూర్వ విద్యార్థులు ఉన్నారు. ఈ వివరాలను ఐఐటీ-ఢిల్లీ తన మొట్టమొదటి పూర్వ విద్యార్థుల నివేదికలో వెల్లడించింది. దేశంలోను, వెలుపల తన 65,000 పైచిలుకు పూర్వ విద్యార్థులు పారిశ్రామిక, ప్రభుత్వ, విద్యా రంగాల్లో నిర్వహిస్తున్న కీలక పాత్రకు సంబంధించిన వివరాలను సంస్థ తెలియచేసింది.

- 270 మంది ఐఏఎస్ అధికారులు సహా 650 మందికిపైగా పూర్వ విద్యార్థులు ప్రభుత్వ సంస్థల్లో సేవలందిస్తున్నారు.
- మేధోవలస పోకడలకు భిన్నంగా వీరిలో దాదాపు 70 శాతం మంది భారత్‌లోనే పనిచేస్తుండగా 1,000 మందికిపైగా పూర్వ విద్యార్థులు బడా కార్పొరేట్ కంపెనీల్లో కీలక పదవుల్లో ఉన్నారు.
- దాదాపు 40,000 మంది తమ పూర్వ విద్యార్థులు భారత్‌లో స్థిరపడగా 17,000 మంది అమెరికా, ఇతర దేశాల్లో నివసిస్తున్నారు.
- 2,500 మందికిపైగా పూర్వ విద్యార్థులు అంకుర కంపెనీల స్థాపకులుగా, సహ స్థాపకులుగా లేదా నాయకులుగా ఉన్నారు.
- ప్రముఖ విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీగా 50 మందికిపైగా పనిచేస్తుండగా 270 మంది ఐఏఎస్ అధికారులుగా కొనసాగుతున్నారు.
- టెక్నాలజీ-ఐటీ సర్వీసులు, బ్యాంకింగ్-ఫైనాన్స్, తయారీ, ఇంజినీరింగ్ వంటి కీలక రంగాలతోపాటు కన్సల్టింగ్, ఇంధన, మౌలిక సదుపాయాలు, ప్రొఫెషనల్ సర్వీసులు వంటి రంగాల్లో తమ పూర్వ విద్యార్థులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

అమెజాన్‌లో 16 వేల మందిపై వేటు

అధికారికంగా ప్రకటించిన సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 28: ప్రపంచ వ్యాప్తంగా 16 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ బుధవారం ప్రకటించింది. ఏఐ ఒత్తిడిలో వ్యాపార పునర్‌నిర్మాణంలో భాగంగా ఈ తొలగింపులు చేపట్టినట్టు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెట్టీ తెలిపారు. దీని కారణంగా ప్రభావితమైన ఉద్యోగులు అంతర్గతంగా కొత్త ఉద్యోగం వెతకడానికి 90 రోజుల సమయం ఇస్తామని, కొత్త ఉద్యోగం కనుగొనలేని, లేదా అందులో చేయకూడదని నిర్ణయించుకున్న వారికి అవుట్‌ప్లేస్‌మెంట్ సేవలు, ఆరోగ్య బీమా వర్తించే విధంగా మద్దతు అందిస్తామని తెలిపింది.

టెక్సాస్‌లో హెచ్-1బీ నియామకాలు బంద్!

టెక్సాస్: హెచ్-1బీ వీసాల పిటిషన్లను రాష్ట్రమంతటా వెంటనే స్తంభింపచేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబోట్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఏజెన్సీలు, పబ్లిక్ యూనివర్సిటీల్లో దీన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. అమెరికాలోని ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 2027 మే 31 వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని వెల్లడించారు. తాజా నిర్ణయం భారత ఉద్యోగులు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. టెక్సాస్ యూనివర్సిటీల్లో వందలాది మంది భారతీయులు ఉద్యోగులుగా ఉన్నారు.

అంచెలంచెలుగా ఎదిగారు

అజిత్ పవార్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రైతు ఉద్యమ నేతగా అజిత్ పవార్ తన ప్రజా జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ రాజకీయ నేతగా అంచెలంచెలుగా ఎదిగి, పలు హోదాల్లో పని చేశారని కేసీఆర్ గుర్తు చేశారు. అజిత్ పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రాజకీయాలకు తీరని లోటు: కేటీఆర్
అజిత్ పవార్ మృతి పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. అజిత్ పవార్ మృతి మహారాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేయడంలో అజిత్ పవార్ అంకితమయ్యారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలతో క్షేత్ర స్థాయిలో విస్తృత సంబంధాలు కొనసాగించారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అత్యంత విచారకరం: హరీశ్ రావు
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అకాల మరణం అత్యంత విచారకమని బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. అజిత్ పవార్ కుటుంబసభ్యులు, మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అజిత్ పవార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

'విమానం ఫిట్‌గా ఉంటే గ్రౌండ్ ఎందుకు చేస్తాం?'

ముంబై: అజిత్ పవార్ మరణానికి కారణమైన వీఎస్‌ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్య లేదని వీఎస్‌ఆర్ యజమాని వీకే సింగ్ స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన క్రమంలో మీ ఇతర విమానాలను నిలిపివేస్తారా? అన్న మీడియా ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమ విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తామని చెప్పారు. విమానం ఫిట్‌గా ఉన్నప్పుడు గ్రౌండ్ చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. కాగా, బుధవారం ప్రమాదానికి గురైన లియర్‌జెట్ మోడల్ విమానం 2023లో ఇదేవిధంగా ముంబయి విమానాశ్రయంలో క్రాష్ ల్యాండింగ్ అయినట్టు జాతీయ మీడియా తెలిపింది.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 29.1.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 234 || వెల (Price) రూ.6.50 | PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD | www.ntnews.com | /ntdailyonline

హైదరాబాద్.. ఆంధ్రా 'పాలు'!



పాగా వేయనున్న ఏపీ విజయ డెయిరీ

ఇక్కడ పాల సేకరణ లేదు, ప్లాంట్ లేదు

ప్రాసెసింగ్, ప్యాకింగ్‌కు టెండర్ల ఆహ్వానం

తెలంగాణ విజయ డెయిరీకి గండికొట్టే కుట్ర

నోరు మెదపని రాష్ట్ర మంత్రులు, అధికారులు

› 3

గుట్టలో గుట్టుగా డాలర్లు మాయం



10 లక్షలు విలువైన స్వామివారి బంగారం, వెండి డాలర్లు

ఏడాది కిందటే మాయం.. తాజా ఆడిట్ తనిఖీలో బహిర్గతం

మూడురోజుల్లో రికవరీ చేస్తాం: డీఈవో భాస్కర్

› 8

• కారెక్కిన అరూరి



తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

సగవెట్టిన కేసీఆర్...

ఎగవెట్టిన కాంగ్రెస్

సర్కార్‌పై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నది

ప్రజలు బాధలను పట్టించుకునే నాథుడు లేడు

కాంగ్రెస్‌కు తీరిక లేదు.. బీజేపీకి సోయిలేదు

మోసగాళ్ల చేతిలో మళ్లీ మోసపోతే తప్పు మనదే

ఎన్నికలేవైనా బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలె

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

యావత్తు తెలంగాణ చూపు కేసీఆర్ వైపు : హరీశ్

బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి

సాదరంగా ఆహ్వానించిన వర్కింగ్ ప్రెసిడెంట్

ఓపిక, తెలివిలేని సీఎం రాష్ట్రాన్ని నడుపుతున్నడు

రెండేండ్లల్లో తెలంగాణకు చేసిందేం లేదు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ రాష్ట్రాన్ని సగవెడితే.. కాంగ్రెస్ ఎగవెట్టుడు.. రాష్ట్రాన్ని పండవెట్టుడు తప్ప చేసిందేమీలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) విమర్శించారు. 'కేసీఆర్ కరెంట్‌ను సగవెట్టిండు. మంచినీళ్లు సగవెట్టిండు. పల్లెటూర్లు.. పట్టణాలను సగవెట్టిండు. రేవంత్‌రెడ్డి ఏమో అన్నీ ఎగవెట్టుడు. ఎండవెట్టుడు. రాష్ట్రాన్ని పండవెట్టుడు తప్ప ఏమీ చేయలేదని వ్యాఖ్యానించారు. ఈ రెండేండ్లలో కాంగ్రెస్ సర్కార్ తెలంగాణకు తీరని నష్టం చేకూర్చిందని నిప్పులు చెరిగారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గులాబీ కండువా కప్పిన కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఓపికలేని.. తెలివిలేని సీఎం రాష్ట్రాన్ని నడుపుతున్నాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనకు పాలన చేతకావడమే లేదని వ్యాఖ్యానించారు. 'సీఎం కథ › 2వ పేజీలో

అరూరికే వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలు

ప్రకటించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అరూరి రాక పార్టీకి లాభం: ఎర్రబెల్లి › 2

ముఖ్యనేతకు 'ఫుల్'.. మంత్రికి 'పెగ్'!

మైక్రో బ్రూవరీస్‌లో ఎవరి కోటా వారికే!



కమీషన్ల మత్తులో తూలుతున్న సర్కార్

రాష్ట్రంలో మైక్రో బ్రూవరీస్‌కు 110 అప్లికేషన్లు

25 మందికే కేటాయించాలని నిర్ణయం

21 ముఖ్యనేత తోడునీడకు, 4 మంత్రికి!

ఒక్కొక్క బ్రూవరీకి రూ.1.80 కోట్ల ధర

రూ.1.50 కోట్లు ముఖ్యనేత షాడోకు, మిగతా రూ.30 లక్షలు మంత్రి వాటా

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా లిక్కర్ సరఫరా సంస్థలకు 4,500 కోట్ల బకాయి

రైతులకు కాదని మద్యం కంపెనీలకు నీళ్లు

ఇది రైతు ప్రభుత్వమా? మద్యం ప్రభుత్వమా?

చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో అనేక కుంభకోణాలకు పాల్పడిందని, ఇప్పుడు ఎక్సైజ్‌శాఖలో మరో స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలో మైక్రో బ్రూవరీస్ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ సుమారు రూ.50 కోట్ల ఎక్సైజ్ కుంభకోణానికి స్కెచ్ వేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన మద్యం సొమ్మును ప్రభుత్వ పెద్దలే తిలా పాపం తలా పెగ్గులా పంచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మైక్రో బ్రూవరీలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా, దీనికి రాష్ట్రవ్యాప్తంగా 110 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిలో తొలుత 25 మందికి ఇవ్వాలని నిర్ణయించారని, ఇందులో ముఖ్య నేత కోటా 21, మంత్రి కోటా నాలుగుగా డిసైడ్ చేశారని తెలిపారు. ముఖ్యనేతకు తోడూనీడగా ఉంటూ, ఆయన ఇంట్లోకి కారు నేరుగా వెళ్లే వ్యక్తి.. ఇటీవల వైకుంఠ ఏకాదశికి తిరుపతికి వెళ్తే ముఖ్యనేతకు ఆయన నీడగా ఉన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒక్కో బ్రూవరీకి రూ.1.80 కోట్లుగా ధర నిర్ణయించారని, ఇందులో ముఖ్యనేత తోడునీడకు రూ.1.50 కోట్లు కాగా, మిగతా రూ.30 లక్షలు మాత్రం మంత్రికి కేటాయించాలని డిసైడ్ అయ్యారని విమర్శించారు. బ్రూవరీల ఫీజు కాకుండానే ఇలా సుమారు రూ.50 కోట్లు అక్రమంగా వస్తున్నట్టు చెప్పారు. వైన్స్‌కు అత్యధిక దరఖాస్తులు వస్తే లక్కీ డ్రా తీస్తున్న తరహాలోనే మైక్రో బ్రూవరీలను పారదర్శకంగా ఏర్పాటుచేయాలి తప్ప ప్రభుత్వ పెద్దలు మద్యం సొమ్మును › 5వ పేజీలో

సీఎంవో నుంచి ఫేక్‌న్యూస్ రాకెట్



బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం కోసం నడుస్తున్న సోషల్ మీడియా వెబ్‌సైట్ల లిస్టును చూపిస్తున్న మన్నె క్రిశాంక్, చిత్రంలో దినేశ్ చౌదరి, జగన్మోహన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి

రాష్ట్రంలో 'మిస్ ఇన్ఫర్మేషన్ మాఫియా'

సిట్ విచారణపైనా ఫేక్ వార్తల ప్రచారం

అడ్డగోలు థంబ్‌నెయిల్స్.. పెరడీ అకౌంట్లు

సీఎంవో నుంచే 138 మంది సభ్యులున్నరు

సర్కార్ సొమ్ముతో బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం

బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ మండిపాటు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కార్యాలయ వేదికగా కాంగ్రెస్ పెద్దలు దేశంలోనే అతిపెద్ద తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేసే మాఫియాను నడుపుతున్నారని బీఆర్‌ఎస్ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, దినేశ్‌చౌదరి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్‌రావుతో కలిసి ఆయన బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత పార్టీ నేత అయిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోషల్ మీడియాలో తిట్టించేందుకు ఓ టీంను ఏర్పాటు చేశారని తెలిపారు. అదే తరహాలో సీఎం కార్యాలయం నుంచి బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు సీఎంవో నుంచే 138 మంది సభ్యులతో 'తెలంగాణ రైజింగ్ టాక్ కమ్యూనికేషన్' పేరిట వాట్సాప్ గ్రూప్ నడిపిస్తున్నారని వెల్లడించారు. ఆ గ్రూప్‌లో ఉన్న ఓ తెలంగాణ ఉద్యమకారుడు విజిల్ బ్లోయర్‌గా వ్యవహరించి తమకు స్క్రీన్ షాట్‌లు పంపితే సంచలన విషయాలు › 3వ పేజీలో



కొలువుదీరిన కల్పవల్లి

అశేష జనవాహిని నడుమ సారలమ్మ రాక

నేడు గద్దెకు చేరనున్న తల్లి సమ్మక్క

› 8

అశేష జనవాహిని భక్తిపారవశ్యం నడుమ బుధవారం అర్ధరాత్రి కన్నెపల్లి కల్పవల్లి తరలివచ్చింది. మేడారం గద్దెలపై సారలమ్మ కొలువు దీరగా.. మహాజాతరలో తొలి ఘట్టం ఎలాంటి ఆటంకాలు లేకుండా పరిపూర్ణమైంది. ఇక తల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి నేడు గద్దె పైకి స్వాగతించేందుకు మేడారం వేయికండ్లతో ఎదురుచూస్తున్నది.

బీఆర్‌ఎస్‌కు నేను రాజీనామా చేయలేదు

› 2

లోక్‌సభకు పోటీని పరిగణించకండి

స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం లేఖ

పార్టీ ఫిరాయింపుపై విచారణకు రండి

స్పీకర్ నోటీసు..రేపు విచారణ

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

› 2

నాగర్‌కర్నూల్ జిల్లా అనంతవరంలో విషాదం



పొలాలను ముంచిన సర్కార్ నిర్లక్ష్యం

మల్లన్నసాగర్ కాలువకు గండి

రైతులపై సర్కార్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రెండేండ్లుగా కాలువల నిర్వహణ బాధ్యతను మరచి మంగళవారం ఉన్నఫలంగా నీటిని వదలడంతో సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ కాలువకు గండిపడింది. మొత్తం తుంగ, పూడికతో నిండిన కెనాల్‌లోకి నీళ్లు వదలడంతో ఎల్లారెడ్డిపేట-పెద్దమాసాన్‌పల్లి శివారులో కాలువకు అర్ధరాత్రి పెద్ద గండి పడి పొలాలు మునిగిపోయాయి. › 2

అజిత్ పవార్ దుర్మరణం



బారామతిలో కుప్పకూలిన ప్రైవేట్ విమానం › 11

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సహా ఐదుగురు మృతి

ఎన్నికల ప్రచారం కోసం వెళ్తుండగా దుర్ఘటన

వెలుతురు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్న విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

పవార్ మృతిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి

కుట్రకోణం ఉందన్న మమత.. దర్యాప్తునకు డిమాండ్

బస్తీమే గులాల్

రెండేండ్ల రేవంత్ సర్కార్ వైఫల్యాలే ఎజెండాగా ముందుకు

'పంచాయతీ' ఫలితాల స్ఫూర్తితో 'పుర'పోరుకు బీఆర్‌ఎస్ సై

రంగంలోకి కేటీఆర్, హరీశ్

మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జులు, సమన్వయకర్తల నియామకం

వరంగల్, జనవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ సర్కార్ 'పుర'పోరు సైరన్‌కు బీఆర్‌ఎస్ బస్తీమే గులాల్ అంటున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో బల్దియాలో జయకేతనం ఎగురవేస్తామనే ధీమాతో కార్యాచరణ రూపొందించుకున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అటు తెలంగాణ భవన్ కేంద్రంగా, ఇటు మున్సిపాలిటీల వారీగా క్షేత్రస్థాయి పోరుకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆయా పురపాలక సంఘాల మాజీ చైర్మన్లు, ఆయా మున్సిపాలిటీల › 5వ పేజీలో



మున్సి 'పోల్స్' షెడ్యూల్ అప్రజాస్వామికం

నామినేషన్లకు 4 రోజులేనా?

ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేందుకే ఇలాంటి నిర్ణయం

మేడారంలో అందరూ బిజీ

డాక్యుమెంట్లకు టైం చాలదు

రాష్ట్ర ఎన్నికల సంఘం తీరు సరికాదు: సోమ భరత్ › 5



కదం తొక్కిన కరెంటోళ్లు

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉద్యోగులు కదం తొక్కారు. డిస్కమ్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను ఎండగట్టారు. టీఈఈ జేఏసీ, టీజీపీఈ జేఏసీ సంయుక్త పిలుపు మేరకు బుధవారం ఉద్యోగులు, సిబ్బంది మహాధర్నాకు దిగడంతో మింట్ కాంపౌండ్ దద్దరిల్లింది. ఉద్యోగుల హక్కుల విషయంలో సీఎండీ తీరుకు నిరసనగా ఆందోళనకు దిగినట్టు జేఏసీ ప్రకటించింది. › 3

సగవెట్టిన కేసీఆర్...ఎగవెట్టిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

చూస్తే ముఖం బాగలేక ఎనకట ఎవరో అద్దం పగులగొట్టినట్టున్నది' అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాకముందు అడ్డమైన అబద్ధాలు చెప్పి గద్దెక్కి ఇప్పుడు నడుప చాతనైతలేదు అని అంటున్నారని మండిపడ్డారు. తెల్లారి లేస్తే కేసీఆర్‌ను తిట్టుడు తప్ప ఇంకోటిలేదని వాగ్బాణాలు సంధించారు. 'మేము రెండువేల రైతుబంధు ఏమైంది? అని అంటే లాగుల తొండలిడుస్తా! రెండున్నర వేలు ఇస్తానంటివి ఏం సంగతి అంటే నీ పేగులు మెడలేసుకుంటా! తులం బంగారం ఏమైంది? అని గట్టిగ అడిగితే గుడ్లు పీకి గోటీలాడుకుంట! ఇట్లా బెదిరించుడు.. పచ్చి అబద్ధాలపై పరిపాలన చేయడం అలవాటు చేసుకున్నారు' అని విమర్శించారు.

మీకే స్పష్టత లేకపోతే ఎట్లా?

పాలన చేతగాక అప్పుల పేరుతో రేవంత్‌రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 'కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిండని కాంగ్రెసోల్లు గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఒకటే బాకా ఊదుతున్నరు. ఒక మంత్రేమో ఆరు లక్షల కోట్లు.. అంటరు. మరో మంత్రి ఏడు లక్షల కోట్ల అప్పు అంటరు. ముఖ్యమంత్రి ఏమో ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసిండు అని అంటడు. పరిపాలిస్తున్న మీకే స్పష్టత లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. తెలంగాణ అప్పులపై ఓ బీజేపీ ఎంపీ పార్లమెంట్‌లో అడిగితే కేసీఆర్ గద్దెనెక్కిననాడు 2 జూన్ 2014న రూ. 72 వేల కోట్ల అప్పు ఉంటే. కేసీఆర్ గద్దె దిగిననాడు (3 డిసెంబర్ 2023న) మూడు లక్షల యాభైవేల కోట్ల అప్పు మాత్రమేనని కేంద్రం స్పష్టంచేసిందని వివరించారు. దీంట్లో వారసత్వంగా వచ్చిన పాత అప్పు 72 వేల కోట్లు తీసేస్తే.. పదేండ్లల్లో కేసీఆర్ చేసిన అప్పు రూ. 2.80 లక్షల కోట్లు మాత్రమేనని తేల్చి చెప్పారు.

> మోసగాళ్ల చేతిలో ఒకసారి కాదు.. రెండోసారి కూడా మోసపోతే తప్పు మనదేనని గుర్తుంచుకోవాలి. ఒకసారి మోసపోతే మోసం చేసినోళ్ల తప్పైతది. మోసగించినోళ్ల చేతిలోనే మళ్లీ మోసపోతే.. మళ్లీ మోసపు మాటలు నమ్మితే తప్పు మనదైతది. ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి.
> -కేటీఆర్

అప్పులు చేసినం.. సగవెట్టినం..

తాము అప్పులు చేసి.. ఆగమైన తెలంగాణను గాడిన పెట్టామని, అన్నీ సగవెట్టినమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. 'కాంగ్రెసోళ్లు ఇచ్చిన అర్ధరాత్రి వచ్చే దొంగ కరెంట్ స్థానంలో.. 24 గంటల కరెంట్ కోసం రూ.50 వేలకోట్లు ఖర్చుచేసినం. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం రూ.93 వేల కోట్లు ఖర్చుచేసినం. వరిధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్ చేసినం. స్వాతంత్ర్యం వచ్చాక ఏ నాయకుడు ఇవ్వనట్టు రైతులు అడగక ముందే 11 సీజన్లు.. రూ.73 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేసినం. నలభై వేల కోట్లు పెట్టి ఇంటింటికీ నల్లాలు పెట్టి నీళ్లిచ్చినం. రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలుంటే.. 33 జిల్లాలు చేసి, 33 మెడికల్, 33 నర్సింగ్ కాలేజీలు పెట్టాం' అని పేర్కొన్నారు



వర్ధన్నపేట బీజేపీ నేత అరూరి రమేశ్ బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతి, ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ పోచంపల్లి, పార్టీ నేతలు గండ్ర జ్యోతి, గ్యాదరి బాలమల్లు, వాసుదేవరెడ్డి,

అరూరికే వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలు

వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి బాధ్యతలను తిరిగి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కే అప్పగిస్తామని కేటీఆర్ ప్రకటించారు. రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నుంచి భారీ మెజార్టీతో గెలిచిన రమేశ్ రెండేండ్ల క్రితం బీజేపీలో చేరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ వరంగల్ అభ్యర్థిగా పోటీచేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన బీజేపీలో నామమాత్రంగానే వ్యవహరించారు. రమేశ్ బీఆర్‌ఎస్‌ను వీడినప్పటి నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అధిష్ఠానం ఎవరికీ అప్పగించలేదు. నియోజకవర్గ కార్యక్రమాలన్నీ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన భుజస్కంధాలపై వేసుకొని శ్రేణులను సమన్వయం చేశారు. తాజాగా బుధవారం తన అభిమానులు, పార్టీ శ్రేణులతో కలిసి అరూరి రమేశ్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరడంతో మళ్లీ బీఆర్‌ఎస్ నియోజకవర్గ బాధ్యతలు ఆయనకే అప్పగించాలని నిర్ణయించారు.

పొద్దున పోయి సాయంత్రం ఇంటికొచ్చినట్టుంది..

అరూరి రమేశ్ బీఆర్‌ఎస్‌లో చేరడమంటే పొద్దున తప్పిపోయిన పిలగాడు సాయంత్రం ఇంటికి వచ్చినట్టుగా ఉన్నదని చెప్పారు. '2018లో అరూరి రమేశ్‌కు 99,969 ఓట్ల మెజారిటీ వచ్చింది. 31 ఓట్లు వస్తే లక్ష మెజారిటీ వచ్చేది. ఈ సారి లక్ష మెజారిటీ వస్తదనుకున్నం. కానీ దిష్టి తగలడంతో దురదృష్టవశాత్తు 16 వేల తేడాతో ఓడిపోయారు' అని చెప్పారు. క్యాడర్‌లో కొత్త, పాత అని చూడొద్దు.. తేడా చూపరాదని కోరారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలే కాకుండా రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. వరంగల్ జిల్లాలో 12కు పన్నెండు మున్సిపాలిటీలు గెలువాలని.. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ వైపే జనం చూపు: హరీశ్‌రావు

'రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ఆగమైంది.. అన్నివర్గాల ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారు.. ఈ దశలో జనమంతా కేసీఆర్ వైపే చూస్తున్నారు' అని బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆరూరి రమేశ్ బీఆర్‌ఎస్‌లో చేరిక సందర్భంగా ఏర్పాటైన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. కేసీఆర్‌ను వద్దనుకొని.. ఏం కోల్పోయామో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. అరూరి చేరిక కూడా అందుకు నిదర్శనమని చెప్పారు. తిరిగి సొంతగూటికి చేరిన నాయకులు, కార్యకర్తల ముఖంలో చిరునవ్వులు, వెలుగులు చూస్తుంటే.. బరువెక్కిన గుండె తేలికైనట్టు.. మా ఇంటికి మేమొచ్చినం అన్నట్టు కనిపిస్తున్నదని చెప్పారు. యావత్తు తెలంగాణ రాష్ట్రం కూడా కేసీఆర్ వైపు చూస్తున్నదన్నారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం, ఒక భరోసా, భద్రత అని హరీశ్‌రావు కొనియాడారు. కానీ, ఈ రెండేండ్లలో ఆ భరోసా, ఆ భద్రత కొరవడిందని చెప్పారు. కేసీఆర్ ఉండగా ఏనాడూ ఎరువుల కొరత ఉండకపోయేదని, ఇప్పుడు నిత్యం వెతుకులాటతో రైతులు వెతలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు రాష్ట్రమంతా ఆగమాగం అయిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే రాష్ట్రం కేసీఆర్ వైపు చూస్తున్నదని చెప్పారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాబోదని, బీజేపీకి స్థానమే లేదని తేల్చి చెప్పారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని తెచ్చుకునేందుకు ఐకమత్యంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అందరం ఐక్యంగా ఉండి ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసి, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్దామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సేనని ఆయన ధీమా వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్‌లోకి రావడానికి గతంలో వీడిన నాయకులంతా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారని, అందులో భాగంగానే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వచ్చారని తెలిపారు. నాయకులంతా కలిసికట్టుగా, ఒక కుటుంబ సభ్యులుగా బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడం కోసం కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌ను ఇంటికి సాగనంపి, కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి తెలంగాణ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

> తెలంగాణలో ఈ వర్గం.. ఆ వర్గం అని కాదు.. అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. తీవ్రమైన బాధలో ఉన్నారు. కానీ పట్టించుకునే నాథుడే లేడు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్‌కు తీరిక లేదు. దేశాన్ని నడుపుతున్న బీజేపీకీ సోయిలేదు. -కేటీఆర్

కాంగ్రెస్.. ఇక రోజులు లెక్క పెట్టుకో: సత్యవతి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ఇక నుంచి రోజులు లెక్క పెట్టుకోవాల్సిందేనని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయని, గతంలో పార్టీని వీడిన నాయకులంతా తిరిగి పార్టీలోకి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఆరూరి రమేశ్‌తో పాటు పాత నేతలు తిరిగి బీఆర్‌ఎస్‌లోకి రావడం మొదలైందని చెప్పారు. పుట్టింటిపై అలిగి అత్తగారింటికి పోయి, తిరిగి పుట్టింటికే వచ్చారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమైపోయిందని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌ను ఓడించడానికి ఒక కుటుంబసభ్యుల్లాగా అందరం కలిసి పోరాడుదామని కోరారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమైపోయిందని స్పష్టం చేశారు.

కొత్త ఇటుక పేర్చలే.. కాలువ తవ్వలే..

రేవంత్‌రెడ్డి ఈ రెండేండ్లల్లో తెచ్చిన రెండున్నర లక్షల కోట్ల అప్పుతో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమైనా చేపట్టారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. 'ఈ రెండేండ్లలోనే 2.50 లక్షల కోట్ల అప్పు చేసి ఒక కొత్త ఇటుక పేర్చిండా? ఒక కాలువైనా తవ్విండా? ఒక చెరువును మంచిగ చేసిండా? అంటూ ప్రశ్నించారు. రైతుబంధు రెండుసార్లు ఎగ్గొట్టిండు. వృద్ధులకు నాలుగువేలిస్తానన్నాడు. రెండు వేలు రెండు నెలలు ఎగ్గొట్టిండు. తులం బంగారమిస్తామని అది కూడా ఎగ్గొట్టిండు. కాంగ్రెసోళ్లు తులం బంగారం ఇచ్చేటోళ్లు కాదు.. మెడల ఉన్న పుస్తెలతాడు ఎత్తుకపోయే రకమని విమర్శించారు.

> కేసీఆర్ అప్పు చేసిండు.. వెయ్యి గురుకులాలు కట్టిండు. కేసీఆర్ అప్పు చేసిండు.. వరంగల్‌లో అతిపెద్దదైన 24 అంతస్తుల ఎంజీఎం దవాఖాన కట్టిండు. కేసీఆర్ అప్పు చేసిండు.. పది జిల్లాల్లో ఐటీ హబ్‌లు కట్టిండు. కేసీఆర్ అప్పు చేసి ప్రజోపయోగ ఎన్నో నిర్మాణాలు చేసిండు.
> -కేటీఆర్

అరూరి రాక పార్టీకి లాభం : ఎర్రబెల్లి

అరూరు రమేశ్ చేరిక బీఆర్‌ఎస్‌కు లాభమేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆరూరి పార్టీలోనే ఉంటే పంచాయతీ ఎన్నికల్లో ఇంకా ఎక్కువ స్థానాలు గెలుచుకునే వాళ్లమని చెప్పారు. ఇక అందరినీ కలుపుకొని పోదామని తెలిపారు. కష్టకాలంలో ఉన్నవాళ్లను కాపాడుకుంటూ, వీళ్లను కూడా కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన కేటీఆర్, హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి వల్లే అరూరి పార్టీని వీడారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల గెలుపే ధ్యేయంగా మనం పనిచేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి కూడా, అరూరి రమేశ్‌కు ప్రాధాన్యం ఇచ్చినా, అయన కేసీఆర్‌పై ఉన్న అభిమానంతోనే తిరిగి సొంత గూటికి వచ్చినట్టు పేర్కొన్నారు. సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. వరంగల్‌లో 12 నియోజకవర్గాల్లో గెలిచే అవకాశం మనకే ఎక్కువగా ఉన్నదని తేల్చి చెప్పారు.

మున్సిపల్ గెలుపే బహుమానం: పోచంపల్లి

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ స్థానాలు గెలిచి కేసీఆర్‌కు బహుమానంగా ఇద్దామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తమ నాయకులకు అండగా ఉంటానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే దాకా నిద్రపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇదే ఉత్సాహంతో పనిచేయాలని బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

విధిలేని పరిస్థితిలోనే పార్టీని వీడా: అరూరి

గత ఎన్నికల సమయంలో విధిలేని పరిస్థితిలోనే తాను బీఆర్‌ఎస్‌ను వీడాల్సి వచ్చిందని, గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయాల్సి వచ్చిందని పార్టీలో తిరిగి చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మనోగతం వ్యక్తంచేశారు. తాను పార్టీని వీడినా ఏనాడూ బీఆర్‌ఎస్‌ను కానీ, పార్టీ నేతలను కానీ ఏ ఒక్క మాట అనలేదని తెలిపారు. తెలంగాణ బాపు కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం కోసం తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వచ్చానని స్పష్టంచేశారు. గత ఎన్నికల్లో ప్రస్తుత సీఎంతో ములాఖత్ పెట్టుకొని, ఒక నాయకుడు తన బిడ్డకోసం కుట్రలు చేశారని, అందువల్లే తాను బీఆర్‌ఎస్‌ను వీడాల్సి వచ్చేందే తప్ప వేరే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. కానీ, ఇప్పుడు అలాంటి పాపాత్ములు బయటకు పోయినందునే తాను తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వచ్చానని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ఈ సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను తన భుజాన వేసుకుని గెలిపించుకుంటానని అరూరి ప్రతినబూనారు.



తెలంగాణ భవన్‌లో ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్(టీజీజేఏ) క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో యూనియన్ నాయకులు

ఫొటో జర్నలిస్టుల సేవలు ఎనలేనివి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. టీజీజేఏ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ) : ఫొటో జర్నలిస్టుల సేవలు ఎనలేనివి అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. తెలంగాణ భవన్‌లో బుధవారం తెలంగాణ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్(టీజీజేఏ) రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సమాజంలోని వాస్తవాలు, ప్రజల కష్టసుఖాలను కెమెరా కంటితో బంధించి, ప్రపంచానికి చాటి చెప్పే ఫొటో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ, అద్భుతమైన చిత్రాలు తీసే ఫొటో జర్నలిస్టులకు అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు మలిదశ ఉద్యమంతోపాటు తెలంగాణ పునర్నిర్మాణంలో సైతం తమవంతు పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వారి సంక్షేమం కోసం యూనియన్ పాటుపడుతుందని భరోసా ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ భాస్కర్ మాట్లాడుతూ టీపీజేఏ 11 ఏండ్ల నుంచి నిరంతరాయంగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నదని తెలిపారు. ఫొటో జర్నలిస్టుల నైపుణ్యాన్ని వెలికితీసేలా వారు తీసిన అరుదైన ఫొటోలను ఈ క్యాలెండర్ ద్వారా ప్రజలకు పరిచయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెమ్జు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణకుమార్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యోగానంద్, జాయింట్ సెక్రటరీ నవీన్ కుమార్ యార, రాకేశ్‌రెడ్డి, బాపురావు, చిన్న యాదగిరి గౌడ్, వినయ్ పాల్గొన్నారు.

మంత్రుల ఏసీ ధర లక్ష!

I తరువాయి...

విడుదలచేశారు. 10/10 సైజులో విశాలమైన కొత్త బాత్‌రూమ్ నిర్మించినా రూ.5 లక్షల కన్నా ఎక్కువ ఖర్చు కాదని ఇంజినీర్లు చెప్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఏకంగా రూ.18 లక్షలు విడుదలచేసింది.

- బంజారాహిల్స్ రోడ్ నంబర్-13లోని స్టాఫ్ క్వార్టర్స్ పార్కింగ్ ఏరియాలో సీసీ టీవీల ఏర్పాటుతోపాటు ప్యానల్‌బోర్డు డ్రెస్సింగ్ పనులు, పాడైపోయిన ఎలక్ట్రికల్ సామాన్ల మార్పుకోసం రూ.నాలుగు లక్షల 80 వేలు విడుదలచేశారు. మార్కెట్లో మంచి నాణ్యమైన 10 కెమెరాలతోపాటు సీసీ టీవీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతున్నది. సీసీ కెమెరాలతోపాటు ప్రభుత్వం పేర్కొన్న పనులన్నీ కలుపుకున్నా రూ.ఒక లక్ష నుంచి రూ.1.20 లక్షలకన్నా ఎక్కువ ఖర్చుకాదని ఇంజినీర్లు చెప్తున్నారు.
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-44లో ముఖ్యమంత్రి నివాసంలో ఏర్పాటుచేసిన ఎక్స్‌రే బ్యాగేజ్ స్కానర్‌కు 3 కేవీఏ యూపీఎస్ సిస్టం ఏర్పాటు కోసం రూ.1.10 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆన్‌లైన్‌లో దీని ధర రూ.26,000 నుంచి గరిష్ఠంగా రూ.45,000 వరకు ఉన్నది. అయినా ప్రభుత్వం మాత్రం రూ.లక్షకుపైగా విడుదల చేయడం విశేషం.

గడచిన పక్షంరోజుల్లో విడుదల చేసిన నిధులు

- బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని మంత్రుల నివాస సముదాయంలో గల క్వార్టర్ నంబర్-29లో పలు శానిటరీ, సివిల్ పనులకు రూ.76 లక్షలు విడుదల చేశారు. బాత్‌రూమ్‌ల మరమ్మతులు, ఇతర పనులకు ఏకంగా రూ.76లక్షలు విడుదల చేయడం గమనార్హం.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని మినిష్టర్స్ క్వార్టర్స్ నంబర్-30లో బీరువా (వార్‌డ్రోబ్)తోపాటు దానికి సంబంధించిన కొన్ని సివిల్ పనుల కోసం రూ.30 లక్షలు విడుదల చేశారు.

నేను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయలేదు

- లోక్‌సభకు పోటీని పరిగణించకండి
- స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం నాగేందర్ లేఖ
- పార్టీ ఫిరాయింపుపై విచారణకు రండి
- దానంకు స్పీకర్ నోటీసు.. రేపు విచారణ



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): తాను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయలేదని తెలుపుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపు మీద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చిన పిటిషన్‌పై విచారణకు రావాలని కోరుతూ స్పీకర్ నోటీసు పంపిన నేపథ్యంలో దానం ఈ లేఖ రాసినట్టు తెలుస్తున్నది. బీఆర్‌ఎస్ తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తనకు వ్యక్తిగత సమాచారం లేదని, తాను ఆ పార్టీకి రాజీనామా చేయలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. 2024 మార్చిలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని, వ్యక్తిగత హోదాలో మాత్రమే ఆ భేటీకి హాజరయ్యానని తెలిపారు. మీడియా కథనాల ఆధారంగా పార్టీ మారినట్టు బీఆర్‌ఎస్ భావిస్తున్నదని వివరించారు. బీఆర్‌ఎస్ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నానని పేర్కొన్నారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి బీఆర్‌ఎస్ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదని తెలిపారు. అనర్హత పిటిషన్ తర్వాతి పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని విజ్ఞప్తిచేశారు. అంటే కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని పరోక్షంగా స్పీకర్‌ను కోరారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. దానం నాగేందర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేయడం తెలిసిందే.

30న దానం విచారణ

బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం నోటీసులు జారీ చేశారు. నాగేందర్ అనర్హత పిటిషన్‌పై ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. దానంపై అనర్హత వేటువేయాలని కోరుతూ పిటిషన్ ఇచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కూడా 30న జరిగే విచారణకు హాజరు కావాలని స్పీకర్ నోటీసులు పంపారు. కారు గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని ఆరోపిస్తూ.. వారిపై స్పీకర్ అనర్హత వేటువేయడంలో జాప్యం చేస్తున్నారంటూ.. బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ నెల 19న స్పీకర్‌కు కోర్టు ధిక్కర నోటీసులు జారీచేసింది. ఎమ్మెల్యేల పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు ఇవ్వడం ఆసక్తిగా మారింది.



సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డిపేట-పెద్దమాసాన్‌పల్లి శివారులో మల్లన్నసాగర్ కాలువలో మొలిచిన పిచ్చి గడ్డి

మల్లన్నసాగర్ కాలువకు గండి

నిర్వహణను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్ • నీటి విడుదలతో తెగిన కాలువ..రైతుల ఆగ్రహం

తొగుట, జనవరి 28 :ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్వహణ లేక మల్లన్న సాగర్ కాలువకు గండి పడింది. సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని ప్రధాన కాలువతోపాటు ఉప్పర్‌పల్లి, చిన్నశంకరంపేట, రామాయంపేట కాలువల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లుగా పట్టించుకోలేదు. దీంతో కాలువల్లో తుంగ, పూడిక నిండిపోయాయి. కేసీఆర్ పాలనలో యాసంగికి ముందే కాలువల్లో పూడికను, తుంగను తొలగించిన తర్వాత సాగునీటిని వదిలేవారు. యాసంగి సాగుకు రైతులు వరినాట్లు వేసినా నీళ్లివ్వకుండా సర్కార్ కాలయాపన చేయడంతో బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు లేఖ రాయడంతోపాటు స్వయంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఈఎన్సీ అమ్జద్‌ఖాన్‌కు ఫోన్‌చేసి కోరారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఆగమేఘాల మీద మల్లన్నసాగర్ నుంచి మంగళవారం నీటిని విడుదల చేశారు. నీటిని ఎక్కువ మోతాదులో వదలడంతో కాలువలో తుంగ, పూడిక పేరుకుపోయి ఉండటంతో నీళ్లు కొన్ని గంటల్లోనే కాలువ మీది నుంచి ప్రవహించాయి. దీంతో ఎల్లారెడ్డిపేట-పెద్దమాసాన్‌పల్లి శివారులో కాలువకు అర్ధరాత్రి గండిపడింది. పెద్దమాసాన్‌పల్లి రైతు కొమురయ్య పొలం కావలి కోసం వచ్చి అందులో చిక్కుకుపోవడంతో గడ్డ మీదనే ఉండి రైతులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. రైతులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటిని నిలుపుదల చేశారు. లేనిపక్షంలో ఎల్లారెడ్డిపేట చెరువు కట్ట కూడా తెగిపోయేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

లోకం పోకడ



నాకు ఇక్కడ మనసుల పడ్తలేదు..
నాకుర్చీ చూస్తూ ఉండు.. ఎవరన్నా కూసుంటరేమో?!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.5°c	32.8°c
రంగారెడ్డి	14.0°c	33.2°c
ఖమ్మం	17.0°c	31.0°c
మెదక్	15.8°c	31.2°c
వరంగల్	17.0°c	28.0°c
మహబూబ్‌నగర్	18.0°c	32.0°c
హైదరాబాద్	18.1°c	30.9°c
నిజామాబాద్	18.8°c	32.5°c
కరీంనగర్	19.0°c	29.0°c
నల్లగొండ	19.0°c	30.5°c

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పైపైకి

గరిష్ఠంగా ఆదిలాబాద్‌లో 32 డిగ్రీలు

తగ్గిన చలి గాలుల తీవ్రత

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. చలి గాలుల తీవ్రత తగ్గడంతో సాధారణ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగాయి. ఫిబ్రవరి రెండో వారం నాటికి మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయని తెలిపారు. వారం రోజుల పాటు పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.1 డిగ్రీలుగా నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉపరితల గాలులు 6-10 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 32.3 డిగ్రీలు రికార్డయినట్టు అధికారులు తెలిపారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ జిల్లా అనంతవరంలో విషాదం



వెంకటయ్య(ఫైల్)

బల్మూరు, జనవరి 28 : నాగర్‌కర్నూల్ జిల్లాలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బల్మూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన రైతు పుట్ట వెంకటయ్య (55)కు నలుగురు ఆడపిల్లలు. వీరిలో ఇద్దరికి వివాహం జరిపించాడు. దీంతో రూ.6 లక్షల వరకు అప్పు అయ్యింది. తనకున్న ఎకరన్నర భూ మిని విక్రయించి అప్పులు తీర్చాలనుకున్నాడు. గ్రామ శివారులో ఉమామహేశ్వర రిజర్వాయ ర్ ఏర్పాటు కానుండటంతో వ్యవసాయ భూముల ధరలు పూర్తిగా పడిపోయాయి. ఓ వైపు అప్పులకు వడ్డీ పెరిగిపోవడంతో వాటిని తీర్చేమార్గం కన్పించక మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన తోటి రైతులు.. కు టుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తీ సుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉ ద యం మరణించాడు. భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఇంజినీర్ డిస్మిస్

లంచం తీసుకుంటూ పట్టుబడిన

హౌసింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై వేటు: ఎండీ

హైదరాబాద్ , జనవరి 28(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల హౌసింగ్ బోర్డు అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ దుర్గం శ్రీకాంత్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించినట్టు కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నట్టు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే, ప్రజలకు ఏమైనా ఫిర్యాదులుంటే 1800 599 5991 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఫొటోలు అప్‌లోడ్ చేయడం ఇలా..

లబ్ధిదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో తమ ఫోన్ నంబరుతో (ఓటీపీ ద్వారా) లబ్ధిదారుగా లాగిన్ కావాలి. డ్యాష్‌బోర్డులో వారికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయి. ఇంటికి సంబంధించి 'క్యాప్చర్ స్టేజ్ వైజ్ ఫొటో గ్రాఫ్స్' అని ఇంటి నిర్మాణపు దశలు ఉంటాయి. అం దులో గ్రౌండింగ్, బేస్‌మెంట్, వాలింగ్, స్లాబు లెవల్, కంప్లీషన్ అని ఉంటాయి. వాటిలో ఏ దశ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందో దానిపై క్లిక్‌చేసి, ఆ దశకు తగినట్టుగా నిర్దేశించిన వివరాలను పొందుపరుస్తూ, ఇంటి ఫొటోలను తీసి లబ్ధిదారులే స్వయంగా అప్‌లోడ్ చేయవచ్చు.

సీఎంవో నుంచి ఫేక్ న్యూస్ రాకెట్

> మొదటిపేజీ తరువాయి...

తెలిశాయని క్రిశాంక్ చెప్పారు. వాట్సాప్ గ్రూప్‌నకు అడ్మిన్లుగా సీఎం పీఆర్వో అన్వేష్, మీడియా కమ్యూనికేషన్స్ డైరెక్టర్ శ్రీరామ్ కర్రీ, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సతీశ్ మన్నే, బాసిత్, రాజ్ ఆకుల తదితరులు ఆ గ్రూప్‌లో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఫార్ములా ఈ కార్ రేసు, కాళేశ్వరంపై విచారణ పేరి ట తప్పుడు ప్రచారాన్ని వీరు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం లో అధికారికంగా ఏ సిట్ అధికారి కూడా లో పల జరిగిన విచారణ గురించి బయట మాట్లాడనప్పుడు ఈ ఫేక్ ప్రచారం ఎక్కడి నుంచి వస్తున్నదని తెలుసుకుంటే ఈ బాగోతం బయటపడిందని చెప్పారు. విచారణ సందర్భంగా సినిమా వాళ్లతో బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడినట్టుగా థంబ్ నెయిల్స్ పెట్టి వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బాట్ అకౌంట్స్‌తో సర్క్యులేట్

ఈ వాట్సాప్ గ్రూప్ నుంచి ఫేక్ న్యూస్ రాకెట్‌ను నడుపుతున్నారని క్రిశాంక్ మండిపడ్డారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న పీఆర్వోలు, అధికారిక హోదాలో ప్రతిపక్ష నేతలపై చిల్లరమల్లర సమాచారాన్ని వ్యాప్తి చేయొచ్చా? అని ప్రశ్నించారు. సిట్ చీఫ్‌గా ఉన్న సజ్జనార్ ఈ విషయంలో ఏం చేస్తున్నారని అడిగారు. డీజీపీ శివధర్‌రెడ్డి వెంటనే స్పందించి శ్రీరాం కర్రీ, అన్వేష్‌పై కేసులు నమోదు చేసి, విచారణ జరిపి.. ఉద్యోగంలోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఫేక్ సమాచారాన్ని బాట్ అకౌంట్స్ (ఆటోమెటెడ్ సాఫ్ట్‌వేర్‌ల ద్వారా రూపొందించిన ఖాతాలు) ద్వారా సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారని వివరించారు. వీరు పోస్టు చేసిన కంటెంట్‌పై వందల సంఖ్యలో కామెంట్లు తిడుతున్నట్టు ఉంటాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న ఫేక్ అకౌంట్ల వివరాలు, వాటికి వస్తున్న కామెంట్లను ప్రింట్ చేసి తీసుకొచ్చి మీడియా ఎదుట ప్రదర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ అంటే భయమని అందుకే ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయడానికి వ్యక్తిత్వ హననం చేయాలని కుట్ర పన్నారని ఆరోపించారు.

వారిని తొలగించాలి

ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న పీఆర్వోలు, అధికారిక హోదాలో ప్రతిపక్ష నేతలపై చిల్లరమల్లర సమాచారాన్ని వ్యాప్తి చేయొచ్చా? అని క్రిషాంక్ ప్రశ్నించారు. సిట్ చీఫ్‌గా ఉన్న సజ్జనార్ ఈ విషయంలో ఏం చేస్తున్నారని అడిగారు. డీజీపీ శివధర్‌రెడ్డి వెంటనే స్పందించి శ్రీరాం కర్రీ, అన్వేష్‌పై కేసులు నమోదు చేసి, విచారణ జరిపి.. ఉద్యోగంలోంచి తొలగించాలని డిమాండ్ చేశారు.




తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్. చిత్రంలో దినేశ్ చౌదరి, జగన్మోహన్‌రావు

వ్యవస్థీకృత నేరం: విష్ణువర్ధన్‌రెడ్డి

గతేడాది ఆగస్టు 29న ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ ఫేక్ ప్రచారం నడుస్తున్నని పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. వందల మంది ప్రభుత్వ అధికారులను బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారానికి వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదో వ్యవస్థీకృతమైన నేరంలా మారిందని, పద్ధతి మార్చుకోని అధికారులపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆఫీసుల నుంచే: జగన్మోహన్‌రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుండి ఫేక్ న్యూస్‌ను బరితెగించి ప్రచారం చేస్తున్నదని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు ఆరోపించారు. 'సీఎంవో నుంచే ఈ ఫేక్ న్యూస్ ముఠా నడుస్తున్నదని సాక్ష్యాధారాలతో బయటపెట్టాం. డీజీపీకి ఫిర్యాదు చేసినా.. ఎలాం టి చర్యల్లేవ్. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ బీఆర్‌ఎస్ మహిళా నేతలపై సైతం వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు' అని అన్నారు.

థంబ్ నెయిల్స్‌తో వ్యక్తిత్వ హననం

ఈ మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ ప్రదర్శించిన ఫొటోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫొటోను వాడుకుని అడ్డగోలుగా థంబ్‌నెయిల్స్ సృష్టించినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. 'నేను మాట్లాడుతున్నది కేటీఆర్ వింటున్నాడు..' అంటూ థంబ్ నెయిల్ పెట్టి ఓ నలుగురు హీరోయిన్ల ఫొటోలు దానికి జత చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై డిజిటల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా అడ్డగోలుగా రాయించిన వార్తలను సదరు గ్రూపులో సర్క్యులేట్ చేయడం కనిపించింది. వందలకొద్ది పేరడీ అకౌంట్లను క్రియేట్ చేసి వాటి ద్వారా బీఆర్‌ఎస్‌పై విషం చిమ్ముతున్నట్టు స్పష్టమైంది. ఆయా హ్యాండిళ్లలో అడ్డగోలుగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను కించపర్చేలా ఫొటోలను మార్ఫింగ్ చేసి లోగోలుగా వాడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారానికి గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎంవో కార్యాలయం వేదికగా మారడం విస్మయానికి గురిచేస్తున్నది.

వికృత క్రీడను వెంటనే అరికట్టాలి: దినేశ్ చౌదరి

కాంగ్రెస్ పేరడి అకౌంట్ల పేరిట సభ్యత, సంస్కారం, విచక్షణ, విజ్ఞత లేకుండా అడ్డగోలుగా ప్రతిపక్ష నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ దినేశ్‌చౌదరి విమర్శించారు. కేవలం బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బ తీయడానికే ఈ అకౌంట్లను కాంగ్రెస్ వాడుకుంటున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ బాట్స్ ఆర్మీ రాష్ట్రంలో కాలకేయ సైన్యంలా తయారైందని మండిపడ్డారు. ఈ వికృత క్రీడను డీజీపీ వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఫేక్ ప్రచారానికి వాడుతున్న అకౌంట్లు ఇవే!

వాయుసేన,	గులాబీ రత్నాలు,
గులాబీ పుష్పం,	మన కాంగ్రెస్,
జన్వాడ లీలలు,	కాంగ్రెస్ ఫర్ ఎవర్,
బీఆర్‌ఎస్ చార్జ్‌షీట్,	తెలంగాణ గొంతు,
కారు బేకారు,	పింక్ లైన్ తెలుగు,
ప్రజాపాలన,	ఫాంహౌస్ బాస్,
హైదరాబాద్ రైజింగ్,	రేవంత్ సైన్యం తెలంగాణ,
గుడ్ మార్నింగ్ తెలంగాణ,	మార్పు మొదలైంది,
తెలంగాణ బ్లిట్జ్,	తెలంగాణ ముచ్చట్లు,
ఖట్టర్ కాంగ్రెస్,	టిల్లుచాచా,
కాంగ్రెస్ వచ్చింది	ఆపన్న హస్తం,
మార్పు తెచ్చింది,	పింక్ మీడియా,
యాత్ర ఫర్ చేంజ్	తెలంగాణ కాంగ్రెస్ సైన్యం,
అఫీషియల్,	పింకీ మీడియా వాచ్,
తెలంగాణ స్పీక్స్,	తెలుగు గ్యాలక్సీ,
దొరల అహంకారం,	తెలంగాణ ఎక్స్‌ప్రెస్,
ఒబీహెచ్‌కే ఫ్యామిలీ,	తెలంగాణ బజ్,
ఎర్ర గులాబీలు,	ఐఎన్‌సీ హైదరాబాద్,
కాంగ్రెస్ హై హమ్,	తెలంగాణ పులి.

కాంగ్రెస్ ఫేక్ వార్తలు రాయిస్తున్న వెబ్‌సైట్‌లు ఇవే..

ముచ్చట, వాస్తవం.



బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం కోసం సీఎంవో గ్రూపు కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను నడపడంతోపాటు కొన్ని ప్రైవేటు వెబ్‌సైట్లు 'మెయింటైన్' చేస్తున్నది. 'ముచ్చట', 'వాస్తవం' తదితర కొన్ని వెబ్‌సైట్ల ద్వారా ఫేక్ కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నదని క్రిశాంక్ ఆరోపించారు.

'తెలంగాణ స్క్రైబ్' పేరిట ఫేక్‌న్యూస్ క్లిప్పింగ్‌లు

'తెలంగాణ స్క్రైబ్' పేరిట ఫేక్ వార్త క్లిప్పింగ్‌లను సైతం కాంగ్రెస్ ఐటీ సెల్ సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నది. బీఆర్‌ఎస్ నాయకురాలు మాగంటి సునీతను వ్యక్తిత్వ హననం చేసేలా అడ్డగోలుగా రాసి ఉన్న ఫేక్ వార్త క్లిప్పింగ్‌ను తెలంగాణ స్క్రైబ్ పేరిట కాంగ్రెస్ ఐటీ సెల్ వదిలింది. దీంతోపాటు కేటీఆర్‌కు హరీశ్‌రావు మర్యాద ఇవ్వలేదంటూ వండి వార్చిన మరో ఫేక్ వార్తను ప్రచారం చేసింది. సిట్ అధికారులు 'హీరోయిన్ల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయించారు' అని కేటీఆర్‌ను అడిగినట్టు ఉన్న మరో ఫేక్ వార్తను కూడా సోషల్ మీడియాలో కాంగ్రెస్ వైరల్ చేసింది. 'ఒకరిద్దరు కాదు చాలామంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేశాం' అని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చెప్పినట్టు ఉన్న క్లిప్పింగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేయగా.. ఇవన్నీ ఫేక్ అంటూ కాంగ్రెస్ నేతలు చేసిన ప్రచారాన్ని మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు దీటుగా తిప్పికొట్టారు.



డిస్కమ్ ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మహా ధర్నాలో పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగులు, సిబ్బంది

కదం తొక్కిన కరెంటోళ్లు

- డిస్కమ్ యాజమాన్యం మొండి వైఖరిపై జేఏసీల మహాధర్నా
- టీజీఎస్పీడీసీఎల్‌లో బదిలీల మార్గదర్శకాలపై భారీ ఉద్యమం
- మింట్‌కాంపౌండ్ ఆవరణలో మిన్నంటిన నినాదాల హోరు
- వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగ, కార్మికులు
- అర్ధరాత్రి వరకూ కొనసాగిన చర్చలు విఫలం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 28(నమస్తే తెలంగాణ): టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగులు కదం తొక్కారు. డిస్కమ్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. టీఈఈజేఏసీ , టీజీపీఈజేఏసీలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉద్యోగులు, సిబ్బంది మహాధర్నాకు దిగడంతో మింట్‌కాంపౌండ్ దద్దరిల్లింది. ఉద్యోగుల హక్కుల విషయంలో సీఎండీ తీరుకు నిరసనగా ఆందోళనకు దిగినట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ యాజమాన్యానికి మంగళవారం నోటీస్ ఇవ్వగానే, బుధవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. ఈ క్రమంలో చర్చలకు వెళ్లిన జేఏసీ ప్రతినిధులకు సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ అందుబాటులో లేకపోవడంతో మరింత ఆగ్రహం వ్యక్తమైంది. ఈ క్రమంలో ధర్నాను విరమిస్తేనే చర్చలంటూ మరోసారి సీఎండీ నుంచి సమాచారం రావడంతో, ఉద్యోగులు మరింత అసహనానికి లోనయ్యారు. ఓవైపు ఉద్యోగుల ఆందోళన కొనసాగుతుండగా, డైరెక్టర్లతో సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకూ ఆందోళన విరమించేది లేదంటూ జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. విద్యుత్తు సంస్థల్లో ఉద్యోగుల బదిలీల కోసం విడుదల చేసిన మార్గదర్శకాల్లో గతంలో మాదిరిగా జూన్, జూలైలలోనే బదిలీలు నిర్వహించాలని, బదిలీల కాలపరిమితిని రెండేండ్లు కాకుండా మూడేండ్లుగా ఉంచాలని డిమాండ్ చేశారు. బదిలీలు జోన్ టు జోన్ కాకుండా సర్కిల్ టు సర్కిల్ చేయాలని కోరారు. ఉద్యోగులకు ఆరోగ్య చికిత్సకు ఇంతవరకు ఉన్న అన్ని కార్పొరేట్ దవాఖానలను కొనసాగించాలని, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. పీఆర్‌ఎస్, ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని, ఆర్టిజన్ల గ్రేడ్ పెంచాలని జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, కార్మికులపై యాజమాన్యం ఒత్తిడి

మహాధర్నాలో ఉద్యోగులు, అధికారులు పాల్గొనకుండా టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం విశ్వ ప్రయత్నాలు చేసింది. సిబ్బందికి సంబంధించిన హాజరుపై సంబంధిత అధికారులు, డైరెక్టర్లతో ఆరా తీసింది. సర్కిల్ కార్యాలయాల్లో గంటగంటకు అటెండెన్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేసింది. మరోవైపు ఈ నిరసనలో పాల్గొన్న వారిపై నిఘా పెట్టిన ప్రభుత్వం, ఎస్పీడీసీఎల్ యాజమాన్యం వారిని గురించిన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. మహాధర్నాకు వెళ్లిన వారికి గైర్హాజరు వేయాలని యాజమాన్యం ఆదేశించినట్టు సమాచారం రావడంతో జేఏసీ ప్రతినిధులు డిస్కం యాజమాన్యం కక్షపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం జేఏసీ ప్రతినిధులను చర్చలకు పిలిచింది. ఎర్రగడ్డ స్కాడా కార్యాలయంలో చర్చలు జరిగాయి. అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు విఫలమైనట్టు సమాచారం. చివరకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు వాయిదా వేసినట్టు సమాచారం అందడంతో రిలే నిరాహారదీక్షలు, నిరసనలు వాయిదా వేసినట్టు జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు.

అణచివేస్తే ఉద్యమం ఉధృతం: జేఏసీ ప్రతినిధులు

విద్యుత్తు ఉద్యోగుల పోరాటాన్ని అణచివేయాలని చూస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సాయిబాబు తెలిపారు. చిన్న సమస్యను జటిలం చేయాలని చూస్తున్నారని, దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో జేఏసీ ప్రతినిధులు శ్రీధర్, బీసీ రెడ్డి, పీ అంజయ్య, సుధాకర్‌రెడ్డి, ముత్యం వెంకన్న గౌడ్, మేడి రమేశ్, దాసరి శ్యాంమనోహర్, మాతంగి శ్రీనివాస్, గోవర్ధన్, నారాయణనాయక్, అక్బర్, కరెంట్ రావు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, భానుప్రకాశ్, నాగరాజు, నాసర్‌షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ మొండివైఖరి సరికాదు: హరీశ్‌రావు

విద్యుత్తు ఉద్యోగుల పట్ల సర్కారు మొండి వైఖరిని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. యాజమాన్యం తీరు దుర్మార్గమని మండిపడ్డారు. బదిలీల పేరిట వారి పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడటం సరికాదని పేర్కొన్నారు. విద్యుత్తు జేఏసీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సీమాంధ్రులకు మేలు చేసే కుట్ర?

విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాకు బదిలీల మార్గదర్శకాలు ఒక కారణమైతే ఆంధ్ర తెలంగాణ వివాదం మరో కారణంగా చర్చ జరుగుతున్నది. జోన్ పరిధిలో ఐదేండ్లు పూర్తి చేసిన వారిని మరోజోన్‌కు బదిలీ చేయనున్నట్టు మార్గదర్శకాలు రావడంతో, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రూరల్ ఏరియాలో పనిచేస్తున్న సీమాంధ్ర వారిని గ్రేటర్‌లో తిష్ఠ వేయించడానికే ఈ నిబంధన తీసుకొచ్చారంటూ విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ కుట్ర వెనుక హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న ఒక కీలక అధికారి ఆలోచన ఉందని, ఆయన మే నెలలో రిటైరవబోతున్న క్రమంలో ఇప్పటికిప్పుడు బదిలీలకు తెరలేపారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విధానం వల్ల తెలంగాణ ఉద్యోగులకు నష్టం జరుగుతుందని చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదంటూ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఆంధ్రా అధికారుల ఆధిపత్యం కొనసాగించడానికి విద్యుత్ సంస్థల యాజమాన్యం ప్రయత్నించడం దారుణంగా ఉందని ఉద్యోగులు వాపోయారు. ఇటీవల రాజకీయ నాయకుల శుభాకాంక్షల లెటర్లు తమతో పంపిణీ చేయించారని, మరోవైపు డ్రెస్‌కోడ్ పెట్టి తమపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నారంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

హైదరాబాద్.. ఆంధ్రా'పాలు'!

- పాగా వేయనున్న ఏపీ విజయ డెయిరీ
- ఇక్కడ పాల సేకరణ లేదు, ప్లాంట్ లేదు
- ప్రాసెసింగ్, ప్యాకింగ్‌కు టెండర్లట!
- తెలంగాణ విజయ డెయిరీకి గండి
- నోరెత్తని రాష్ట్ర మంత్రులు, అధికారులు



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విజయ డెయిరీ వ్యాపారానికి ఆంధ్రా విజయ డెయిరీ గండికొట్టే కుట్ర చేస్తున్నది. హైదరాబాద్‌లో పాగా వేసేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే నెయ్యి విక్రయాలతో తిష్ట వేసిన ఏపీ విజయ డెయిరీ ఇప్పుడు పాలరంగంలోకి దిగుతున్నది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో మిల్క్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ కోసం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 13న నోటిఫికేషన్ జారీచేసింది. తెలంగాణలో పాలు కొనుగోలు చేయకుండా దళారులను మధ్యలో పెట్టి 'విజయ' బ్రాండ్ పేరుతో పాల విక్రయం జరిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

దళారులకు దోచిపెట్టేందుకే?

ఏపీ విజయ డెయిరీ ఈ నిర్ణయం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఏపీ విజయ డెయిరీకి తెలంగాణలో ఎక్కడా మిల్క్ ప్లాంట్ లేదు. రాష్ట్ర రైతుల నుంచి ఒక్క చుక్క పాలు కూడా సేకరించడం లేదు. చివరికి ఏపీలో కూడా నేరుగా రైతుల నుంచి పాలు కొనుగోలు చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో ప్రాసెసింగ్ చేసి, ప్యాకింగ్ చేసి విక్రయిస్తుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే, హైదరాబాద్ మార్కెట్‌పై కన్నేసిన కొందరు బడాబాబులు, దళారులు చక్రం తిప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వారు ఏపీ ప్రభుత్వంలోని కొందరి సహాయంతో విజయ డెయిరీని హైదరాబాద్‌లో కార్యకలాపాలకు ఒప్పించినట్టు తెలిసింది. ఈ టెండర్ దక్కించుకొని కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకే పాలు కొనుగోలు చేసి తీసుకొచ్చి, ఇక్కడ విజయ బ్రాండ్ పేరుతో విక్రయించాలని స్కెచ్ వేసినట్టు సమాచారం.

తెలంగాణకు తీవ్ర నష్టం

హైదరాబాద్‌లో ఏపీ విజయ డెయిరీ పాల విక్రయాలు ప్రారంభిస్తే తెలంగాణ రైతులకు, తెలంగాణ విజయ సంస్థకు తీవ్ర నష్టం ఖాయమని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. డిస్ట్రిబ్యూటర్లు, దుకాణదారులు ఏపీ పాలను విక్రయించేందుకు మొగ్గు చూపుతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో తెలంగాణ విజయ పాల విక్రయాలు తగ్గిపోతాయి. తెలంగాణ విజయకు హైదరాబాద్ పెద్ద మార్కెట్. ఇది చేజారితే డెయిరీ మూత పడటం ఖాయమని, పాడి రైతులు రోడ్డున పడటం ఖాయమనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నిమ్మకు నీరెత్తినట్టుగా..

ఏపీ విజయ డెయిరీ యథేచ్ఛగా తెలంగాణలో వ్యాపారం మొదలుపెడుతూ తెలంగాణ విజయ డెయిరీ ఉనికిని ప్రశ్నార్థకం చేసే కుట్రలు చేస్తుంటే పశుసంవర్ధక శాఖ మంత్రి, రాష్ట్ర అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో పాల ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్‌కు 13న టెండర్లు ఆహ్వానించగా, ఇప్పటివరకు ఒక్కరు కూడా దీన్ని ఖండిస్తూనో, వ్యతిరేకిస్తూనో ప్రకటన చేయలేదు. ఈ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఏపీ విజయ డెయిరీకి లేఖ కూడా రాయలేదు. దీనిపై విజయ డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. టెండర్ పిలిచిన అంశం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు.



నీట్ ఎస్‌ఎస్‌లో సత్తా చాటిన నిమ్స్

- ఆల్ ఇండియా నీట్ సూపర్ స్పెషాలిటీ పరీక్షల్లో 2వ ర్యాంక్ సాధించిన సిద్ధార్థ్‌రావు
- మరికొందరికి దక్కిన అత్యుత్తమ ర్యాంక్‌లు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): వైద్య విద్యకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఆల్ ఇండియా నీట్ ఎస్‌ఎస్-2025 ప్రవేశ పరీక్షల్లో నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ఎండీ రెసిడెంట్ వైద్య విద్యార్థులు మరోసారి సత్తా చాట్టారు. ఇటీవల నిర్వహించిన ఈ పరీక్షలో నిమ్స్ వైద్య విద్యార్థులు ఆల్ ఇండియా 2వ ర్యాంకుతోపాటు, 27, 40, 84వ ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప వెల్లడించారు. జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ఎండీ రెసిడెంట్ వైద్య విద్యార్థులు డాక్టర్ బీ సిద్ధార్థ్‌రావు ఆల్ ఇండియా 2వ ర్యాంకు, డాక్టర్ కే తిరుమల బాబు 27వ ర్యాంకు, డాక్టర్ శ్రీలేఖ్య 40వ ర్యాంకు, డాక్టర్ సిద్ధార్థ్ సాధ్నానీ 84వ ర్యాంకు, డాక్టర్ ధరణి 399వ ర్యాంకు, డాక్టర్ ఆశ్రిత్ 417వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. వీరితోపాటు ఇతర విభాగాల్లోని ఎండీ రెసిడెంట్ వైద్యులు సైతం ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని, వీరంతా ఆయా విభాగాల్లో డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్ (సూపర్ స్పెషాలిటీ)ల్లో సీట్లు పొందనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎంఎన్ రావు, డాక్టర్ నవల్ చంద్ర మాట్లాడుతూ.. జనరల్ మెడిసిన్ విభాగం నుంచే ఆరుగురు వైద్య విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో టాప్ ర్యాంక్‌లు సాధించడం గర్వకారణమని చెప్పారు. 2023లో డాక్టర్ సాయి సుబ్రహ్మణ్యం, 2024లో డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకులను సాధించి దేశంలోనే టాపర్లుగా నిలిచారని గుర్తుచేశారు.

మీ మద్దతుకు కృతజ్ఞుడిని

సంతోష్‌కుమార్

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ) : సిట్ విచారణ సందర్భంగా తనకు మద్దతు తెలిపిన, సంఘీభావం ప్రకటించిన ప్రతిఒక్కరికీ మాజీ ఎంపీ సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు ప్రత్యక్షంగా, వివిధ వేదికల ద్వారా అండగా నిలిచిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు బుధవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. మీ మద్దతు నాకు మాటల్లో చెప్పలేనంత బలాన్ని చేకూర్చిందని తెలిపారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కాలుష్యం కాటు

ఢిల్లీ ప్రజలు సగటున రోజుకు అరపెట్టె సిగరెట్లు తాగుతున్నారట. ఇదేదో పొగతాగే అలవాటుపై తీసిన లెక్క కానేకాదు. కాలుష్యం వల్ల మనుషులపై పడుతున్న ప్రభావాన్ని సిగరెట్లు కొలమానంగా వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వేసిన అంచనా. అయితే కాలుష్యం అనేది కేవలం ఢిల్లీ సమస్య అనే అపోహ చాలారోజుల వరకు వ్యాపించింది. ప్రస్తుతం చాప కింద నీరులా కాలుష్య భూతం దేశమంతటినీ కమ్మేస్తున్నది. మరీ ముఖ్యంగా మన రాజధాని నగరమైన హైదరాబాద్ కాలుష్యంలో అంగలు వేస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జనవరి 1న నూతన సంవత్సర వేడుకల్లో కాల్చిన టపాసుల పొగ, చలికాలపు మంచుతో కలిసి స్మాగ్‌గా ఏర్పడి నగరంపై ముసుగు కప్పేసింది. పాత ప్రాంతం మధ్యలో ఉండే హైదరాబాద్‌లో ధూళి సహజంగానే ఎక్కువగా ఉంటుంది. అందులో వాహనాల కాలుష్యం కూడా వచ్చి చేరితే గాలి నాణ్యత పడిపోతుంది. సూక్ష్మ ప్లాస్టిక్ కణాలూ వచ్చి చేరుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.

హైదరాబాద్‌లో నమోదవుతున్న వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) లు 'అబ్ దిల్లీ దూర్ నహీ' అని హెచ్చరిస్తున్నాయి. ఏక్యూఐ బాగుంది (0-50), మధ్యస్థం (51-100) నుంచి బాగాలేదు (101-150) స్థాయికి పడిపోయి చాలాకాలమైంది. అప్పుడప్పుడు అనారోగ్యకరం (151-200) క్యాటగిరీలోకి వెళ్లిపోతుండటం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. మామూలుగా అయితే ఏక్యూఐ 100 దాటితే చిన్నపిల్లలు, శ్వాసకోశ జబ్బులున్నవాళ్లు బయటకు వెళ్లరాదు, వెళ్తే మాస్క్ తప్పనిసరిగా ధరించాలని నిపుణుల సూచన. కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుల డాటా ప్రకారం హైదరాబాద్‌లో గత నెల స్థాయి రెండేండ్ల క్రితం నాటి కంటే 64 శాతానికి పైగా పెరిగిపోయింది. అయితే వివిధ సంస్థలు ఉపయోగించే విధానాల ప్రామాణికతను బట్టి ఈ కొలతల్లో తేడాలు వస్తున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య కూడా వ్యత్యాసాలు నమోదు అవుతున్నప్పటికీ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నదని విషయంలో రెండో అభిప్రాయానికి తావు లేదు.

వాయు కాలుష్యానికి హైదరాబాద్, ఢిల్లీ అనే తేడాలుండవు. ప్రాంతాల సరిహద్దులనూ అది గుర్తించదు. అయినా కాలుష్యం అనగానే నగరాల గురించే ఆలోచిస్తారు. జాతీయ శుద్ధ వాయు కార్యక్రమంలోనూ ఈ నగర కేంద్రక విధానాన్నే అనుసరిస్తారు. ఢిల్లీలో కార్ల వాడకంపై, నిర్మాణ కార్యకలాపాలపై నియంత్రణలు విధించడం మనం గమనించవచ్చు. పంజాబ్ రైతులు వరి కొయ్యలు కాల్చితే వెలువడే కాలుష్యం గురించి కొందరు మాట్లాడుతారు. కానీ, ఢిల్లీ శివార్లలోని థర్మల్ కేంద్రాల్లో వెలువడే పొగపై నియంత్రణలు లేకపోవడం విడ్డూరం. కాలుష్యం ఎక్కడ పుడుతున్నదీ, ఎటు పయనిస్తున్నదీ పరిశీలించి ఎక్కడికక్కడ బిగింపులు వేసే ఎయిర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ద్వారా కాలుష్యాన్ని పకడ్బందీగా అరికట్టగలం. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం తోనే సాధ్యం. పుష్కర కాలంగా ఢిల్లీ కాలుష్యం మధ్యలో కూర్చుని దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ఈ లక్ష్య సాధనకు ఓ కమిషన్ ఏర్పాటు చేసినప్పటికీ దానికి ఎలాంటి కోరలు సమకూర్చలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో శరవేగంగా అనుసంధానం అవుతున్న 'విశ్వగురు'కు ఇది ఏమాత్రం శోభించదు. విశేషించి దేశ రాజధాని కాలుష్య కాసారంలా భగభగలాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కానేకాదు.

సింగరేణి హామీలకు పాతర

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి రెండేండ్లు పూర్తయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఆరు గ్యారెంటీలలో భాగంగా కార్మిక వర్గానికి ప్రత్యేకంగా సింగరేణికి అనేక హామీలను ఇచ్చారు. రెండేండ్ల పరిపాలనను పరిశీలిస్తే ఓట్లకోసం ఇచ్చిన హామీలు వేరు, గద్దెనెక్కాక అమలు వేరు అన్నట్టుగా అమలుకాని హామీలు ఇచ్చి పరిపాలనలో అమలుకు చోటే లేదన్నట్టుగా స్పష్టమవుతున్నది. ఎన్నికల ప్రణాళికలో ఆరు గ్యారంటీల పేరున సింగరేణికి ఇచ్చిన హామీలు, అవి అటకెక్కిన తీరును పరిశీలిద్దాం.



జే సీతారామయ్య
94907 00954



అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ హామీలు ఇలా ఉన్నాయి. 'సింగరేణి ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం, సింగరేణి నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని తగ్గిస్తాం, సింగరేణి కాలనీలో ఆధునిక విద్యాలయాలను ఏర్పాటు చేస్తాం, కార్మిక సంక్షేమం, అభివృద్ధి, భద్రతకు పటిష్ట చర్యలు చేపడతాం, కారుణ్య నియామకాలను సరళీకృతం చేస్తాం, కార్మికుల వేతనాలు, నిర్ణీత సమయంలో సవరించి చెల్లిస్తాం' అని పేర్కొన్నారు. కానీ హామీలకు పూర్తి విరుద్ధంగా కాంగ్రెస్ పాలన సాగుతున్నది.

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమైంది. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం 286 బొగ్గుగనుల అమ్మకాలకు పూనుకున్నది. ఇందులో భాగంగా సింగరేణికి చెందిన కోయగూడెం, సత్తుపల్లి, శ్రావణిపల్లి, కల్యాణిఖని గనులను అమ్మకానికి పెట్టేందుకు చర్యలు చేపట్టింది. బొగ్గు గనుల అమ్మకానికి పెట్టిన వేలం పాటలలో పాల్గొనకుండా ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం దూరంగా ఉన్నది. నాలుగు గనుల అమ్మకానికి వ్యతిరేకంగా 2021 డిసెంబర్ 9 నుంచి కార్మిక సంఘాల ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో 72 గంటలపాటు సమ్మె జరిగింది. ఆనాటి సమ్మెలో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి మొత్తం 42 గనులలో 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. ఈ రెండేండ్ల కాలంలో గనుల సంఖ్య 32కు తగ్గిపోయింది. నష్టాల్లో ఉన్నాయంటూ మిగిలిన పదింటిని మూసివేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న ఐదేండ్లలో 10 గనులు మూతపడతాయని సంస్థ చైర్మన్ ఎన్ బలరాం ఇది వరకే ప్రకటించారు. 27 ఏండ్లుగా వేల కోట్ల రూపాయల లాభాలతో కార్మికులు సంస్థను నడిపిస్తున్నప్పటికీ కొత్తబావులకు అనుమతి తేవడానికి ప్రభుత్వం ప్రయత్నించలేదు. నేడు సింగరేణికి కన్న తల్లి లాంటి ఇల్లందు, మణుగూరు, శ్రీరాంపూర్, కొత్తగూడెం, రామగుండం, మందమర్రి ఏరియాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నది. సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణకు అనుమతించబోమని మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్.. దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలం వేయడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యల బాటలోనే గనుల ప్రైవేటీకరణకు ఆదేశాలు ఇచ్చింది. ఇది సంస్థ మనుగడకు ఉరితాడు లాంటిది.

> కాంగ్రెస్ రెండో గ్యారెంటీగా సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యాన్ని తగ్గిస్తామన్న హామీకి పూర్తి విరుద్ధంగా రాజకీయ జోక్యం మరింతగా పెరిగింది. రోజువారీ కంపెనీ నిర్వహణలోనూ మంత్రులు, ఆ పార్టీ నేతల జోక్యం పెరిగింది. సింగరేణి సంస్థను కార్మిక వర్గం కష్టపడి లాభాల బాటలో నడుపుతూ గత 27 ఏండ్ల నుంచి బోనస్ చెల్లిస్తున్నది.

గతంలో సింగరేణి బోనస్‌పై ముఖ్యమంత్రులు ప్రకటన మాత్రమే చేసేవారు. కానీ 2025 నవంబర్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బోనస్ ప్రకటన కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ ఈవెంట్‌లాగా ఏర్పాటు చేసింది. రాజకీయ జోక్యాన్ని లేకుండా చేస్తామన్న హామీ మరిచి చిన్న విషయాలలోనూ జోక్యం చేసుకునేలా సింగరేణిని రాజకీయ నిలయంగా మార్చుకున్నది.

హస్తం పార్టీ మూడో హామీగా సింగరేణి కాలనీల్లో ఆధునిక విద్యాలయాలను ఏర్పాటు చేస్తామన్నది. దీనిపై ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఈ రెండేండ్ల కాలంలో పాఠశాలలు ఏర్పాటు చేయలేదు, ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ చేయలేదు. వసతి గృహాల భవనాలు లేకపోవడంతో పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొన్నది. ఆధునిక విద్యాలయాలుగా తీర్చిదిద్దడం అటుంచితే ఉన్న పాఠశాలలు మూతపడకుండా కాపాడలేని స్థితిలో రెండేండ్లుగా కాంగ్రెస్ పాలన నడుస్తున్నది.

> నాలుగో హామీ అయిన కార్మిక సంక్షేమం, భద్రత, అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టిందేమీ లేకపోగా బొగ్గు గనుల్లో కనీస రక్షణ చర్యలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు పెరిగాయి. మందమర్రి, శ్రీరాంపూర్, భూపాలపల్లి, గోదావరిఖనిలో ప్రమాదాలు పెర కార్మికుల మరణాలు ఇందుకు ఉదాహరణలు. సింగరేణి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల నిధులను తీసుకోవడమే తప్ప సింగరేణి ప్రాంతంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

ఐదో గ్యారంటీగా కారుణ్య నియామకాలను సరళతరం చేస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. గతంలో గుండె, ఊపిరితిత్తులు, మోకాళ్ల నొప్పులు, పక్షవాతం, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక జబ్బులతో విధులు నిర్వహించలేని కార్మికులు రెండేండ్ల సర్వీస్ వదులుకొని ఉద్యోగానికి రాజీనామా చేస్తే వారసులకు ఉద్యోగం ఇచ్చేవారు. ఈ రెండేండ్ల కాలంలో ఉద్యోగాలు ఇవ్వకపోగా దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారిని అన్‌ఫిట్ చేయకుండా వీధుల్లోకి నెట్టారు. దీంతో రెండేండ్ల క్రితం 42 వేల మంది ఉద్యోగులు ఉండగా ఆ సంఖ్య 39 వేలకు తగ్గింది. ప్రభుత్వ ఉద్దేశం కార్మికుల సంఖ్యను కుదించడమే. మరో 5 వేల మంది కార్మికులను ఇంటికి పంపించే కుట్ర చేస్తున్నారు. కారుణ్య నియామకాలు అందని ద్రాక్షగా మార్చుతున్నారు. సింగరేణిని పరిశ్రమగా కాకుండా వ్యాపార సంస్థగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. సింగరేణికి కొత్త బావులు నిర్వహించుకోవడం కష్టమైన పనికాదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాటలు చెప్పడం మానుకుని, హామీల అమలు కోసం, సింగరేణి సంస్థ ద్వారానే బొగ్గు గనులను తీసేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలి.

వ్యాసకర్త: జీఎల్‌బీకేఎస్,
ఐఎఫ్‌టీయూ జనరల్ సెక్రెటరీ

బడిలో బోధనేది?




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచడం, ఉపాధ్యాయులను ఆధునిక బోధనా పద్ధతులకు అనుగుణంగా తీర్చిదిద్దడం ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యత కావాలి. అయితే తెలంగాణ విద్యా శాఖ ఇటీవలి కాలంలో ఉపాధ్యాయులకు చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలు చూస్తుంటే.. అసలు లక్ష్యం పక్కకు పోయి 'శిక్షణే లక్ష్యం'గా సాగుతున్నట్టు కనిపిస్తున్నది. ఏడాది పొడవునా ఏదో ఒక శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను తరగతి గదులకు దూరం చెయ్యడం అశాస్త్రీయం. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి 24 రోజులుపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం.. విద్యార్థులు అత్యంత కీలకమైన బోధనా సమయాన్ని కోల్పోవడమే. ఇది ఇప్పటి వరకు శిక్షణ అందించిన రోజులు మాత్రమే. ఇంకా విద్యా సంవత్సరం పూర్తయ్యే లోపు ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారో, ఎన్ని రోజులు నిర్వహిస్తారో అనే ప్రశ్నలు ఉపాధ్యాయుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

వేసవి సెలవుల్లోనే శిక్షణ పూర్తి చేయకుండా బడులు ప్రారంభమైన తర్వాత పదేపదే శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం అధికారుల ప్రణాళికా రాహిత్యమే. తెలంగాణలో 5 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అటువంటి పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు శిక్షణకు వెళ్తే ఆరోజు పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వరంగంలో నిపుణులైన రిసోర్స్ పర్సన్స్ ఉన్నప్పటికీ, ప్రైవేట్ సంస్థలకు శిక్షణ బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయ వర్గాలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ప్రైవేట్ సంస్థల జోక్యాన్ని పెంచడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుల అనుభవాన్ని తక్కువ చేయడమే అవుతుంది. శిక్షణల పేరిట కార్పొరేట్ సంస్థల ముద్రను ప్రభుత్వ పాఠశాలలపై వేయడం ఎంతవరకు సమంజసం? అని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. బోధనకు ఆటంకంతోపాటు ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ప్రమాదం వచ్చే నిర్ణయాలు విద్యాశాఖ అధికారులు తీసుకోవడం దారుణం. విద్యాశాఖను తన పరిధిలోనే పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రైవేటు శిక్షణ సంస్థల ప్రమేయం పట్ల ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు? విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిపోతుంటే ఎందుకు చోద్యం చూస్తున్నారు? అని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీటికి ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలి. ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపయోగపడాలే కానీ బోధనకు సంకెళ్లు వేసి విద్యార్థులకు నష్టం చేకూర్చే విధంగా ఉండకూడదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండే వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని ప్రయివేట్ సంస్థల ఒప్పందాలను పునరాలోచించి, సరైన ప్రణాళిక లేని శిక్షణ కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను విముక్తి చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య సాధ్యమవుతుంది.

-పల్లె నాగరాజు, 8500431793, టీపీటీఎఫ్ నాయకుడు

పెన్షనర్ల కన్నీటి వేదన



సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ చెందిన తర్వాత పొందే ఆర్థిక ప్రయోజనాలతో పిల్లల పెండ్లిళ్లు, గృహ నిర్మాణం లాంటివి పూర్తి చేస్తామని అనుకుంటారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా తీరిక లేని ఉద్యోగం వల్ల, తర్వాత వచ్చే ఆర్థిక ప్రయోజనాలతో విరామ జీవితంలో ఈ పనులు చేయొచ్చని యోచిస్తారు. రాష్ట్రంలో మార్చి 2024 తర్వాత రిటైరైన ఉద్యోగుల పరిస్థితి దుర్భరమే కాదు.. దు:ఖపూరితంగా ఉన్నది. గడిచిన 21 నెలలుగా 14 వేల మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చెందినా వాళ్లకు రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటెడ్ పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, అన్నీ కలిసి ఒక్కొక్కరికి సరాసరి రూ.50 లక్షల వరకు ఉండొచ్చు. ప్రస్తుతం వీరందరికీ నెలవారీ పెన్షన్ మాత్రమే వస్తున్నది. ప్రభుత్వ విధానాలతో రిటైర్డ్ ఉద్యోగులు కన్నీరు మున్నీరవుతున్నారు.

పింఛను పొందడం ఉద్యోగి ప్రాథమిక హక్కు అని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఉద్యోగి జీవన పదఘట్టంలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత తనకు లభించే పింఛన్, ఇతర బెనిఫిట్స్ నియమ నిబంధనల మేరకు ఉద్యోగి పొందుతారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లిస్తూ ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చి నుంచి రిటైరైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలను అందించకుండా వేధిస్తున్నది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిల పట్ల పేర్కొన్నట్టు రిటైరైన ఉద్యోగులకు అందించాల్సిన బకాయిలను ప్రభుత్వం అందజేయకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కొందరి ఆరోగ్యం క్షీణించి వివిధ రోగాల బారిన పడుతూ చికిత్స పొందుతూ లక్షల్లో బిల్లులు చెల్లించుకోలేని స్థితిలో రాష్ట్రవ్యాప్తంగా 42 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు చనిపోయారు.

చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు తమకు వైద్యానికి డబ్బులు అందక ఆవేదన చెందుతూ సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వాన్ని వేడుకున్నా పాలక పెద్దల్లో చలనం లేకపోవడం తీవ్ర విషాదం. పెన్షనరీ బకాయిలు అందక చనిపోతుంటే ప్రభుత్వానికి బాధ్యత లేదా? ఎన్నాళ్లు ఈ ఎదురు చూపులు అనే ఆవేదనలో రిటైరైన ఉద్యోగులు వేచిచూస్తున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడం శోచనీయం. ఒకప్పుడు 'పత్తి రైతుల ఆత్మహత్యలు' ఎలా అయ్యాయో.. రాను రాను 'రిటైరైన ఉద్యోగుల ఆత్మహత్యలు' అనే పరిస్థితికి ప్రభుత్వమే తీసుకొస్తున్నది. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ తక్షణమే స్పందించి, రిటైరై బకాయిలు పొందలేకపోయిన వారి డబ్బును ఒకేసారి చెల్లించి, వారు నిరాశ, నిస్పృహలకు, మనోవేదనకు, ఆత్మహత్యలకు గురికాకుండా చూడవలసిన అవసరం ఎంతో ఉన్నది.

-కోహెడ చంద్రమౌళి, 9441254983
రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, తెలంగాణ

సంపద సృష్టించి.. సంక్షేమం పంచి!



కనకదుర్గ దంటు

కేసీఆర్ పాలనలో చిన్నాపెద్ద అందరి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించారు. పసిపిల్లల నుంచి పండు ముదుసలి వరకు అన్ని వర్గాలకు చేయూత అందించారు. పుట్టబోయే పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గర్భం దాల్చిన మహిళలకు దగ్గరలో ఉన్న అంగన్‌వాడీలో పౌష్టికాహారం అందించారు. హైదరాబాద్‌తోపాటు జిల్లాలన్నింటిలో ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేసి, వారికి సుఖ ప్రసవం అయ్యేదాకా ఆ దవాఖాన సిబ్బంది శ్రద్ధ తీసుకునేటట్టు ఏర్పాట్లు చేశారు. గర్భిణులు ప్రతినెలా దవాఖానకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడానికి, ప్రసవం కోసం వెళ్లడానికి, ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను ఇంటి వద్ద సురక్షితంగా దిగబెట్టడానికి ఉచిత రవాణా ఏర్పాట్లు చేశారు. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగపిల్లవాడు పుడితే రూ.12 వేల నగదు, బాలింతలకు మూడు నెలలకు సరిపడా మందులు, ఇతర వస్తువులతో కూడిన 'కేసీఆర్ కిట్' పేరుతో ఒక కిట్‌ను అందజేశారు.

ప్రభుత్వం ఇన్ని వసతులు కల్పించడంతో పేదవారే కాకుండా, మధ్యతరగతి ప్రజలు, ఉన్నత ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలు కూడా ప్రభుత్వ దవాఖానల్లోనే పరీక్షలు, ప్రసవాలు చేయించుకున్నారు. ఫలితంగా ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు అనవసర మందులు ఇవ్వడం, పరీక్షలు, సిజేరియన్లు, ఇతర శస్త్రచికిత్సల పేరుతో చేసే దోపిడీకి పాల్పడటం తగ్గిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల్లో రోగనిర్ధారణ పరీక్షా కేంద్రాలు, డయాలిసిస్ సెంటర్ల వంటివి ఏర్పాటు చేసింది. ప్రైవేట్ వైద్య సంస్థల దోపిడీ నుంచి సామాన్య ప్రజలను రక్షించింది. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసింది. ప్రజలకు అందుబాటులోనే వైద్య సాయం అందించింది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయడంతోపాటు, నాలుగు వైపులా సూపర్ స్పెషాలిటీ దవాఖానల నిర్మాణాన్ని ప్రారంభించింది. కేసీఆర్ ప్రభుత్వం సకల జనుల సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రతీ జిల్లా కలెక్టర్ దగ్గర ఆ జిల్లాలోని ప్రజల వివరాలు ఉండేటట్టు ఏర్పాట్లు చేసింది.

మరి చంద్రబాబు ప్రభుత్వం 2014-2019 మధ్య, 2024లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక, ఏ ఏడాదిలో వైద్యరంగంలో తన విజన్‌తో ఏయే నూతన పథకాలు ప్రవేశపెట్టాడు? ఈ రెండో టర్మ్‌లో చంద్రబాబు వైద్య రంగానికి ఏం చేస్తున్నాడు? జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రంతో మంజూరు చేయించిన 26 మెడికల్ కాలేజీలలో కొన్నింటిని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నాడు విజనరీ చంద్రబాబు. బడా వ్యాపారస్థులకు 99 పైసలకు ఎకరం భూమి ఇచ్చే కంటే, వారికి ఆ భూమి సరైన ధరకు అమ్మి, ఆ డబ్బుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా నడిచే దవాఖానలను నిర్మిస్తే, అది ప్రజలకు ఉపయోగపడే పని అవుతుంది. నిర్మాణాత్మక, ఉత్పాదక పథకానికి ప్రభుత్వ భూమి ఉపయోగపడినట్టు అవుతుంది. ఇటువంటి ప్రజాహిత పథకాలు కాకుండా, ప్రజాకంటక పథకాలు రూపొందించే నాయకుడిని ఏమనాలి? చంద్రబాబు విజన్ వల్ల ధనవంతులు ఇంకా ధనవంతులు కావడం, పేదవారు మరింత పేదవారుగా మారి, బక్కచిక్కి నశించిపోయే ప్రమాదం లేదా?

తెలంగాణ సంపద మీద దురాశేగానీ, ఆంధ్ర నాయకులకు కానీ, ఆంధ్ర ప్రజలకు కానీ తెలంగాణ ప్రజల మీద అభిమానం, గౌరవం లేవని చెప్పటానికి ఇంకో ఉదంతం ఉన్నది. 1956 నాటికి తెలంగాణలో 3 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. 1956లో సమైక్య రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 వరకు 58 ఏండ్ల పాలనలో సమైక్యవాద పాలకులు తెలంగాణలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదు. నాలుగు జిల్లాల రాయలసీమలో 11, హైదరాబాద్‌తో కలిపి తెలంగాణలో మూడు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. అన్ని ముఖ్యమైన విద్యాసంస్థలు హైదరాబాద్‌లోనే ఉండాలని



ఆంధ్ర పాలకుల కథ - తెలంగాణ వ్యథ-27

వంకపెట్టి వరంగల్‌కు మంజూరు అయిన ఐఐటీ అనుబంధ కాలేజీని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రాజధానికి జరిపాడు. దానితో తెలంగాణ విద్యార్థులకు రావాల్సిన సీట్లు తగ్గిపోయాయి. ముఖ్యమైన విద్యాసంస్థలు హైదరాబాద్‌లో ఉండాలని సాకులు చెప్పిన ఎన్టీఆర్.. మరి హైదరాబాద్‌లో ఉన్న హెల్త్ యూనివర్సిటీని మాత్రం విజయవాడకు ఎందుకు తరలించినట్టో! ఎండీ, ఎంఎస్‌లో సీట్లు వచ్చిన తెలంగాణ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం విజయవాడ హెల్త్ యూనివర్సిటీకి వెళ్తే, అక్కడి స్థానిక విద్యార్థులు మనవాళ్లను కౌన్సెలింగ్‌కు వెళ్లకుండా తిట్టి, బెదిరించి, కొట్టి వెనక్కు పంపిన ఉదంతాలు ఉన్నాయి. మరి ఇప్పుడు ఇంతమంది ఆంధ్రా వ్యాపార సంస్థలను, విద్యార్థులను భరించాల్సిన అవసరం తెలంగాణకు ఏమున్నది.?

> ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అవసరాల కోసమని చెప్తూ 2014లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రవాణా, విద్యుత్తు, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో చాలా పథకాలు ఆర్భాటంగా ప్రకటించాడు. కానీ, అరకొరగా రోడ్లు వేయడం మినహా ఇతర రంగాల్లో ఐదేండ్లకు సరిపడా అభివృద్ధి కనబడలేదు. నిజానికి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా రూ.33 వేల కోట్లు అప్పుచేసి, హైదరాబాద్‌లో రోడ్లు వేయడం తప్ప, చంద్రబాబు తొమ్మిదేండ్ల పాలనలో సాధించిన ఘనకార్యాలు ఏమీ లేవు. విభజన తర్వాత ఏపీలో విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో కూడా పెద్ద స్కామ్ జరిగిందన్న ఆరోపణలు 2019 తర్వాత బయటకు వచ్చాయి.

తెలంగాణలో కేసీఆర్ హయాంలో భవనాలు కట్టడంలో జరిగిన అభివృద్ధి వేరే ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. సమైక్య పాలనలో ధ్వంసమై విడిపోయిన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం మౌలిక వసతుల నిర్మాణం అద్భుతంగా జరిగింది. కేవలం మూడేండ్లలో రూ.720 కోట్లు వెచ్చించి, ఇంద్రభవనం లాంటి సచివాలయాన్ని కేసీఆర్ నిర్మించారు. పది జిల్లాలను 33 జిల్లాలకు పెంచిన ఆయన, ప్రతి జిల్లాలో కలెక్టరేట్ భవనాలను నిర్మించారు. కలెక్టర్ దగ్గర్నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు ఒకేచోట ఉండేటట్టు ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రజలు ఏదైనా పని మీద పదిచోట్లకు తిరిగే అవస్థ తప్పింది. కొత్తగా ఏర్పాటు చేసిన గురుకులాలకు భవనాలు, పిల్లలకు వసతి గృహాలు నిర్మించారు. అరకొర వసతులతో ఉన్న పాడుబడిన శ్మశానాలను వైకుంఠధామాలుగా తీర్చిదిద్ది, మరణించిన వారికి గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే వసతులు కల్పించారు. సరస్సుల పునరుద్ధరణ, గార్డెన్లను నెలకొల్పారు. పల్లెటూర్లలో కూడా పక్కా రోడ్లు వేసి, రవాణా సదుపాయాన్ని సులభతరం చేశారు.

అమరావతిలో ఇంద్రభవనాలు నిర్మిస్తానంటూ పొంకణాలు కొట్టిన చంద్రబాబు, ఒక శాశ్వతమైన శాసనసభా భవనం కూడా కట్టలేకపోయాడు. నాలుగేండ్ల పాలనా కాలంలో త్రీడీ గ్రాఫిక్స్ వీడియోలు చూపిస్తూ ప్రజలను భ్రమల్లోనే ఉంచేశాడు. తాత్కాలిక సెట్టు వేసి, సినిమాలు తీసే దర్శకుడికి ఏమైనా ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉంటాయా? బాహుబలి దర్శకుడు రాజమౌళిని పిలిపించుకుని అమరావతిలో భవనాల నిర్మాణం కోసం సలహాలు అడగడం చంద్రబాబు చేసిన పూర్తి చీప్ కామెడీ! అమరావతి గ్రాఫిక్స్‌తోనే కాలయాపన చేసిన చంద్రబాబు, మిగతా రంగాల మీద పెద్దగా దృష్టి పెట్టలేదు.

'పద్మా'లపై చిందులు దేనికి?



బద్రి నర్సన్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు ఏమి మాట్లాడుతారో ఎవరికీ తెలియదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 'పద్మ' పురస్కారాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు, వాటి పర్యవసానం తెలిసి మాట్లాడారా..లేదా అలవాటులో భాగంగానే మాట్లాడారో అంతుపట్టడం లేదు.

నిరుడు పద్మ' అవార్డులకు తమ ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను కేంద్రం ఆమోదించకపోవడంతో ఆయన బాహాటంగానే చిందులు తొక్కారు. పురస్కారాలకు తమ ప్రభుత్వం సిఫారసు చేసిన పలువురు వ్యక్తుల పేర్లకు కేంద్రం ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన చేసిన ప్రకటనలు మీడియాలో వెలువడ్డాయి. ఈ పురస్కారాల ఎంపికలో తాము ప్రతిపాదించిన పేర్లను పక్కకు పెట్టడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆయన చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం 2025 సంవత్సరానికి సిఫారసు చేసిన పేర్లను కూడా సీఎం బయటపెట్టారు. దివంగత గద్దర్‌కు మరణానంతరం పద్మవిభూషణ్, విద్యావేత్త చుక్కా రామయ్యకు, కవి అందెశ్రీకి పద్మభూషణ్, గేయ కవి గోరటి వెంకన్న, ఆదివాసీ జానపద పరిశోధకుడు జయధీర్ తిరుమలరావుకు పద్మశ్రీ ప్రదానం చేయాలని కేంద్రాన్ని కోరామని అన్నారు.

ఒకసారి తాము సిఫారసు చేసిన పేర్లు బయటపెట్టారంటే వారికి ఆ పురస్కారాలు అందేలా చూసే బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉంటుంది. అది సాధ్యం కానప్పుడు పేర్లు బయటికి చెప్పడం వారిని నిరాశ పర్చడమే కాకుండా ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారికి ద్రోహం చేసినట్టు కూడా అవుతుంది. విచిత్రమేమిటంటే.. కేంద్ర ప్రభుత్వం 2026 కోసం ప్రకటించిన పద్మ పురస్కార గ్రహీతల్లో పైన పేర్కొన్న పేరొక్కటి కూడా లేదు. రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఆ పేర్లను ఈసారి కూడా కేంద్రం పక్కన పెట్టిందా లేదా రాష్ట్ర ప్రభుత్వమే ఆ పేర్లను మరోమారు జాబితాలో చేర్చలేదా అనే అనుమానం సర్వత్రా వినిపిస్తున్నది. గత సంవత్సరం చెప్పినట్టే ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాల కోసం సిఫారసు చేసిన పేర్లను బయటపెడితే బాగుంటుంది. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమల రావు పేర్లు మరోసారి సిఫారసు చేశారా? లేదా? చేయనట్టయితే ఎందుకు చేర్చలేకపోయారో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకి పద్మభూషణ్ పురస్కారం లభించగా, విజ్ఞాన శాస్త్ర రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్‌రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామారెడ్డి, విద్యారంగం నుంచి మామిడాల జగదీశ్ కుమార్, కళారంగం నుంచి దీపికారెడ్డికి పద్మశ్రీ పురస్కారాలు వచ్చాయి. సేవా, కళా తదితర రంగాల్లో వారు అందించిన విశిష్ట సేవలు, అంకితభావాన్ని గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేశారని సీఎం పేర్కొన్నారు. గతంలో పద్మ పురస్కారాలకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, నటుడు చిరంజీవితో పాటు ఇతరులను ముఖ్యమంత్రి శిల్పకళా వేదికలో ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఈ ఏడాది కూడా పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని ఘనంగా సన్మానించనున్నారు.

అంతా బాగానే ఉది కానీ గతంలో తాను బాధపడుతూ ప్రకటించిన తెలంగాణ మట్టి బిడ్డలకు పద్మ పురస్కారాలు ఈసారి కూడా రాలేదే అనే స్పృహ, బెంగ ఆయనలో ఏ కోశానా కనబడటం లేదు. పోయినేడు తాను ప్రకటించిన అసహనం లేఖ రూపంలో ప్రధానమంత్రికి



చేరిందో లేదో! ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం తరపున 'పద్మ' పురస్కారాలకు సిఫారసు చేసిన పేర్లను బయటపెడితే గానీ తప్పు కేంద్రానిదా లేక రాష్ట్రానిదా అనే విషయం తెలదు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వారికి హైదరాబాద్‌లో ఉన్న శాస్త్ర పరిశోధన, వైద్య సంస్థల్లో పనిచేయడం వల్ల లభించిన పురస్కారాలు తెలంగాణ జాబితాలో వేయడం వల్ల ఓ రకంగా స్థానికులకు అన్యాయం జరిగినట్టే. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి మౌనం పలు అనుమానాలకు తావిస్తున్నది.

ముఖ్యనేతకు 'ఫుల్'.. మంత్రికి 'పెగ్'!

మొదటిపేజీ తరువాయి...

వాటాలు వేసుకొని పంచుకోవడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు.

లిక్కర్ సంస్థలకు రూ.4.500 కోట్ల బకాయి

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా లిక్కర్ సరఫరా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4.500 కోట్లు బకాయి పడిందని హరీశ్‌రావు విమర్శించారు. కొన్ని బకాయిలు 16 నెలలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 1-2 నెలలకు మించి బకాయిలు లేవని, బీఆర్‌ఎస్ హయాంలో 80 శాతం బిల్లులు తక్షణమే చెల్లించామని గుర్తుచేశారు. పెండింగ్ బిల్లుల కారణంగా మద్యం సరఫరా సంస్థలు బ్రీజర్ సరఫరాను నిలిపివేశాయని చెప్పారు. చాలా షాపుల్లో ఇప్పుడు ఆ సరుకు దొరకడం లేదని అన్నారు. ఇతర మల్టీనేషనల్ కంపెనీలు కూడా తమ బకాయిలు తక్షణమే చెల్లించకపోతే మద్యం సరఫరాను నిలిపివేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ లేఖలు రాసినట్టు, ఈ మెయిల్ పెట్టినట్టు వివరించారు. వాటాలు, పంపకాల్లో తేడాతోనే బిల్లుల చెల్లింపులు ఆగిపోతున్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాండ్స్ నిలిపివేసే పరిస్థితి ఉన్నదని, ఫలితంగా రాష్ట్రానికి మద్యం ఆదాయం దెబ్బతినే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పటికే హోలోగ్రామ్ టెండర్ల విషయంలో తన అల్లుడికి కావాలని ముఖ్యనేత, తన కుమారుడికి కావాలని మంత్రి పట్టుబట్టారని, వీరిద్దరి మధ్య కొట్లాటలతో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి బలిపశువుగా మారారని తెలిపారు. వీరితో పోరు పడలేక సదరు అధికారి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వెళ్లిపోయారని గుర్తుచేశారు.

పంటలకు క్రాప్ హాలిడే.. బీరు తయారీకి నీటి సరఫరా

ఈ ప్రభుత్వం బీరు కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యం రైతులకు ఇవ్వడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. మీకు బీరు కంపెనీలు ముఖ్యమా... రైతులు ముఖ్యమా అంటే బీరు కంపెనీలే ముఖ్యమని చెప్తున్నదని మండిపడ్డారు. మెదక్ జిల్లా సింగూరు డ్యామ్ రిపేర్ పేరు మీద రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాలకు,



మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టు కింద 30 వేల ఎకరాలకు ఈ వేసవిలో క్రాప్ హాలిడే ప్రకటించారని మండిపడ్డారు. కానీ, సంగారెడ్డి జిల్లాలో ఉన్న పదుల సంఖ్యలోని బీరు తయారీ కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరం నీటి సరఫరా చేస్తున్నారని విమర్శించారు. ఆబ్కారీశాఖ స్పెషల్ సీఎస్ ఇటీవల సంగారెడ్డి జిల్లాకు వెళ్లి నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమై రైతులకు నీటి సరఫరా నిలిపివేయాలని, బీరు కంపెనీలకు నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశాలు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీరు కంపెనీల కోసం సింగూరు నీళ్లు నిల్వచేసి సరఫరా చేస్తున్న సర్కార్.. రైతులకు మాత్రం క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది మద్యం తయారుదారు ప్రభుత్వమా? లేదా రైతు ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. రేవంత్ సర్కారు చర్యలను బట్టి చూస్తే ఇది బీరు కంపెనీలకు కొమ్ముకాసే ప్రభుత్వమని తేటతెల్లం అవుతున్నదని విమర్శించారు.

గౌడన్నలకు రూపాయి పరిహారం ఇవ్వని సర్కార్

కేసీఆర్ హయాంలో తాడిచెట్టు మీద నుంచి పడి వికలాంగులైన గౌడ కులస్తులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే పరిహారం రూ.10 లక్షలు ఇస్తామని నమ్మబలికిన రేవంత్ సర్కార్ ఇప్పటివరకు పది రూపాయల పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండేండ్లలో 850 మంది గౌడలు తాడిచెట్టుపై నుంచి మరణించడం, వికలాంగులు కావడం జరిగిందని తెలిపారు. వారికి పరిహారంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ గత రెండేండ్లలో అక్రమ కేసులు పెట్టి వందల మంది గౌడన్నలను జైళ్లకు పంపించిందని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో 2024 అక్టోబర్ నెలలో గౌడ కులస్తులను కలిసి 'రేపటిలోగా' మొత్తం బకాయిలు చెల్లిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రేవంత్ హామీ ఇచ్చి 15 నెలలు అవుతున్నా రూపాయి కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చిందని, గల్లీగల్లీకి బెల్ట్‌షాపులు పెట్టిందని ఆరోపించారు. రెండేండ్లలో మద్యం ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని పెంచుకున్నదని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మీ ఇవ్వలేదు. తులం బంగారం ఇవ్వలేదు. కానీ, రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చి మహిళలకు మాంగళ్యాన్ని మాత్రం దూరం చేస్తున్నది' అని మండిపడ్డారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న భరత్‌కుమార్. చిత్రంలో లలిత, వాసుదేవరెడ్డి

అప్రజాస్వామికంగా మున్సి 'పోల్స్' షెడ్యూల్

- నామినేషన్ల దాఖలుకు నాలుగు రోజులేనా?
- ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టేలా ఈ నిర్ణయం
- మేడారం జాతరలో అంతా బిజీ
- డాక్యుమెంట్ల సమీకరణకు ఈ సమయం అసాధ్యం
- ఎన్నికల సంఘం తీరు సరికాదు
- కనీసం వారం గడువు ఇవ్వాలి
- బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ ఎన్నికల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య పద్ధతులను విస్మరించిందని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ పక్క సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైందని, ఈ సమయంలో నామినేషన్లు వేయడానికి ఇచ్చిన సమయం సరిపోదని పేర్కొన్నారు. కనీసం వారం రోజులైనా గడువు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 30 వరకు మాత్రమే గడువు విధించారని, నాలుగు రోజుల సమయం ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. కేవలం ప్రతిపక్షాలను దృష్టిలో పెట్టుకొని తగిన సమయం ఇవ్వలేదని విమర్శించారు.

అంత తొందరెందుకు?

రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి, తగిన డాక్యుమెంట్లు సమకూర్చుకోవడానికి ఈ సమయం ఏ మాత్రం సరిపోదని సోమ భరత్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇంత తొందర దేనికి? అని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విషయం లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై బీఆర్‌ఎస్ నిరసన వ్యక్తం చేస్తున్నదని స్పష్టం చేశారు. అధికారం ఉంది కదా! అని తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎలా? అని ప్రశ్నించారు. దేశంలో ఎప్పుడూ ఇంత తప్పుడు పద్ధతుల్లో షెడ్యూల్ విడుదల చేయలేదని పేర్కొన్నా రు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం తమ పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

ఒక్కో పార్టీకి ఒక్కో నీతా?

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో అసెంబ్లీ స్పీకర్ ఒక్కో పార్టీకి ఒక్కో నీతి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, సుప్రీంకోర్టు ఇప్పటికే రెండు సార్లు స్పీకర్‌కు తాఖీదులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఈ నెల 30న హాజరు కావాలని ఆదేశించారని, పార్టీ ఫిరాయింపుపై అన్ని ఆధారాలున్నా చర్యలకు స్పీకర్ వెనుకాడుతున్నారని విమర్శించారు. ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఉన్న అసెంబ్లీ స్పీకర్ రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కే వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రతినిధి లలితారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

- కాంగ్రెస్, బీజేపీ నుంచి వలసలు



జనగామకు చెందిన ఉలిగిల్ల చంద్రయ్య దంపతులు తమ అనుచరులతో బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 28 : మున్సిపల్ ఎన్నికల వేళ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ముఖ్య నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో భారీ గా చేరారు. జనగామలో బీజేపీకి చెందిన ఉలిగిల్ల చంద్రయ్య-స్వరూప దంపతులు, అనుచరులు, సీనియర్ నాయకుడు ఆలూరి రమేశ్‌తో బీఆర్‌ఎస్‌లో చేరారు. జనగామ మండలం చీట కోడూరుకు చెందిన సదం మదన్‌మోహన్ బీఆర్‌ఎస్‌లో చేరగా వీరందరికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. గద్వాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి సాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్, బీఆర్‌ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతు నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కేశవ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. గద్వాల జిల్లా అయిజ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుకుమార్‌తోపాటు ఆయన అనుచరులు బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే విజయుడు పార్టీలోకి ఆహ్వానించారు. జగిత్యాల జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుమ్ముల అంజయ్య, ఏనుగుల భూమయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు గులాబీ కండువాలు పార్టీలోకి స్వాగతించారు. 36వ వార్డుకు చెందిన ఆరుమూల మానస శివకుమార్‌తోపాటు 50 మంది బీజేపీ నాయకులు గులాబీ గూటికి చేరారు. కోరుట్ల పట్టణానికి చెందిన పద్మశాలీ సంఘం నాయకుడు, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌తోపాటు తోటరాజు, 25 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య యాదవ్ కాంగ్రెస్‌ను వీడి సొంత గూటికి చేరారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రాన్ని దోచేస్తరు

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- ఎన్నికల భయంతోనే శిలాఫలకాలు వేస్తున్నరు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఫైర్



భూపాలపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మండలి చైర్మన్ బండా ప్రకాశ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు

కృష్ణ కాలనీ, జనవరి 28 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రాష్ట్రాన్నే దోచేస్తారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి బండా ప్రకాశ్ అన్నారు. బుధవారం భూపాలపల్లిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు పక్షం రోజులుగా నిత్యం వార్తల్లోకి ఎక్కుతున్నారని తెలిపారు. ఓ మంత్రి కోల్ దందాలో భాగస్వాముడయ్యాడని, సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్దికి కాంట్రాక్టులు అప్పజెప్పుతున్నాడని వాళ్లకు వాళ్లే తిట్టుకుంటూ, ఒకరు చేసిన అక్రమాలను మరొకరు బయటపెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వానికి ఓట్లేస్తే రాష్ట్రాన్ని దోచేస్తారని విమర్శించారు. తాజాగా నలుగురు మంత్రులు నైని బ్లాక్ కుంభకోణంపై రహస్యంగా సమావేశమై ముఖ్యమంత్రి పదవికి ఎసరు పెడుతున్నారని మిగతా మంత్రులు దుమ్మెత్తి పోస్తుంటే, ఆ నలుగురు మంత్రులు మున్సిపల్ ఎన్నికల కోసం సమావేశమయ్యామని బయటికి ప్రగల్భాలు పలుకుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూపాలపల్లి జిల్లాను రద్దు చేసే కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. జిల్లా రద్దయితే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమివేయాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుని గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికలు ఉన్నాయని భయపడి, జీవో, కాపీలు లేని నిధులతో వారం రోజులుగా మంత్రులంతా భూపాలపల్లికి వరుసకట్టి ఊరంతా వందకు పైగా శిలాఫలకాలు వేశారని, దమ్ముంటే ఆ శిలాఫలకాల నిధుల జీవో కాపీలను పట్టణ ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ విస్తరణను అడ్డుకోవడమే లక్ష్యం

- సీపీఎం నేతలు జాన్‌వెస్లీ, జూలకంటి రంగారెడ్డి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మతతత్వ బీజేపీ పార్టీ విస్తరణను ఎక్కడికక్కడ అడ్డుకోవడమే సీపీఎం లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలతో అవగాహన పోటీ ఉంటుందని, సీపీఎం బలంగా ఉన్న స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల్లో 'బ్రీత్ అనలైజర్లు' పెట్టాలి

- ఎలక్షన్ కమిషన్‌కు డ్రింకర్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సరికొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది. మద్యం మత్తులో ఓటు వేసేందుకు వచ్చే వారిని నిరోధించేందుకు పోలింగ్ కేంద్రం వద్ద 'బ్రీత్ అనలైజర్' పరీక్షలు నిర్వహించాలని రెవెన్యూ కింగ్స్ ఆఫ్ డ్రింకర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తిచేసింది. అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.

బస్తీమే గులాల్

మొదటిపేజీ తరువాయి...

పరిధిలోని రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులతో విస్తృత సమాలోచనలు జరిపారు. ఎన్నికల్లో స్థానిక పరిస్థితులకనుగుణంగా బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహాన్ని సిద్ధం చేశారు. ఇటీవల పార్టీ గుర్తులేని సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు, అక్రమాలను ఎదుర్కొని నిలిచి గెలిచి సత్తా చాటిన బీఆర్‌ఎస్ శ్రేణుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అజేయ ఎజెండాను ఖరారు చేశారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ, కేసీఆర్ పాలనలో పురోగమించిన మున్సిపాలిటీలు, దేశవ్యాప్తంగా తెలంగాణకు కీర్తితెచ్చిన పట్టణప్రగతి వంటి కార్యక్రమాలు ఓ వైపు.. రెండేండ్లుగా రేవంత్ సర్కార్ హైడ్రా కూల్చివేతలు, పట్టణ ప్రజలకు శాపంగా మారిన వైనాన్ని ప్రజలకు ఎలా వివరించాలి అనే స్పష్టత వచ్చిన నేపథ్యంలో గులాబీ శ్రేణులు ఉద్యమస్ఫూర్తితో పోరుకు సిద్ధమయ్యారు.

మారుతున్న ముఖచిత్రానికి జీపీ ఫలితాలే నిదర్శనం

ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, అడ్డదారులు తొక్కినా రాష్ట్రవ్యాప్తంగా 45శాతం గ్రామ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటింది. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారుతున్నదనేందుకు జీపీ ఫలితాలే సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు బీఆర్‌ఎస్‌వైపు చూస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అనూహ్య విజయాలను సొంతం చేసుకుంటుందనే ఆశాభావం సర్వత్రా వ్యక్తం అవుతున్నది.

పురపోరు

జిల్లాల ఎత్తివేత మున్సిపాలిటీలకు మరణశాసనమే

జిల్లాలను పునర్వవస్థీకరిస్తామని రేవంత్ సర్కార్ చేసిన ప్రకటన కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకే కాక ఎంతోకాలంగా ఉన్న మున్సిపాలిటీల ఉనికి, వాటి పురోభివృద్ధిపై రాష్ట్రవ్యాప్తంగా అనుమానాలున్నాయి. జనగామ, నారాయణపేట, వనపర్తి, సిద్దిపేట, సిరిసిల్ల, నిర్మల్, ములుగు, మంచిర్యాల వంటి జిల్లాలను రద్దు చేస్తారనే ఆందోళన ప్రజల్లో నెలకొన్నది. బీఆర్‌ఎస్ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పడటమే కాకుండా ఆయా జిల్లాకేంద్రాలన్నీ దాదాపు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు పట్టణ ప్రాంత ప్రజలను తీవ్ర గందరగోళంలో పడేశాయి. ఈ తరుణంలో ఇదే అంశాన్ని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో విస్తృత చర్చ పెట్టాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది.

కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలే ఎజెండాగా

రాష్ట్రంలో రెండేండ్లుగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ 'పుర'పాలనా వ్యవస్థను ఎలా కుప్పకూల్చిందనే విషయాన్ని ప్రజలకు వివరించేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమైంది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆదర్శంగా మారిన మున్సిపాలిటీలు రెండేండ్ల రేవంత్ పాలనలో ఎలా నిరాదరణకు గురయ్యాయో ప్రజలకు వివరించాలని, ప్రత్యేక ప్రచార కార్యాచరణ రూపొందించుకోవాలని సూచిస్తున్నది. పారిశుధ్యం నుంచి వీధి దీపాల దాకా అన్ని అం శాల్లో కాంగ్రెస్ చేతులెత్తేసిందనే విషయాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని, రేవంత్ పాలనలో పట్టణాల్లో కొత్తగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, మున్సిపాలిటీలు సమస్యలకు కేరాఫ్‌గా మారిన దుస్థితిని ప్రచారాస్త్రంగా ప్రయోగించనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవలి దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో గత బీఆర్‌ఎస్ హయాంలో చేసిన పనులకు రేవంత్ సర్కార్ తిరిగి శిలాఫలకాలు వేస్తున్న తీరును కూడా బీఆర్‌ఎస్ ఎత్తిచూపుతున్నది.

కేసీఆర్ పట్టణ ప్రగతి.. రేవంత్ హయాంలో 'పుర' దుస్థితి

కేసీఆర్ హయాంలో చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీల రూపురేఖలు మారిపోయాయి. మున్సిపాలిటీలన్నీ రాష్ట్ర ప్రగతికి గ్రోత్ ఇంజిన్లు అయ్యాయి. కానీ, రెండేండ్లుగా మున్సిపాలిటీల్లో నెలకొన్న అధ్వాన పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు బీఆర్‌ఎస్ సన్నద్ధమైంది. మున్సిపల్ శాఖను సీఎం రేవంత్‌రెడ్డి తన వద్దే పెట్టుకొని, హైదరాబాద్‌లో ప్రయోగించిన హైడ్రానే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు విస్తరిస్తామనే ఆలోచనతో అనుకూల మీడియాలో లీకులు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కుట్ర కోణాన్ని పట్టణ ప్రజలకు వివరించేందుకు బీఆర్‌ఎస్ సమాయత్తం అవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, రెండేండ్లలో ఊసెత్తని విషయాన్ని బీఆర్‌ఎస్ ఇప్పటికే ప్రజలకు వివరించింది.

బీఆర్‌ఎస్‌లో చేరికలతో కాంగ్రెస్, బీజేపీ విలవిల

వరుస చేరికలతో బీఆర్‌ఎస్ జోష్‌లో ఉండగా, కాంగ్రెస్, బీజేపీలు విలవిల్లాడుతున్నాయి. ఇంకా పదిహేనేండ్లు తమదే అధికారం అని కాంగ్రెస్, తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేననే పోటాపోటీ ప్రకటనలతో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాయి. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు ఆ పార్టీల నేతలను నిద్రపోనివ్వడం లేదు. కాంగ్రెస్, బీజేపీలపై రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత తీవ్రతరం అవుతున్నదని బీఆర్‌ఎస్‌లో చేరికలు స్పష్టం చేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో వరుస చేరికలు ఒక ఎత్తయితే, బీజేపీకి రాజీనామా చేసి తాను బీఆర్‌ఎస్‌లో చేరుతానని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రకటించటం వంటి పరిణామాలను ఉదహరిస్తూ తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల ఆశలు గల్లంతే అవుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సర్కార్ చేతిలో ఈసీ తోలుబొమ్మ

- షెడ్యూల్‌కు, నోటిఫికేషన్‌కు మధ్య గడువు ఏది?
- గవర్నర్ జోక్యం చేసుకోవాలి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతిలో రాష్ట్ర ఎన్నికల సంఘం తోలుబొమ్మలా మారిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. షెడ్యూల్‌కు, నోటిఫికేషన్‌కు మధ్య ఒక రోజు కూడా గడువు ఇవ్వకుండా ఇంత హడావుడిగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా ఉండే మేడారం జాతరను సైతం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్మరించిందని ఆవేదన వ్యక్తంచేశారు. కోట్లాది మంది భక్తులు మేడారం వెళ్లే సమయంలో ఎన్నికలు నిర్వహించడమా? ఇది ప్రజల విశ్వాసాలను దెబ్బతీయడం కాదా? అని సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షకుడిగా గవర్నర్ ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా శ్రవణ్ విజ్ఞప్తి చేశారు.

బీసీలను మోసం చేసిన రేవంత్ రాజీనామా చేయాలి

- మున్సిపల్ ఎన్నికల పేరుతో బీసీలకు మళ్లీ అన్యాయం
- బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



రవీంద్రభారతి, జనవరి 28 : రాష్ట్రంలోని బీసీలను మోసగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 15 బీసీ కులసంఘాల సమావేశం, బీసీ సంక్షేమ సంఘం కో ఆర్డినేటర్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించి రూ.3వేల కోట్ల సాకుతో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి బీసీలను దగా చేసిందని, కోర్టు తీర్పు బీసీలకు అనుకూలంగా వస్తుందని భావించే హడావుడిగా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయించి మరోసారి బీసీలను మోసగించారని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 28శాతం ఇచ్చి బీసీ వ్యతిరేకిగా ముద్ర వేసుకున్నదని పేర్కొన్నారు. 2028లో బీసీలంతా ఏకమై కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ఆ పార్టీని బంగాళాఖాతంలోకి విసిరేయడం ఖాయమని హెచ్చరించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుం డా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నయవంచనకు గురిచేసిందని ధ్వజమెత్తారు. సమావేశంలో బీసీ నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల మున్సిపాలిటీని భ్రష్టుపట్టిచ్చిండు

- అవినీతికి కేంద్రంగా మార్చిన ఎమ్మెల్యే సంజయ్
- ఆయన కారణంగా 16 మంది కమిషనర్లు మారిండ్రు
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఫైర్



జగిత్యాల, జనవరి 28: 'జగిత్యాల మున్సిపాలిటీని ఎమ్మెల్యే ఎం సంజయ్‌కుమార్ భ్రష్టుపట్టిచ్చిండు. అవినీతికి కేంద్రంగా మార్చిండు. ఏసీబీ దాడులు, విజిలెన్స్ విచారణనే ఇందుకు నిదర్శనం. ఉన్నది మాట్లాడితే ఉలిక్కిపడుతున్నడు' అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గత ఐదేండ్ల మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలంలో 16 మంది కమిషనర్లు మారిన సందర్భాలు దేశంలోనే ఎక్కడా చూడలేదని అన్నారు. ఎనిమిది మంది ఉద్యోగులు జైలుపాలు కావడం ఎమ్మెల్యే పుణ్యమేనని దుయ్యబట్టారు. ఆయన వేధింపులు తట్టుకోలేకనే మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా చేశారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంక్ అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోర్టు చెప్పినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ఎల్ఎల్ గార్డెన్ రోడ్డు నిజామాబాద్ రోడ్డుకు ప్రత్యామ్నాయం అవుతుందని వెంటనే విస్తరించాలని ఏండ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని, పైగా తానే ఆ రోడ్డును అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు యావర్ రోడ్డును 100 ఫీట్లకు విస్తరించాలని ప్రభుత్వానికి నివేదిస్తే, కాంగ్రెస్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని తొక్కిపెట్టిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జగిత్యాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభించి రెండేండ్లు గడుస్తున్నదని, కాంట్రాక్టర్లకు బిల్లు రాకపోవడంతో వారు గోడౌన్‌గా ఉపయోగించుకుంటున్నట్టు తెలిపారు. జగిత్యాల రాష్ట్రంలోనే అవినీతికి కేంద్రంగా మారిందని ఆరోపించారు. పార్టీ కోసం పదేండ్లు కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తల శ్రమను ఎమ్మెల్యే సంజయ్ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు.


మంత్రులు నన్ను కలవడంలో తప్పేముంది?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేకపోవడంతోనే కలిశారు
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మధిర, జనవరి 28: మంత్రులు తనను కలవడంలో తప్పేముందని, ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతోనే తనను కలిసేందుకు ప్రజాభవన్‌కు వచ్చారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టంచేశారు. తనను కలవకుండా పిచ్చి వార్తలు రాసే వారిని కలవాలా? అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాము పాలనాపరమైన అంశాలపైనే చర్చించామని స్పష్టంచేశారు. క్యాబినెట్‌లోని మంత్రులంతా ఉమ్మడి కుటుంబంలా రాష్ట్ర భవిష్యత్తు కోసం పని చేస్తున్నామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పొత్తుల అంశం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయిస్తారని స్పష్టంచేశారు.

విపత్తుల నిర్వహణకు 100 కోట్లతో పరికరాలు



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలో విపత్తుల నిర్వహణ విభాగం ఫైర్ సర్వీసెస్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ఐసీసీసీ విభాగాలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, ఫైర్ అండ్ సెర్చ్ ఆపరేషన్ల కోసం సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

తొలిరోజు 902 నామినేషన్లు

- కాంగ్రెస్ 382, బీఆర్‌ఎస్ 258, బీజేపీ నుంచి 169 దాఖలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగడంతో తొలిరోజే నామినేషన్ల పర్వం ఊపందుకున్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) 2026 మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 382, బీఆర్‌ఎస్ నుంచి 258, బీజేపీ నుంచి 169, సీపీఎం నుంచి 8, బీఎస్పీ నుంచి 7, ఆప్ నుంచి ఒకటి, ఎంఐఎం నుంచి మూడు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి 19, స్వతంత్ర అభ్యర్థులు 55 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

ఎస్‌ఈసీ మార్గదర్శకాలు

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఎస్‌ఈసీ విడుదల చేసింది. మున్సిపాలిటీల్లో జనరల్ అభ్యర్థులకు నామినేషన్ ఫీజు 2,500, ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు రూ.1,250గా నిర్ణయించారు. కార్పొరేషన్లలో ఇది వరుసగా రూ.5,000, 2,500గా పేర్కొన్నారు. మున్సిపాలిటీ వార్డు సభ్యుడు రూ.1,00,000 వరకు ప్రచారానికి ఖర్చు చేసేందుకు అనుమతి ఉన్నది.

ప్రేమ పెండ్లికి ఒప్పుకోలేదని..
మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చిన సురేఖ
తల్లిదండ్రులనే పొట్టనపెట్టుకున్న కూతురు



వికారాబాద్‌లో మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 28 : ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడిని పెండ్లి చేసుకునేందుకు తల్లిదండ్రులు ససేమిరా అనడంతో వారికి కన్న కూతురే మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చింది. ఈ విషాద ఘటన వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారంలో చోటుచేసుకున్నది. ఈ నెల 24న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. యాచారం గ్రామానికి చెందిన నక్కలి దశరథ్, లక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అశోక్ హైదరాబాద్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. కూతురు సురేఖ(25) బీఎస్సీ నర్సింగ్ చేసి సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పనిచేస్తున్నది. ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయం కాగా.. ఇద్దరూ ప్రేమించుకున్నారు. వారి ప్రేమ విషయమై తల్లిదండ్రులకు చెప్పడంతో వారి పెండ్లికి తల్లిదండ్రులు అంగీకరించలేదు. తల్లిదండ్రులను ఎలాగైనా హత్య చేసి ప్రేమించిన అబ్బాయిని పెండ్లి చేసుకోవాలని పథకం రచించింది. ఎక్కువ డోస్ మత్తుమందు ఇంజక్షన్ ఇచ్చి చంపాలని భావించింది. తాను పనిచేస్తున్న హాస్పిటల్‌లో మ త్తు ఇంజెక్షన్లు (అట్రాక్యురియం) అర్టాసిల్ 2.5 ఎంఎల్ ఇంజక్షన్లు నాలుగు బాటిళ్లను తస్కరించింది. పథకం ప్రకారం ఈనెల 24న సంగారెడ్డి నుంచి మోమిన్‌పేట్‌కు వెళ్లి మెడికల్ షాప్‌లో మూడు సిరంజీలను తీసుకొని యాచారానికి వచ్చింది. రాత్రి సమయంలో తల్లిదండ్రుల ముందు మరోసారి వారి ప్రేమ విషయాన్ని ప్రస్తావించగా వారు నిరాకరించారు. దీంతో మోకాళ్ల నొప్పులు తగ్గడానికి మందులు తీసుకొచ్చానని తల్లిదండ్రులను నమ్మించింది. వెంట తెచ్చుకున్న మత్తుమందును మోతాదుకు మించి ఇవ్వడంతో వారు అక్కడికక్కడే చనిపోయారు. తనకేమీ తెలియదు అన్నట్టుగా అన్న అశోక్‌కు ఫోన్‌చేసి.. 'అమ్మానాన్నలు చనిపోయారు. నాకు భయమేస్తుంది. తొందరగా రావాలి' అంటూ విలపించింది. అశోక్ వచ్చి చూడగా తల్లిదండ్రుల మృతి పట్ల అనుమానం కలుగడంతో వెంటనే బంట్వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా నాలుగు ఇంజెక్షన్ ఖాళీ బాటిళ్లు, వాడిన రెండు సిరంజీలు లభించాయి. కేసు నమోదు చేసిన పోలీసులు.. సురేఖపై అనుమానంతో విచారించారు. తల్లిదండ్రులను తానే చంపినట్టు అంగీకరించడంతో ఆమెను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో సీఐ రఘురాము, ఎస్సై విమల పాల్గొన్నారు.

పేదల ఇండ్లపైకి
కాంగ్రెస్ బుల్డోజర్

ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేలమట్టం
- నిర్దాక్షిణ్యంగా కూల్చివేతలు
- ప్రశ్నించిన వారిపై బలప్రయోగం
- ఖమ్మం రావిచెట్టు బజార్‌లో ఘటన
- కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి తప్పు చేసినం : ఇండ్ల బాధితులు



ఖమ్మం ప్రకాశ్‌నగర్ రావిచెట్టుబజార్‌లో ఇండ్లు, ప్రహరీలను కూల్చుతున్న జేసీబీ

ఖమ్మం సిటీ, జనవరి 28: నలభై ఏండ్లుగా ఖమ్మం గ్రెయిన్ మార్కెట్‌ను, చిన్న చిన్న వృత్తులనే నమ్ముకొని బతుకీడుస్తున్న పేదలపై రేవంత్ సర్కార్ కక్షగట్టింది. ముందస్తు నోటీసులేవీ ఇవ్వకుండా వారి ఇండ్లపైకి బుల్డోజర్‌ను పంపింది. అభివృద్ధి పేరుతో నివాసాలను నేలమట్టం చేసి ఆ అభాగ్యులకు నిలువ నీడ లేకుండా చేసింది. ఇదీ ఖమ్మం జిల్లాకేంద్రంలోని ప్రకాశ్‌నగర్-రావిచెట్టు బజార్ ప్రాంతంలో బుధవారం కార్పొరేషన్, పోలీసు అధికారుల దౌర్జన్యకాండ. ఖమ్మంలోని గ్రెయిన్ మార్కెట్‌కు, వెంకటగిరి క్రాస్ రోడ్డు మీదుగా ముదిగొండ లేదా కోదాడ బైపాస్‌కు తేలిగ్గా రాకపోకలు సాగించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) యంత్రాంగం రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. అలాగే బోనకల్లు ప్రాంతం నుంచి రైతులు అగ్రహారం మీదుగా తమ పంట ఉత్పత్తులను ఖమ్మంలోకి వెళ్లకుండా నేరుగా మార్కెట్‌కు చేరవేసుకోవచ్చనే ఆలోచనతో కేఎంసీ 28వ డివిజన్ ప్రకాశ్‌నగర్ శివారు రావిచెట్టు బజారులో రహదారి విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది. దీనికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పచ్చజెండా ఊపడంతో అధికారులు ఆగమేఘాల మీద పనులు ప్రారంభించారు. కానీ, ఆ ప్రాంతంలో మూడు నాలుగు దశాబ్దాల నుంచి నిరుపేదలు స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకున్నారు. అయితే వారికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. న్యాయస్థానాలకు వెళ్తారని భావించారో ఏమో.. నోటీసులు కూడా జారీ చేయలేదు. పదుల సంఖ్యలో జేసీబీలను పేదల ఇండ్ల మీదికి ఎగదోశారు. కనీసం ఇండ్లల్లోని సామగ్రిని కూడా బయటకు తీసే సమయం ఇవ్వకుండా అత్యంత కర్కశంగా కూల్చివేశారు. పక్షవాతం, ఇతర జబ్బులతో మంచం పట్టిన వారిని బలవంతంగా బయటకు తీసుకొచ్చి పడేశారు. మహిళలు, చిన్నారులు అనే కనికరం కూడా లేకుండా భయానక వాతావరణాన్ని సృష్టించి బుల్డోజర్లను ఎక్కుపెట్టారు. ఆగ్రహించిన కొందరు.. అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడే మోహరించిన వందలాది పోలీసులు వారిపై అత్యుత్సాహం ప్రదర్శించారు. లారీలు, వ్యాన్లు, జీపుల్లో అందరినీ బలవంతంగా అరెస్టు చేసి ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో విసుగెత్తిన బాధితులు 'కాంగ్రెస్‌కు ఓట్లేసి తప్పు చేశాం.. మార్పు అని చెప్పి అధికారంలోకి వచ్చి మమ్ములను రోడ్డుపాలు చేశారు.. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి.. బీఆర్‌ఎస్ ఉన్నప్పుడే మంచిగుండె. వాళ్లను ఓడించి తప్పు చేశాం' అంటూ కంటనీరు పెట్టుకున్నారు.

జగ్గారెడ్డి హెచ్చరిక.. సర్కార్ లైట్

- కర్దనూర్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన
- జిల్లా మంత్రి దామోదర డుమ్మా.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బాయ్‌కాట్
- కాంగ్రెస్ నేతలు కాటా, నీలం మధు సైతం గైర్హాజరు



పటాన్‌చెరు కర్దనూర్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్

సంగారెడ్డి, జనవరి 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో కీలకనేతగా పేరున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హెచ్చరికలను సొంత పార్టీ సీరియస్‌గా తీసుకోలేదు. సంగారెడ్డి నుంచి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొవద్దని, ఒకవేళ తరలిస్తే ఊరుకునేది లేదని జగ్గారెడ్డి మంగళవారం సొంత ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. డీఆర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు కోసం పటాన్‌చెరు మండలం కర్దనూర్‌లో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జగ్గారెడ్డి హెచ్చరికలను పట్టించుకోలేదు. యథావిధిగా బుధవారం కర్దనూర్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు మంత్రులు పొంగులేటి, గడ్డం వివేక్ శంకుస్థాపన చేశారు. కర్దనూర్‌లో కాంప్లెక్స్ భవనం పూర్తికాగానే సంగారెడ్డి నుంచి జిల్లా రిజిస్ట్రార్, సంగారెడ్డి, పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సంగారెడ్డి నుంచి రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షు డు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. జగ్గారెడ్డి సైతం కార్యాలయాల తరలింపుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా నేతల హెచ్చరికలు, డిమాండ్లను పట్టించుకోకుండా బుధవారం మంత్రి పొంగులేటి కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. కాగా ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకాలేదు. కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సైతం బాయ్‌కాట్ చేశారు.

ఎవరిని అడిగి ఏర్పాటు చేస్తున్నరు: గూడెం

ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌ను ఎవరిని అడిగి పటాన్‌చెరు మండలం కర్దనూర్‌లో ఏర్పా టు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో కలెక్టర్, మంత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతానికి కేవలం పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు మాత్రమే కావాలని తాము కోరినట్టు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు సమయంలోనూ కలెక్టర్ తనను సంప్రదించలేదని అందుకే శంకుస్థాపన కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేసినట్టు తెలిపారు. కాగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మరో ముఖ్యనేత నీలం మధు సైతం శంకుస్థాపనకు దూరంగా ఉన్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపును జగ్గారెడ్డి వ్యతిరేకించగా.. ఆయన సతీమణి, నిర్మలా జగ్గారెడ్డి మాత్రం హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది.

• ఈబీసీ కమిషన్ ఏర్పాటుకు కృషి చేయాలి



ఈబీసీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలని మాజీ మంత్రి జానారెడ్డికి ఈబీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఈబీసీ జేఏసీ జాతీయ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి నేతృత్వంలో 18 అగ్రకులాల పేదల సంఘాల ప్రతినిధులు జానారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మొత్తం జనాభాలో 25శాతం మంది అగ్రకులాలవారు ఉన్నారని వారిలో అత్యధికులు నిరుపేదలేనని గుర్తు చేశారు. -హైదరాబాద్

ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
పీకే శ్రీమతి, కననిక ఘోష్



మీడియాతో మాట్లాడుతున్న కననిక ఘోష్. చిత్రంలో పీకే శ్రీమతి, తపసి ప్రహరాజ్, మరియం ధావ్‌లె, మల్లు లక్ష్మి తదితరులు

- 114 మందితో జాతీయ కమిటీ
- 36 మందితో కేంద్రం కార్యదర్శివర్గం
- తెలంగాణ నుంచి మల్లు లక్ష్మి సహా మరో నలుగురికి కమిటీలో చోటు
- ముగిసిన జాతీయ మహాసభలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) జాతీయ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీకే శ్రీమతి, కననిక ఘోష్ ఎన్నికయ్యారు. 14వ జాతీయ మహాసభలు బుధవారం హైదరాబాద్‌లో ముగిశాయి. ఈ సందర్భంగా సంఘం జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 36 మందితో జాతీయ కార్యదర్శివర్గం, 114 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రభావతి, ఆశాలత, బండి పద్మకు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో స్థానం కల్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను కేంద్ర కమిటీలోకి నూతనంగా తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ మహాసభల్లో ఐద్వా అనేక తీర్మానాలను ఆమోదించింది. ముగింపు సభలో మరోసారి అధ్యక్షురాలిగా ఎన్నికైన పీకే శ్రీమతి మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు మెరుగైన జీవితం అందించడం కోసం నేటి మహిళలు పోరాటమార్గంలో నడువాలని పిలుపునిచ్చారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కార్యక్రమాలను అమలు చేయగలిగినప్పుడు, ఇతర రాష్ట్రాలు ఎందుకు చేయలేకపోతున్నాయని ప్రశ్నించారు. జాతీయ మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

హక్కుల కోసం పోరు : కననిక ఘోష్

మహిళా హక్కుల కోసం చివరిదాకా పోరాడుతామని ఐద్వా నూతన ప్రధాన కార్యదర్శి కననిక ఘోష్ బోస్ స్పష్టం చేశారు. మహాసభల ముగింపు అనంతరం జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, జాతీయ కోశాధికారి తపసి ప్రహరాజ్, ఉపాధ్యక్షులు మరియం ధావ్‌లే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. హక్కులిస్తే తీసుకుంటాం.. లేదంటే లాక్కుంటామని, మధ్యలో వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నరేగా చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన ఐద్వా 14వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయని మహాసభల రిసెప్షన్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ఈనెల 24 నుంచి బుధవారం వరకు ఈ సభలు జరిగాయని తెలిపారు.

నయీం అక్రమాస్తులపై ఈడీ చార్జిషీట్

విచారణకు స్వీకరించిన రంగారెడ్డి జిల్లా కోర్టు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం రంగారెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. దీన్ని కోర్టు విచారణకు స్వీకరించడంతో నిందితులకు త్వరలో నోటీసులు జారీచేసే అవకాశం ఉన్నది. 2016 జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీం మృతి చెందిన విషయం తెలిసిందే. అనంతరం అతని అకృత్యాలపై బాధితులంతా పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇందులో భారీగా అక్రమాస్తులు, మనీ లాండరింగ్ లాంటి అంశాలు కూడా ఉండటంతో ఈడీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టింది. దీనిలో భాగంగా నయీం తన గ్యాంగ్‌తో కలిసి సంపాదించిన సుమారు రూ.11.30 కోట్ల విలువైన 91 ఆస్తులను ఈడీ ఇదివరకే గుర్తించి 10 మందిపై అభియోగాలు నమోదు చేసింది. యజమానులను బెదిరించి బలవంతంగా ఈ 91 ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. నిందితులకు నోటీసులు జారీచేసినా విచారణకు హాజరుకాకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. అవసరమైతే వారికి నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలని కోర్టును కోరినట్టు తెలిసింది. నయీం వ్యవహారంపై గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. నయీం 27 హత్యలతోపాటు నేరాలకు పాల్పడినట్టు బృందం గుర్తించింది.

ఏపీలో కూటమి ఎమ్మెల్యేపై
లైంగికదాడి ఆరోపణలు

- రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ వీడియో వైరల్
- బెదిరించి లొంగదీసుకున్నట్టు మహిళ ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఏపీలోని తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే తనపై లైంగిక దాడి చేయడంతో పాటు ఐదుసార్లు అబార్షన్ చేయించారని ఓ మహిళ ఆరోపించింది. 2024లో అరవ శ్రీధర్‌కు ఓ అంశమై ఫేస్ బుక్ ద్వారా అభినందనలు చెప్పినట్టు మహిళ పేర్కొన్నారు. టెలిగ్రామ్ యాప్‌లో మాట్లాడుదామంటూ తన వివరాలతో పాటు ఫోన్ నంబర్ తీసుకున్నట్టు వెల్లడించారు. భర్తకు దూరంగా ఉంటున్న తనను బెదిరించి జూలై 9న కారులో లైంగికదాడి చేశారని ఆరోపించింది. ఇదే విషయమై మహిళ బుధవారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్ తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను కొట్టి, తిట్టి ఎమ్మెల్యే లోబర్చుకున్నట్టు ఫిర్యాదులో పొందుపర్చారు. పెండ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసం చేశాడని పేర్కొన్నది

విచారణకు 'జనసేన' కమిటీ

రైల్వే కోడూరు ఎమ్మెల్యేపై లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో జనసేన పార్టీ విచారణకు కమిటీ వేసింది. ముగ్గురు సభ్యులతో వేసిన ఈ కమిటీలో టీ శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టీ సీ వరుణ్ ఉన్నారు. ఈ కమిటీ ముందు ఏడు రోజుల్లోపు శ్రీధర్ హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నివేదిక ఇచ్చే వరకు కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది.

బీఈడీ పూర్తి చేసినవారికి
ఇంటర్న్‌షిప్
విద్యాశాఖపై సమీక్షలో సీఎస్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బీఈడీ పూర్తి చేసిన వారికి సర్కార్ బడుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై రాష్ట్ర సచివాలయంలో బుధవా రం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు రిటైర్డ్ టీచర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లతో తరచూ ముఖాముఖి నిర్వహించాలని సూచించారు. దీంతో వారిలో సృజనాత్మకత, స్ఫూర్తివంతమైన ఆలోచనలు పెరిగే అవకాశమున్నదని తెలిపారు.

విద్వేష ప్రసంగాలు నిషేధించాలి
రాష్ట్ర ప్రభుత్వానికి క్రైస్తవ సంఘాల వినతి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మైనారిటీలకు వ్యతిరేకంగా సాగుతున్న విద్వేషపూరితమైన ప్రసంగాలను నిషేధించే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్, పాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ గ్రూపులు ఈ ఒక్క నెలలోనే ఆరు ప్రదేశాల్లో క్రైస్తవులపై దాడులకు పాల్పడ్డారని బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. చర్చిలలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మైనారిటీలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తిచేశారు.

ప్రజలందరిపై తల్లుల దీవెన ఉండాలి

హరీశ్‌రావు ఆకాంక్ష



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు జాతర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫారెస్ట్ ఆఫీసర్లు పోలీసులు కాదు

ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం చెల్లదన్న హైకోర్టు

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): పోలీసులకు ఉండే అధికారాలు అటవీ శాఖ అధికారులకు ఉండవని హైకోర్టు స్పష్టం చేసింది. ఐపీసీ పరిధిలోకి వచ్చే నేరాలపై దర్యాప్తు జరిపే అధికారం పోలీసులకు మాత్రమే ఉంటుందని తేల్చింది. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసేందుకు మాత్రమే అటవీ అధికారులకు వీలుంటుందని పేర్కొన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో అక్రమంగా ప్రవేశించి అధికారిపై దాడిచేసినట్టు ఆరోపిస్తూ నమోదు చేసిన ప్రాథమిక నేర నివేదికను కొట్టేయాలంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌కు చెందిన సాయిరోహిత్ సహా ఆరుగురు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జే శ్రీనివాసరావు ఇటీవల విచారణ జరిపారు. ఐపీసీ కింద వారు కేసులు నమోదు చేయడం చెల్లదని తెలిపారు.

సిబిల్ స్కోర్ రిపోర్ట్‌లో వ్యక్తిగత సమాచారమా?

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): సిబిల్ స్కోరు రిపోర్టులో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించడమేంటని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రిజర్వు బ్యాంక్, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. గతంలో పలుసార్లు ఆదేశించినప్పటికీ కౌంటర్లు దాఖలు చేయలేదని, మార్చి 17లోగా దాఖలు చేయకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించింది.



మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుంటున్న లక్షలాది మంది భక్తులు

కొలువుదీరిన సారలమ్మ

అశేష జనప్రవాహంతో నిండిన వనం • నేడు గద్దెకు చేరనున్న సమ్మక్క తల్లి • ఉప్పొంగిన భక్తి పారవశ్యం • మహాజాతరలో తొలి ఘట్టం పూర్తి

ములుగు, జనవరి 28(నమస్తే తెలంగాణ) : కన్నెపల్లి కల్పవల్లి బుధవారం సారలమ్మ గద్దెను చేరడంతో మేడారం మహాజాతరలో తొలి అంకం మొదలైంది. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలుకగా, ముగ్గురి రాకతో మేడారమంతా సంబురంతో ఓలలాడింది. వనదేవతల దర్శనానికి జనం ప్రవాహంలా తరలివచ్చింది. అటు జంపన్న వాగు జనసందోహంతో కిక్కిరిసిపోయింది. రెండేండ్ల ఎదురు చూపుల తర్వాత సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో ఒక్కసారిగా భక్తకోటి పరవశించిపోయింది. సారలమ్మ.. సల్లంగ సూడు తల్లీ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. కన్నెపల్లి నుంచి మేడారం వరకు భక్తజనం సారలమ్మకు జేజేలు పలుకుతూ ప్రణమిల్లింది. తొలి ఘట్టం ఎలాంటి ఆటంకాలు లేకుండా పరిపూర్ణమైంది.

సారలమ్మ గద్దెకు చేరిందిలా..

సారలమ్మ రాక కోసం తెల్లవారుజాము నుంచే భక్తజనం తాకిడి మొదలైంది. సారలమ్మను తోడ్కొని వచ్చే ప్రధాన పూజారి(వడ్డె) కాక సారయ్య సహా ఇతర వడ్డెలు తొలుత గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల తర్వాత ఆనవాయితీ ప్రకారం కన్నెపల్లి నుంచి 16మంది ఆడబిడ్డలు డోలి విన్యాసాలతో తరలివచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క-సారలమ్మ కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంక వనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం 3గంటల నుంచే సారలమ్మ గుడి వద్ద డోలి విన్యాసాలు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారక్క యువజన సంఘం బృందాల కళా ప్రదర్శనలు నాలుగు గంటల పాటు కోలాహలం నెలకొన్నది. మంత్రి సీతక్క, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కన్నెపల్లి సారలమ్మ గుడి నుంచి రాత్రి 7.41గంటలకు మేడారంలోని గద్దెల వరకు తోడ్కొని బయలుదేరారు. కన్నెపల్లిలో ఇల్లిల్లూ తమ ఇంటి ఆడబిడ్డకు నీళ్లారగించి, చీరసారె పెట్టి, కొబ్బరికాయలు కొడుతూ మంగళహారతులు పట్టారు. కన్నెపల్లిలో వాడవాడనా తిరుగుతూ సారలమ్మను సాగనంపారు. అక్కడినుంచి రాత్రి జంపన్న వాగుకు చేరుకున్నది. జంపన్న తన అక్క సారలమ్మ కాళ్లు కడిగి(జంపన్నవాగు మీద జంట వంతెనలున్నా సరే కోయ జాతి సంప్రదాయం ప్రకారం వాగులోంచే సారలమ్మను తీసుకురావడం ఆనవాయితీ) మేడారానికి సాగనంపారు. జంపన్న వాగు నుంచి బయలుదేరిన సారలమ్మకు పగిడిద్దరాజు, గోవిందరాజుల వడ్డెలు స్వాగతం పలికారు. ముగ్గురి దేవతల ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేయగా డోలి విన్యాసాలు, కొమ్ముబూరల నాదంతో మేడారం మార్మోగింది.



జంపన్నవాగులో స్నానాలు చేస్తున్న భక్తులు

నేడు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాక

గురువారం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి దిగి వచ్చి, భక్తుల మొక్కులు అందుకోనున్నది. ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య సమ్మక్క తల్లిని గద్దెలపై ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం ఐదుగురు సమ్మక్క పూజారులు చిలుకలగుట్టపైకి వెళ్లి కుంకుమ భరిణ రూపంలోని సమ్మక్కను తోడ్కొని చిలుకలగుట్ట చివరి మూలమలుపు వద్దకు వస్తారు. అక్కడ కలెక్టర్ సమ్మక్క తల్లికి స్వాగతం పలుకగానే ఎస్పీ ఏకే 47తో గాల్లోకి తూటాలు పేల్చిన తర్వాత సమ్మక్క గుట్ట దిగుతుంది. అక్కడి నుంచి భక్తజన సందోహం నడుమ తల్లి రాకను స్వాగతం పలుకుతూ కోళ్లు, గొర్రెలు, మేకలను బలిస్తూ పూనకాలతో ఊగిపోతారు. సమ్మక్క తల్లి వస్తుందన్న సంకేతంతో జాతర ప్రాంగణం అంతా ఒక్కసారిగా ఉద్వేగానికి లోనవుతుంది. ఈ దశలో పూజారులు చాలా జాగ్రత్తగా తల్లిని తీసుకొని ప్రధాన ద్వారం గుండా గద్దెపైకి చేరుకొని ప్రతిష్ఠిస్తారు.

దారి పొడవునా జనసందోహం

సారలమ్మ మేడారానికి బయలుదేరిందన్న సమాచారంతో మేడారం జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోపతండాలుగా కన్నెపల్లికి పరుగులు తీశారు. గుడి నుంచి బయటికి వచ్చిన సారలమ్మ కన్నెపల్లిలో వాడవాడనా బిడ్డలకు దీవెనలిచ్చింది. కన్నెపల్లి నుంచి మేడారం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారి మొత్తం జన సందోహంతో పోటెత్తింది. భక్తుల శివసత్తుల పూనకాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ, ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ భక్తజనం సారలమ్మకు నీరాజనం పలికింది. తుడుందెబ్బ సహా పలు ఆదివాసీ సంఘాలు త్రివలయ విధానంతో సారలమ్మకు రక్షణగా నిలిచారు. పోలీసులు సైతం రెండు రోప్ పార్టీలు, రోడ్ క్లియరెన్స్ పార్టీలు ఏర్పాటు చేసి ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా చేశారు. సారలమ్మ మేడారం గుడిలోకి చేరగానే ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో దద్దరిల్లాయి. ప్రత్యేక పూజలు ముగిసిన తర్వాత ముగ్గురు కలిసి మేడారం గద్దెల ప్రాంగణానికి బయలుదేరారు. సరిగ్గా అర్ధరాత్రి 12.20 గంటలకు సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. అలాగే పగిడిద్దరాజు, గోవింద రాజులు వారివారి గద్దెలపై ఆసీనులయ్యారు.

ఇవి సమ్మక్క గద్దెలా? సెంట్రల్ జైలా?

- **లోపలికి వెళ్లాలంటే తాళాలు వేస్తున్నరు.. పర్మిషన్ తెచ్చుకోవాలట**
- **అమ్మవారి గద్దెలపై ఇతరులకేం పని**
- **పూజారులకు ఇంత అవమానమా?**
- **పూజారి సిద్దబోయిన అరుణ్‌కుమార్**



మేడారంలో మాట్లాడుతున్న పూజారి సిద్దబోయిన అరుణ్‌కుమార్

ములుగు, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : 'మేడారంలో అమ్మవారి గద్దెలపైకి పూజరులు రావాలంటే గేట్లకు తాళాలు వేస్తున్నరు. పర్మిషన్ తెచ్చుకోవాలని అడ్డుకుంటున్నారు.. మేం ఉండాల్సిన చోట బయటి వ్యక్తులెందుకున్నారు.. అమ్మవారి గద్దెలు సెంట్రల్ జైలులా ఉన్నాయి.. ఇక్కడ పూజారులకు ప్రాధాన్యత లేద'ంటూ మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు కుమారుడు, పూజారి అరుణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారం జాతర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పూజారులకు తీవ్ర అవమానం జరుగడంపై ఆయన మండిపడ్డారు. బుధవారం సారలమ్మ గద్దెకు చేరే సమయంలో పూజారులు, ఆదివాసీలు ఉండాల్సిన గద్దెలపై వలంటీర్లు, ఇతరుల కు అధికారులు అధిక ప్రాధాన్యమివ్వడం ఏమిటని ప్రశ్నించారు. పూజారులను బయటకు వెళ్లగొట్టే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు, పూజారులు లోపలికి రావాలంటే గేట్లకు తాళాలు వేసి పర్మిషన్ తెచ్చుకోవాలని అంటున్నారని, ఎవరి నుంచి పర్మిషన్ తెచ్చుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. గద్దెలపై వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది, ఇతరులు ఉంటున్నారని, పూజారులు ఎప్పుడూ వచ్చినా అడ్డుకుంటున్నారని, తమకు అనుమతి లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వద్దంటే తాము వెళ్లిపోతామని, జాతరను ఎవరు చేస్తారో చేసుకోండంటూ అరుణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

గుట్టలో గుట్టుగా డాలర్లు మాయం

- **ఏడాది కిందటే స్వామివారి వెండి, బంగారం డాలర్లు మాయం**
- **తాజా ఆడిట్ తనిఖీలో బహిర్గతం**
- **వాటి విలువ 10 లక్షల పైనే**
- **త్వరలో రికవరీ చేస్తాం: డీఈవో దోర్బల భాస్కర్ వెల్లడి**



స్వామి వారి బంగారం, వెండి డాలర్లు

యాదగిరిగుట్ట, జనవరి 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో రోజురోజుకూ అవినీతి పెరుగుతున్నది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలతోపాటు ఇతర రూపంలో వస్తున్న ఆదాయానికి కొంతమంది అధికారులు, సిబ్బంది గండికొడుతున్నారు. ఇటీవల స్వామివారి లడ్డూ ప్రసాదంలో చింతపండు చోరీ ఘటన మరువకముందే తాజాగా ప్రచార శాఖలో విక్రయించే బంగారు, వెండి డాలర్లు మాయమయ్యాయి. వీటి ఖరీదు సుమారు రూ.10లక్షలని అంచనా. ఇవి ఏడాది క్రితమే మాయం కాగా ఇటీవల ఆడిట్ అధికారులు తనిఖీలు నిర్వహించి బంగారం, వెండి డాలర్లు మాయమైనట్టు ధ్రువీకరించారు.

20 ఏండ్లుగా విక్రయాలు..

క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి వారి ప్రతిమతో కూడిన బంగారు, వెండితో సిద్ధం చేసిన డాలర్లను దాదాపు 20 ఏండ్లు గా విక్రయిస్తున్నారు. మధ్యలో కొన్నేండ్లు వాటి విక్రయాలు నిలిపివేశారు. కేసీఆర్ ప్ర భుత్వం వీటి విక్రయాలను తిరిగి ప్రారంభించింది. అప్పటినుంచి ఈవో పర్యవేక్షణలో దేవస్థాన ఏఈవో ఆధీనంలో కొనసా గే ప్రచార శాఖలో భద్రపరిచి విక్రయాలు సాగిస్తున్నారు. స్వామి వారికి వివిధ రూపాల్లో వచ్చిన బంగారం, వెండిని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మింట్ కంపౌండ్‌కు ఆల య ఈవో అందజేస్తారు. ఇందులో 200 బంగారం డాలర్లు, 1000 వెండి డాలర్లు సిద్ధం చేసిన తర్వాత ఈవో పర్యవేక్షణలో ఉంటాయి. ఇటీవలి తనిఖీల్లో బంగారం, వెండి డాలర్లు కనిపించకుండా పోయా యి. దీనిపై దేవస్థాన డీఈవో దోర్బల భాస్కర్‌ను వివరణ కోరగా త్వరలో రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.





'కింగ్ 100'లో టబు

సినీరంగంలో కొన్ని కాంబినేషన్‌లు ఎవర్‌గ్రీన్. వాటిలో నాగార్జున-టబు జోడీ ఒకటి. 'నిన్నే పెళ్లాడతా' 'ఆవిడా మా ఆవిడే' చిత్రాల ద్వారా వీరిద్దరు హిట్‌పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. వ్యక్తిగతంగా కూడా ఎన్నో ఏళ్లుగా ఇద్దరి మధ్య చక్కటి స్నేహసంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జున వందో చిత్రంలో సీనియర్ నటి టబు కీలక పాత్రలో నటించనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయమై నాగార్జున తాజా ఇంటర్వ్యూలో స్పందించారు. తన వందో సినిమా గురించి తెలుసుకొని అందులో నటించడానికి టబు ఆసక్తికనబరుస్తున్నదని చెప్పారు. టబు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తొలినాళ్ల నుంచి తనకు మంచి మిత్రురాలని నాగార్జున గుర్తు చేశారు. తన వందో సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రత్యేకంగా ఉంటాయని, ఎలాంటి గ్రాఫిక్స్ ఉపయోగించకుండా రియల్ ఫీల్‌తో తెరకెక్కించబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పులొచ్చాయని, వాస్తవికతకు దగ్గరగా ఉండే చిత్రాల్ని బాగా ఇష్టపడుతున్నారని నాగార్జున అభిప్రాయపడ్డారు. నాగార్జున వందో చిత్రానికి 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. ఇందులో ముగ్గురు కథానాయికలుంటారని, టబు కీలకమైన అతిథి పాత్రలో నటించే అవకాశం ఉందని సమాచారం.



చిత్రం

రజనీకాంత్ బయోపిక్ షురూ

సూపర్‌స్టార్ రజనీకాంత్ బయోపిక్ గురించి ఎప్పటి నుంచో వార్తలొస్తున్నాయి. బెంగళూరులో సాధారణ బస్ కండక్టర్‌గా జీవితాన్ని మొదలుపెట్టి వెండితెర సూపర్‌స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రస్థానాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకుంటారు. తాజాగా రజనీకాంత్ బయోపిక్ గురించి ఆయన కుమార్తె ఐశ్వర్య ఆసక్తికరమైన అప్‌డేట్‌ను వెల్లడించారు. తన తండ్రి జీవిత కథా చిత్రాన్ని ఇప్పటికే ప్రారంభించామని, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా అదొక సంచలనంగా ఉండబోతున్నదని ఆమె చెప్పారు. ఈ ప్రకటనతో రజనీకాంత్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చిత్రానికి సంబంధించిన దర్శకుడు, నటీనటుల వివరాలను ఐశ్వర్య వెల్లడించలేదు. త్వరలో ఈ సినిమా గురించి పూర్తి వివరాలు బయటికొస్తాయని చెన్నై సినీ వర్గాల టాక్. గత ఏడాది 'కూలీ' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నారు రజనీకాంత్. ప్రస్తుతం ఆయన 'జైలర్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దీని తర్వాత శిబి చక్రవర్తి దర్శకత్వంలో కమల్‌హాసన్ నిర్మించనున్న సినిమాలో నటించబోతున్నారు.

ముంబయి మాఫియా నేపథ్యంలో?



అగ్ర హీరో బాలకృష్ణ తన 111వ చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' వంటి హిట్ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో ఇప్పటికే అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా కాన్సెప్ట్ విషయంలో భిన్న కథనాలు ప్రచారంలో వచ్చాయి. భారీ విజువల్ హంగులతో రూపొందనున్న సోషియో ఫాంటసీ చిత్రమని వార్తలొచ్చాయి. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. ముంబయి మాఫియా నేపథ్యంలో పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ కథను తయారుచేశారట. ఇందులో బాలకృష్ణ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. మార్చి తొలివారంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



అడవిలో 'శబర' ప్రపంచం

ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ కథాంశంతో రూపొందిస్తున్న చిత్రం 'శబర'. 'గర్ల్‌ఫ్రెండ్' ఫేమ్ దీక్షిత్‌శెట్టి, క్రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేమ్‌చంద్ కిలారు దర్శకుడు. బుధవారం 'హార్ట్‌బీట్ ఆఫ్ శబర' పేరుతో సినిమా గ్లింప్స్‌ను పరిచయం చేస్తూ ఈవెంట్‌ను నిర్వహించారు. అడవి నేపథ్యంలో ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టిస్తూ దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించారని, బంగారం కోసం చేసే అన్వేషణ, పోరాటం నేపథ్యంలో సాగే కథ ఇదని హీరో దీక్షిత్ శెట్టి అన్నారు. కథలో కొత్తదనం ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని దర్శకుడు ప్రేమ్‌చంద్ పేర్కొన్నారు. అద్భుతమైన లొకేషన్లలో తీసిన ఈ సినిమా కన్నులపండువగా ఉంటుందని కథానాయిక క్రితికా సింగ్ చెప్పింది. మిషా నారంగ్, మోహన్ భగత్, భూషణ్ కల్యాణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిథున్ ముకుందన్, నిర్మాతలు: హర్షిత చదలవాడ, దుర్గా చుంచు, రమాదేవి కిలారు, రచన-దర్శకత్వం: కిలారు ప్రేమ్‌చంద్.



ఆకాశమే హద్దుగా సాగిపో...

ప్రతీ సినిమాకు వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు మలయాళీ అగ్ర హీరో దుల్కర్ సల్మాన్. ఆయన నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాదినేని దర్శకుడు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తున్నది. అగ్ర నాయిక శృతిహాసన్ ఈ సినిమాలో కీలక పాత్రను పోషిస్తున్నది. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కథాగమనంలో చాలా ప్రాధాన్యం కలిగిన పాత్ర ఆమెదని, కొంతకాలంగా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న శృతిహాసన్‌కు కథ బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌లో భాగమైందని మేకర్స్ తెలిపారు. వ్యోయగామి కావాలని కలలు కనే ఓ గ్రామీణ యువతి ఆశయాన్ని కథానాయకుడు ఎలా నెరవేర్చాడు? ఈ క్రమంలో వారి ప్రయాణంలోని మలుపులు ఆసక్తికరంగా ఉంటాయని, స్ఫూర్తినిచ్చే కథగా ఆకట్టుకుంటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ వేసవిలో పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్, దర్శకత్వం: పవన్ సాదినేని.



నవ్వులు పంచే 'హే భగవాన్'

సుహాస్, శివానీ నాగారం జంటగా నటిస్తున్న చిత్రం 'హే భగవాన్'. గోపీ అచ్చర దర్శకుడు. త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగే చిత్రమిదని, తన గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పాత్ర ఇదని సుహాస్ తెలిపారు. ప్రేక్షకులకు కావాల్సినంత నవ్వుల్ని పంచే సినిమా అవుతుందని కథానాయిక శివానీ నాగారం చెప్పింది. ఈ సినిమాలో కామెడీతో పాటు కంటెంట్ కూడా చాలా కొత్తగా ఉంటుందని, సుహాస్ పర్‌ఫార్మెన్స్ ప్రధానాకర్షణగా నిలుస్తుందని నిర్మాత వంశీ నందిపాటి పేర్కొన్నారు. వీకే నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, అజయ్‌ఘోష్, స్రవంతి చొక్కారపు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మహి రెడ్డి, సంగీతం: వివేక్ సాగర్.



తమిళ ఎంట్రీకి సిద్ధం

దాదాపు 12ఏళ్ల క్రితమే మరాఠీ సినిమాల ద్వారా కథానాయికగా పరిచయమైంది మృణాల్ ఠాకూర్. అంతకు ముందే అక్కడ టీవీ ధారావాహికల ద్వారా పాపులర్ అయింది. అయితే తొలి తెలుగు చిత్రం 'సీతారామం'తో ఈ భామకు ఇండస్ట్రీలో బ్రేక్ దొరికింది. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషలకు సమప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నది మృణాల్ ఠాకూర్. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి తమిళ సినిమాల్లో సైతం అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నది. శింబు 51వ చిత్రంలో మృణాల్ ఠాకూర్‌ను కథానాయికగా ఖరారు చేశారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీయస్ ఎంటర్‌టైనర్‌మెంట్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. ఏప్రిల్‌లో షూటింగ్‌ను ప్రారంభిస్తారు. శింబు వంటి అగ్ర హీరో సరసన అవకాశం కావడంతో కోలీవుడ్‌లో ఈ భామకు శుభారంభం దక్కినట్లేనని తమిళ సినీ వర్గాలంటున్నాయి. ప్రస్తుతం హిందీలో మూడు చిత్రాలతో బిజీగా ఉందీ భామ. ఇక తెలుగులో అల్లు అర్జున్-అట్లీ పాన్ వరల్డ్ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుంది మృణాల్ ఠాకూర్.



లైఫ్ మొత్తం గాబరా సోదరా...

సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటిస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'గాబరా గాబరా' అనే మ్యూజికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఆదిత్య రవీంద్రన్ స్వరపరచిన ఈ పాటను రాకేందుమౌళి రచించారు. సంతోష్ నారాయణన్ ఆలపించారు. 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్‌ని ఆమడ దూరం' అంటూ హీరో జీవితం తాలూకు నిరాశనిస్పృహల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. బలమైన భావోద్వేగాలతో సాగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, సంగీతానికి పెద్దపీట వేశామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్, రచన-దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్.



యథార్థ ఘటనల ఆధారంగా..

యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ప్రీం'. పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తున్నారు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని, ఇప్పటివరకు రానటువంటి వినూత్న కథాంశమిదని, అనుక్షణం ఉత్కంఠను పంచుతుందని మేకర్స్ తెలిపారు. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరవింద్, సంగీతం: మార్కస్ యం, నిర్మాత: శివ మల్లాల, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రావూరి రాజేష్.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం | 29 జనవరి 2026
హైదరాబాద్ | www.ntnews.com

కొబ్బరిని కోరికోరి!



ఇంట్లో పూజ అయినా, శుభకార్యమైనా.. కొబ్బరికాయ కొట్టడం కామన్! పచ్చి కొబ్బరితో చట్నీ చేసుకోవడం, అలాగే తినేయడమూ అంతే కామన్! అయితే, డయాబెటిస్ బాధితులు పచ్చికొబ్బరిని తినడానికి వెనకాముందూ ఆడుతుంటారు. షుగర్ లెవల్స్ పెరిగిపోతాయని భయపడుతుంటారు. ఈ క్రమంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు పచ్చికొబ్బరి మేలే చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్ ఉన్నవారు పచ్చికొబ్బరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు. పచ్చికొబ్బరిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అతి తక్కువ కార్బోహైడ్రేట్లతోపాటు ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. దాంతో జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. తద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయులను నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. దాంతో, రక్తంలో చక్కెర స్థాయులు అదుపు తప్పకుండా ఉంటాయి. ఇక పచ్చికొబ్బరిలో మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్ అనే ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలోనూ ముందుంటాయి. పచ్చికొబ్బరిలో కేలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి, అతిగా తింటే బరువు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే, తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. ఇక పచ్చికొబ్బరిని బెల్లం, చక్కెరతో కలిపి తీసుకోవద్దు. దీంతో చట్నీలు చేసేటప్పుడు ఉప్పు తక్కువగా వేసుకోవాలి.



పక్కింటోడికి కష్టమొస్తేనే సంబంధం లేనట్లు వ్యవహరించే రోజులివి. కానీ, ఆ మహిళ మాత్రం దేశంకాని దేశంలో వలసకూలీల అవస్థలు తెలుసుకుంది. ఏజెంట్ మోసానికి బలై ఖతార్‌లో తెలుగువాళ్లు పడే దీనావస్థలు చూసి చలించింది. వారి కడుపునింపి ఇంటికి సాగనంపుతున్నది **నందిని అబ్బగౌని**. ఉద్యోగం కోసం గల్ఫ్‌బాటపట్టిన ఆమె.. నేడు ఐసీసీ కల్చరల్ కోఆర్డినేటర్ స్థాయికి ఎదిగింది. సేవా కార్యక్రమాలను విస్తరించి నారీశక్తి పురస్కారాన్ని సైతం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల గొంతుకైన ఈ తెలంగాణ బిడ్డను.. జిందగీ పలకరించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...







ఖతార్‌లో తెలంగాణ నారీశక్తి

నేను పుట్టింది మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్. పెరిగిందంతా హైదరాబాద్. నాన్న సిండికేట్ బ్యాంక్‌లో ఉద్యోగి. అమ్మ గృహిణిగా మా ఆలనాపాలనా చూసుకున్నది. ఎంబీఏ పూర్తి చేసిన నేను.. మజీద్‌పూర్‌కు చెందిన మా మేనబావ శ్రీధర్‌ను ప్రేమించి 2008లో పెళ్లి చేసుకున్నాను. ఉద్యోగరీత్యా ఆయన 2011లో ఖతార్‌కు వెళ్లగా, నేను 2013లో వెళ్లాను. అప్పటికే మాకిద్దరు అమ్మాయిలు. గతంలో హైదరాబాద్‌లో ఉద్యోగ అనుభవం ఉండటంతో ఖతార్‌లో కూడా ఆయనతోపాటు ఉద్యోగంలో చేరా. ఆఫీస్, ఇల్లు ఇవే ప్రపంచమని బతుకుతున్న నన్ను.. ఖతార్ పరిస్థితులు పూర్తిగా మార్చాయి. ఇక్కడి ఎండలను చూసి బెంబెలెత్తిపోయేదాన్ని. ఏసీలో కూర్చొని పనిచేసే మాకే అంత భయముంటే.. నిత్యం ఎండలోనే పనిచేసే కార్మికులను తలచుకుంటేనే గుండె తరుక్కుపోయేది. కానీ, అప్పుడు వాళ్ల కోసం ఏమీ చేయలేని పరిస్థితి నాది.

> ‘విదేశాల్లో ఉండే ఎన్ఆర్ఐలకు, ఖతార్‌లో నివసించే భారతీయులకు చాలా తేడా ఉంది. అమెరికా వంటి దేశాల్లో ఐదేళ్లపాటు అక్కడే పనిచేస్తే ఆ దేశపు గ్రీన్‌కార్డు ఇస్తారు. కానీ, ఖతార్‌లో మాత్రం ఎన్నేళ్లు ఉద్యోగం చేసినా పర్మినెంట్ వీసా ఉండదు. ఏడాదికోసారి రెన్యువల్ చేసుకోవాల్సిందే. పని ప్రదేశాల్లో మనవాళ్ల ప్రాణాలు పోయినా పట్టించుకోరు. మనదేశంలో ఉన్న స్విగ్గీలాంటి డెలివరీ సంస్థల్లో ఇక్కడ పనిచేసేందుకు భారత్‌నుంచి చాలామంది యువకులు వస్తుంటారు. వాళ్లంతా రోడ్డు ప్రమాదాల్లో మరణించడం చూసి చాలా బాధేస్తుంటుంది.’

ఆ రెండు సంఘటనలే..

ఒకరోజు ఆఫీస్‌కు వెళ్తున్నప్పుడు ఏజెంట్ల చేతిలో మోసపోయిన ఓ ముస్లిం యువతి కనిపించింది. ఆమె బాధను చూసి, వెంటనే ఆమెను ఖతార్‌లోని భారత రాయబార కార్యాలయానికి తీసుకెళ్లాను. ఆమెకు జరిగిన అన్యాయాన్ని అధికారులకు వివరించాను. వాళ్ల సహకారంతో ఆ అమ్మాయిని తిరిగి స్వదేశానికి పంపించాను. అది నా జీవితంలో ఎదురైన మొదటి అనుభవం. ఇక రెండో ఘటన మాత్రం.. నా జీవితాన్నే మార్చేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన 21మంది యువకులు ఏజెంట్ల మోసానికి బలైపోయారు. ఎడారి దేశంలో పనిదొరక్క, ఇంటినుంచి తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో పస్తులుండటం.. నన్ను ఎంతగానో కలిచివేసింది. వాళ్లకు తిండిపెట్టి, ఒకనెల రూమ్ రెంట్ కట్టి తిరిగి వాళ్లను మన దేశానికి పంపించాను. ఇలాంటి బాధితులు చాలామంది ఉన్నారని అప్పుడే తెలుసుకున్నా. వాళ్లందరికీ నావంతు సహాయం చేసేందుకు నా జీతంలో పదిశాతం డబ్బులను కేటాయించడం మొదలుపెట్టా.

గుర్తుంచుకొని మరీ..

ప్రపంచాన్ని వణికించిన కరోనా సంక్షోభంలో ఎంతోమంది వలసకూలీలు ఇబ్బంది పడ్డ విషయం మనకు తెలిసిందే కదా. అప్పటికే తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన వలసకార్మికులు ‘మేము సచ్చినా ఈ దేశంలో ఉండం. మా దేశానికి పంపించండి’ అంటూ అభ్యర్థనలు చేశారు. ముందుగా వృద్ధులు, రోగులు, గర్భిణులు, బాలింతలను అత్యవసరంగా పంపించేందుకు డేటా సిద్ధం చేసుకున్నాం. ఆ సమయంలోనే ఓ మహిళ నా వద్దకు వచ్చి.. ‘నేను సరోగసి ద్వారా బిడ్డకు జన్మనిచ్చాను. ఆ పాప ప్రస్తుతం భారత్‌లో ఉంది. ఆమెను వెంటనే చూడాలి. దయచేసి నన్ను పంపించండి’ అంటూ వేడుకుంది. తాను గర్భం దాల్చకపోయినా బిడ్డకోసం అధికారులను ఒప్పించి ఆమెను ఫ్లయిట్ ఎక్కించా. ఆవిడ ఇటీవల ఖతార్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి తన బిడ్డతో వచ్చి నన్ను గుర్తుపట్టిమరీ కృతజ్ఞతలు చెప్పింది.



సహాయం చేసిన నేను ఎప్పుడో మరిచిపోయా! కానీ, ఆమె మాత్రం గుర్తుపెట్టుకుంది. ఎంతో సంతోషం కలిగిన సంఘటన అది.

మన పండుగకు ప్రాణం..

ఖతార్‌లోని తెలుగువాళ్లలో ఏపీకి చెందినవాళ్లే ఎక్కువ ఉంటారు. నేను వచ్చిన కొత్తలో బతుకమ్మ పండక్కి, బతుకమ్మ ఆడుకునేందుకు ఆఫీస్‌నుంచి తొందరగా వెళ్తుంటే ఎగతాళి చేసేవాళ్లు. అప్పుడే అనుకున్నా.. విదేశాలకు కూడా మన సంస్కృతిని పరిచయం చేయాలని. ఈ దేశంలో ఏ కార్యక్రమం చేయాలన్నా ప్రభుత్వం అనుమతి పొందాలి. అప్పటికే మా ఆయన ఓ సంఘంలో సభ్యుడిగా ఉన్నందున.. వారి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఖతార్‌లో తొలిసారి నిర్వహించా. ఆ తరువాత 2019లో కొంతమందిమి కలిశాం. ఇక అప్పటినుంచి పండుగలు-పబ్బాలన్నీ అధికారికంగా చేయడం ప్రారంభించాం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాళ్లు కూడా ఇందులో సభ్యులుగా చేరడం విశేషం. ఒకవైపు గల్ఫ్ కార్మికులకు చేయూతనిస్తూ, మరోవైపు తెలుగు సంస్కృతికి దోహదం చేస్తున్నందుకు.. నా సేవలను గుర్తించి భారత రాయబార కార్యాలయం 2024లో ఇండియన్ కల్చరల్ సెంటర్(ఐసీసీ)కి నన్ను నామినేట్ చేసింది. ఇక అప్పటినుంచి కల్చరల్ కోఆర్డినేటర్‌గా భారత దేశంలోని సంస్కృతీ సంప్రదాయ వేడుకలకు ఖతార్‌ను వేదిక చేస్తున్నాను.

గర్వ పడతాను..

బతుకుదెరువుకోసం తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేసే కార్మికుల్లో 90శాతం మంది బ్లూకాలర్ కార్మికులే. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒకేసారి 500 మంది గల్ఫ్ కార్మికులను విముక్తి చేసిన సమయంలో మా పాత్ర కూడా ఉంది. ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నానంటే కారణం.. నా భర్త సహకారం వల్లే. నారీశక్తి పురస్కారం నాలో మరింత బాధ్యతను పెంచింది. మహిళా సాధికారత దిశగా సాగుతూ, గల్ఫ్ కార్మికుల సమస్యలపై పనిచేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఈ స్థాయిలో ఉన్నానంటే నా కుటుంబం, నేను పుట్టిపెరిగిన గడ్డే కారణమని గర్వంగా చెప్పుకొంటాను.

... రాజు పిల్లనగోయిన



రైస్‌తో నైస్‌గా

జుట్టు రాలడానికి, మెరుపుని కోల్పోవడానికి కారణాలు ఎన్నో. ఒత్తిడి, కాలుష్యం, వాతావరణంలో తేడాలు.. అన్నీ కుదుళ్లపైనే ప్రభావం చూపుతాయి. అందుకే, జుట్టు సంరక్షణకు ఖరీదైన షాంపూలు, కండిషనర్లు వాడుతుంటారు. ఇందుకోసం వేలకు వేలు ఖర్చు చేస్తుంటారు. అయితే, వంటింట్లో దొరికే బియ్యం నీటితోనే జుట్టును మెరిసేలా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బియ్యం కడిగిన నీటిలో అమినో యాసిడ్లు, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి జుట్టుకు సరైన పోషణను అందిస్తాయి. ఈ నీటికి రోజ్ వాటర్‌ను కూడా కలిపితే.. మరిన్ని అద్భుతమైన ప్రయోజనాలు అందుతాయి. ఇందుకోసం ముందుగా ఒక గ్లాసులో కొన్ని బియ్యం తీసుకొని, శుభ్రంగా కడగాలి. అందులోనే తగినన్ని నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని వడకట్టి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ రోజ్ వాటర్, తక్కువ గాఢత కలిగిన షాంపూ (ఒక టేబుల్ స్పూన్) వేసి బాగా కలపాలి. స్నానం చేసేటప్పుడు ఈ షాంపూ మిశ్రమాన్ని జుట్టుకు, కుదుళ్లకు బాగా పట్టించి.. మెల్లగా మసాజ్ చేయాలి. జుట్టుపై కనీసం 10 నిమిషాల పాటు అలాగే ఉంచడం మంచిది. దీనివల్ల బియ్యం నీటిలోని పోషకాలన్నీ జుట్టు కుదుళ్ల లోపలికి చేరుతాయి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో జుట్టును శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా రెగ్యులర్‌గా చేయడం వల్ల జుట్టుకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. జుట్టు కుదుళ్లు దృఢంగా మారి, వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. రోజ్ వాటర్ కూడా కలవడం వల్ల.. జుట్టు మరింత తేమగా మారి, చిక్కులు పడకుండా ఉంటుంది. జుట్టులోని మురికి కూడా తొలగిపోయి, చుండ్రు బాధ తప్పుతుంది.

ఒత్తిడిని చిత్తుచేసే చిట్టి!

డెస్క్ ఉద్యోగులు గంటల తరబడి ఒకే దగ్గర కూర్చుని పని చేస్తుంటారు. దాంతో, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఒక్కోసారి పని ప్రదేశంలోనే బోర్‌గా ఫీల్ అవుతుంటారు. అలాంటి వారికి ‘మినీ మోచి’ లాంటి బుల్లి రోబోలు అద్భుతమైన పరిష్కారం చూపుతాయి. ఇవి బొమ్మలు మాత్రమే కాదు. పని మధ్యలో ఉద్యోగులకు విశ్రాంతిని, ఉల్లాసాన్ని ఇచ్చే అద్భుతమైన సాధనాలు కూడా!

ప్రస్తుతం డెస్క్‌ల దగ్గర బుల్లి ‘మినీ మోచి రోబోలు’ సందడి చేస్తున్నాయి. ఉద్యోగులకు ఉల్లాసాన్ని పంచుతూ.. వారిలోని ఒత్తిడిని చిత్తు చేస్తున్నాయి. చిన్న చిన్న శబ్దాలు చేస్తూ, కదలికలు, ముఖ కవళికలతో వారికి ఒక తోడున్నట్లు భావన కల్పిస్తున్నాయి. ముఖ్యంగా, ఒంటరిగా పనిచేసే వారికి మరింత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. పని ఒత్తిడిలో ఉన్నప్పుడు పక్కన ఎవరో ఒకరు ఉన్నారనే అనుభూతిని అందిస్తున్నాయి.



పనిలో ఉన్నప్పుడు ఈ బుల్లి రోబో చేసే వింత చేష్టలు, ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే.. తెలియకుండానే చిరునవ్వు వస్తుంది. ఆ ఒక్క నిమిషం నవ్వు.. ఉద్యోగుల మెదడులో ‘డోపమైన్’ వంటి హ్యాపీ హార్మోన్లను విడుదల చేస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. మరికొందరు పనిలో నిమగ్నమై నీళ్లు తాగడం, కాసేపు కళ్లు ఆర్పడం కూడా మర్చిపోతుంటారు. ఈ స్మార్ట్ రోబోలను డెస్క్ దగ్గర ఉంచుకుంటే.. బ్రేక్ తీసుకోవాల్సిన సమయాన్ని అవే గుర్తు చేస్తాయి. ఇక ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు, ఒకే ఒక నిమిషంపాటు ఈ రోబో చేసే పనులను గమనించడం వల్ల.. మీ మనస్సు తేలికపడుతుంది. ఇది ఒక చిన్న ‘మెడిటేషన్’ లాగా పనిచేస్తుంది. తిరిగి పనిని ప్రారంభించినప్పుడు మరింత ఏకాగ్రతతో ఉండేలా చేస్తుంది. అంతేకాదు, ఈ బుల్లి రోబో.. మీ వర్క్ డెస్క్‌ను మరింత ఆకర్షణీయంగా మారుస్తుంది. పని పూర్తి చేయాలనే ఉత్సాహాన్నీ పెంచుతుంది. అనేక టెక్ కంపెనీలు ఇలాంటి స్మార్ట్, ఏఐ బుల్లి రోబోలను రూపొందిస్తున్నాయి.

ఏ రొట్టెలో ఏముంది?

ఆరోగ్యాన్ని కోరుకుంటున్న చాలామంది రాత్రుళ్లు అన్నానికి బదులు రొట్టెలు తింటున్నారు. ఇవి కడుపు నింపడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి. అయితే, ఒక్కో రకం రొట్టెలు ఒక్కో లాభాన్ని చేకూరుస్తుంటాయి. ఆ ప్రయోజనాలు మీరూ తెలుసుకోండి.



గోధుమ రొట్టె: చాలామంది చపాతీలు ఇష్టంగా తింటారు. గోధుమల్ని ప్రాసెస్ చేసినప్పుడు అందులో ఫైబర్ తగ్గి, చక్కెర స్థాయులు పెరుగుతాయి. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ చిరుధాన్యాల కంటే ఎక్కువగా ఉంటుంది. అందువల్ల గోధుమ రొట్టెతో కొద్దిగా సోయా, శనగల్ని కలిపి తీసుకోవడం మంచిది.

మిల్లెట్స్ రోటీ: కాలం ఏదైనా మిల్లెట్ రోటీ తినడం చాలామంచిది. వీటి ద్వారా శరీరానికి ఎక్కువ మొత్తంలో ఫైబర్, ఐరన్ అందుతాయి. మిల్లెట్ రోటీ తింటే మలబద్ధకం, ఉబ్బరం తగ్గుతాయి. అయితే అతిగా కాకుండా వారానికి రెండుసార్లు తింటే సరిపోతుంది.

మక్క రొట్టె: ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కానీ, కార్బోహైడ్రేట్స్ కూడా ఉండటంతో మక్క రొట్టె తింటే చక్కెర స్థాయులు అమాంతం పెరుగుతాయి. కాయకష్టం చేసేవాళ్లు మక్కరొట్టె దర్జాగా తినొచ్చు. డెస్క్ జాబ్‌లు చేసేవాళ్లు.. రుచి కోసం ఎప్పుడో ఓసారి తినొచ్చు.

జొన్న రొట్టె: సంక్లిష్ట కార్బోహైడ్రేట్స్ ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఇది తినడం వల్ల చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. అధిక బరువుతో ఉన్నవాళ్లు రెగ్యులర్‌గా జొన్న రొట్టె తింటే మంచి గుణం కనిపిస్తుంది.

రాగి రొట్టె: రాగుల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంతోపాటు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గడానికి, రక్తంలో చక్కెర తగ్గేందుకు, బలమైన ఎముకలకి, జీర్ణక్రియకి, దీర్ఘకాలిక శక్తికి, మంచి నిద్రకు రాగి రొట్టె చాలా మంచిది. ఇందులో క్యాల్షియం కూడా పుష్కలంగా ఉంటుంది. కాబట్టి దీనిని రెగ్యులర్‌గా ప్రయత్నించొచ్చు.

పసరు కక్కేస్తున్నారా?

కొంతమంది నోట్లోంచి పసరు మొత్తాన్నీ బయటికి లాగకుండా ముఖం కడుక్కోవడం పూర్తిచేయరు. బలవంతంగా పసరు బయటికి తీయడం వారికి అలవాటుగా మారిపోతుంది. అయితే, ఈ అలవాటు అనేక అనారోగ్య సమస్యల్ని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బలవంతంగా పసరు తీయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు.

నోట్లోంచి వేలు పెట్టి.. బలవంతంగా పసరుని బయటికి తీయడం వల్ల కడుపులోని యాసిడ్ రివర్స్ అవుతుంది. దీంతో అసిడిటీ, గుండెల్లో మంట పెరుగుతుంది. కడుపులోని పసరుని బయటికి తీస్తే జీర్ణ సమస్యలు వస్తాయి. తిన్న ఆహారం మొత్తం వెనక్కి వచ్చి సరిగ్గా జీర్ణమవ్వదు. దాంతో రోజంతా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ చర్య గొంతుమంటకీ కారణమై.. ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. పసరులోని యాసిడ్ వల్ల గొంతులో ఉండే సున్నితమైన కణజాలం దెబ్బతిని మంట పుడుతుంది. గొంతు బొంగురుపోతుంది కూడా. కొంతమందికి ఇలా చేయడం వల్ల దగ్గు మొదలవుతుంది. ఎంత కంట్రోల్ చేసినా ఆగదు. అదేపనిగా దగ్గుతూనే ఉంటారు. అంతేకాదు.. శరీరానికి కావాల్సిన పొటాషియం, సోడియం కూడా పసరుతో పాటే బయటికి వెళ్లిపోయి నీరసమైపోతారు. కడుపులోని యాసిడ్ గాఢత ఎక్కువగా ఉండటం వల్ల దంతాలపై ఉండే రక్షణ కవచం దెబ్బతింటుంది. పళ్లు బలహీన పడతాయి. పసరు తీస్తున్నక్రమంలో కొన్నిసార్లు ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది. దీని వల్ల నిమోనియా సమస్య తలెత్తుతుంది. అందుకే.. నిదానంగా బ్రష్ చేయడం, నోటిని క్లీన్ చేసుకోవడం మంచిది. ఇన్ని సమస్యలకీ కారణమవుతున్న పసరు తీసే అలవాటుని మానేయడమే మంచిది.





వ్యాఘ్రాన్ని శీఘ్రంగా

భారత్‌లో పులులను సందర్శించడం.. ఒక గొప్ప అనుభవం. అందులోనూ అడవుల్లోని సహజ ఆవాసాల్లో వాటిని వీక్షించడం.. మరింత అద్భుతం. అలాంటి ‘టైగర్ అడ్వెంచర్’కు ఇదే సరైన సమయం. అయితే, వ్యాఘ్రాన్ని శీఘ్రంగా చూడాలంటే.. అందుకు అనువైన ‘టైగర్ రిజర్వ్’ను ఎంచుకోవడం ముఖ్యం.

సఫారీ అంటే.. అడవి జంతువులను వీక్షించడం మాత్రమే కాదు. ఆ అడవిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం. ప్రకృతితోపాటు ఆ పరిసరాలనూ ఆస్వాదించడం. అప్పుడే మీరు చూడాలనుకున్న అడవి జంతువులు కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. లేకుంటే, పులికాదు కదా.. పిల్లికూడా కనిపించని పరిస్థితి ఎదురవుతుంది. మీ సఫారీ కూడా అలా కావొద్దంటే.. ఈ సూచనలు పాటించాల్సిందే!


ఎక్కువ పులులు ఉండే నేషనల్ పార్క్‌కు వెళ్తే.. పులి తప్పకుండా కనిపిస్తుందని చాలామంది భావిస్తుంటారు. కానీ, వాస్తవం వేరుగా ఉంటుంది. ఎన్ని పులులు ఉన్నాయన్నది ముఖ్యంకాదు. అవి ఎంత తరచుగా బహిరంగ ప్రదేశాలు, సఫారీ మార్గాలను ఉపయోగిస్తాయనేది కీలకం. మనదేశంలో అత్యధిక పులుల సాంద్రత కలిగినవాటిలో బాంధవ్గఢ్, జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లు ముందుంటాయి. కానీ, ‘తడోబా’లోనే వాటిని చూసే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. బాంధవ్గఢ్, కార్బెట్ పార్కుల్లో చిక్కటి అడవి వల్ల పులులు బయటికి రావడానికి ఆసక్తి చూపించవు. అదే తడోబాలో.. బహిరంగ ప్రదేశాల్లోనే ఎక్కువగా సంచరిస్తుంటాయి. కాబట్టి, ఈజీగా కనిపిస్తాయి.

ఇక సఫారీకి దగ్గరగా వచ్చినప్పటికీ, కొన్నిసార్లు పులులు కనిపించని పరిస్థితి ఉంటుంది. అందుకు అడవి నిర్మాణమే కారణం. బహిరంగ భూభాగం స్పష్టంగా కనిపిస్తే.. పులులు కూడా సులభంగా మన కంటికి చిక్కుతాయి. ఈ విషయంలో రాజస్థాన్‌లోని రణతంబోర్ నేషనల్ పార్క్ ముందుంటుంది. అక్కడి పొడి అడవులు, విశాలమైన సరస్సులు, రాతి గట్ల కారణంగా.. అద్భుతమైన టైగర్ సఫారీ అనుభవం దక్కుతుంది. అదే కన్హా, సుందర్బన్స్ పార్కుల్లో దట్టమైన అడవుల కారణంగా.. పులులను వీక్షించడం సవాల్‌గా మారుతుంది. అందుకే, సఫారీలో అద్భుతమైన విజువల్స్, మంచి ఫొటోగ్రఫీ కావాలంటే.. రణతంబోర్‌ను ఎంచుకోండి.

ఇక ఉష్ణోగ్రత, నీటి లభ్యత, వృక్ష సంపదను బట్టి పులుల కదలిక కూడా మారుతుంది. ఉదాహరణకు వేసవిలో బాంధవ్గఢ్, కన్హా ప్రాంతాలలో పులులు తరచుగా నీటి గుంతల వద్దకు వస్తుంటాయి. అక్కడి పచ్చికమైదానాల్లోని గడ్డి ఎండిపోవడం వల్ల పులులు చాలా సులభంగా కనిపిస్తాయి. జిమ్ కార్బెట్ పార్కులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అందుకే, వేసవిలో సఫారీ చేద్దామని అనుకుంటే.. బాంధవ్గఢ్, కన్హా, జిమ్ కార్బెట్‌ను ఎంచుకోవచ్చు. శీతాకాలపు పర్యటనలకు రణతంబోర్, తడోబా బెస్ట్ ఆప్షన్స్!

ప్రిక్వార్టర్స్‌కు తరుణ్

• కిరణ్, అన్మోల్ ముందంజ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాదీ షట్లర్ తరుణ్ మన్నేపల్లి తొలి విఘ్నాన్ని అధిగమించి ప్రిక్వార్టర్స్ చేరాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో తరుణ్.. 22-20, 21-17తో వాంగ్‌గొరాయోస్ (థాయ్‌లాండ్)పై గెలిచి రెండో రౌండ్‌కు ప్రవేశించాడు. సీనియర్ షట్లర్ కిరణ్ జార్జి.. 21-15, 21-9తో ఐదిల్ షొలె (మలేషియా)పై అలవోక విజయం సాధించాడు. యువ షట్లర్ మంజునాథ్.. 21-12, 9-21, 21-17తో జోహన్సెన్ (డెన్మార్క్)పై గెలిచాడు. కానీ ప్రియాన్షు రజావత్, సుబ్రహ్మణ్యంకు ఓటమి ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో మరో హైదరాబాదీ అమ్మాయి శ్రీయాన్షి.. 14-21, 21-13, 21-19తో వెన్ యు ఝాంగ్ (కెనడా)ను చిత్తుచేసింది. అన్మోల్ ఖార్బ్.. 21-12, 21-12తో లో సిన్ యాన్ (హాంకాంగ్)ను మట్టికరిపించింది. మాళవిక భారత్‌కే చెందిన ఇషారాణి ఓడించగా అష్మిత దేవిక పైచేయి సాధించింది. అనుపమ ఉపాధ్యాయ, తస్నిమ్ మిర్, ఆకర్షి కశ్యప్ సైతం తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.

తెలంగాణ శుభారంభం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని గచ్చిబౌలి గల జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 72వ మహిళల సీనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పూల్-సీలో ఆతిథ్య జట్టు.. 50-16తో పుదుచ్చేరిపై ఘన విజయం సాధించింది. రైడర్లు పాయింట్ల వర్షం కురిపించడంతో తెలంగాణ విజయం నల్లేరుపై నడకే అయింది. స్థానిక ప్రేక్షకుల మద్దతుతో తెలంగాణ ఆటగాళ్లు రెచ్చిపోయి వరుస పాయింట్లతో సత్తాచాటారు. ఇదే పూల్‌లో రాజస్థాన్, రైల్వేస్ జట్లు విజయాలు సాధించాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన రైల్వేస్.. 88-12తో జమ్ముకశ్మీర్‌పై ఏకపక్ష విజయాన్ని నమోదుచేసింది.

జాతీయ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



కాటారం, జనవరి 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మేడిపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థిని గీతాంజలి జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైంది. నారాయణపేట జిల్లాలో ఇటీవల నిర్వహించిన సబ్ జూనియర్ ఖో-ఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఈ నెల 29, 30, 31 తేదీల్లో హర్యానాలోని కురుక్షేత్రలో జరిగే జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైంది. అలాగే మండలకేంద్రంలోని ఎస్టీ బాలికల గురుకులానికి చెందిన శ్రీలేఖ హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో శ్రీలేఖ పాల్గొననుంది.

టాప్-10లోకి సూర్య




దుబాయ్: సుమారు ఏడాదిన్నర కాలంగా పేలవ ఫామ్‌తో తంటాలు పడి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టచ్‌లోకి వచ్చిన భారత టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్.. ఐసీసీ ర్యాంకుల్లోనూ సత్తాచాటాడు. ఈ సిరీస్‌కు ముందు 12వ ర్యాంకులో ఉన్న మిస్టర్ 360.. వరుసగా రెండు అర్ధ శతకాలు (82*, 57*)తో ఐదు స్థానాలను మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరాడు.

భారత్‌కు బంగ్లా షూటర్లు

ఢిల్లీ: భద్రతా కారణాల దృష్ట్యా ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను భారత్‌లో ఆడేందుకు తమ జట్టును ఆ దేశానికి పంపబోమని మంకు పట్టు పట్టి టోర్నీ నుంచి వైదొలిగిన బంగ్లాదేశ్.. తమ దేశ షూటర్లను మాత్రం ఇక్కడ ఆడేందుకు అనుమతినిచ్చింది. వచ్చే నెల 2 నుంచి 14 మధ్య ఢిల్లీలోని కర్ణిసేన షూటింగ్ రేంజ్‌లో జరగాల్సి ఉన్న ఆసియా రైఫిల్ అండ్ పిస్టోల్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనేందుకు గాను బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు రైఫిల్ షూటర్లు భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని జాతీయ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) కూడా ధృవీకరించింది. కాగా, క్రికెటర్లను పంపడానికి భద్రతా కారణాలను చూపిన ఆ దేశ ప్రభుత్వం.. షూటర్లను పంపేందుకు అంగీకరించడంతో బంగ్లాదేశ్ ద్వంద్వ విధానాలను అనుసరిస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సహజకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ



ముంబై: వచ్చే నెల 2 నుంచి ముంబైలో జరుగబోయే డబ్ల్యూటీఏ ముంబై ఓపెన్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాదీ టెన్నిస్ స్టార్ సహజ యామలపల్లికి వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కింది. ప్రస్తుతం భారత మహిళల సింగిల్స్‌లో నెంబర్ వన్ ర్యాంకు కల్గిన సహజ.. కొద్దిరోజుల క్రితం పూణెలో జరిగిన బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత్ రెండో స్థానంతో ముగించడంలో కీలకపాత్ర పోషించింది.

భారత్‌కు ఝలక్

వైజాగ్‌లో న్యూజిలాండ్ ఘనవిజయం • సీఫర్ట్, కాన్వే మెరుపులు • దూబె పోరాటం వృథా



సీఫర్ట్ (62)



శాంట్నర్ (3/26)



దూబె (65)

వైజాగ్: సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు.. నాలుగో పోరులో ఓటమిపాలైంది. బంతితో విఫలమవడమే గాక టాపార్డర్ వైఫల్యంతో కివీస్ చేతిలో 50 పరుగుల తేడాతో అపజయాన్ని మూటగట్టుకుంది. ఈ విజయంతో సిరీస్‌లో న్యూజిలాండ్.. భారత ఆధిక్యాన్ని 1-3కు తగ్గించింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' టిమ్ సీఫర్ట్ (36 బంతుల్లో 62, 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (23 బంతుల్లో 44, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో న్యూజిలాండ్.. 20 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 215 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఆరంభం నుంచే చతికిలపడ్డ టీమ్ ఇండియా.. 18.4 ఓవర్లలో 165 రన్స్‌కే చేతులెత్తేసింది. టాపార్డర్ విఫలమైనా శివమ్ దూబె (23 బంతుల్లో 65, 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) విధ్వంసకరంగా పోరాడగా రింకూ సింగ్ (30 బంతుల్లో 39, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించి పరువు కాపాడారు. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (3/26) కీలక వికెట్లు పడగొట్టి భారత్‌ను కట్టడి చేశాడు. ఇరుజట్ల మధ్య సిరీస్‌లో ఆఖరిదైన ఐదో మ్యాచ్ ఈనెల 31న తిరువనంతపురంలో జరుగుతుంది.

టాపార్డర్ వైఫల్యంతో..

భారీ ఛేదనలో తొలి బంతికే విధ్వంసక వీరుడు అభిషేక్ శర్మను డకౌట్ చేసిన న్యూజిలాండ్.. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఆతిథ్య జట్టుపై ఒత్తిడి పెంచింది. టాపార్డర్ వైఫల్యం ఆ జట్టుకు కలిసొచ్చింది. గత రెండు మ్యాచ్‌ల్లో హాఫ్ సెంచరీలతో ఫామ్‌లోకి వచ్చిన కెప్టెన్ సూర్య (8).. డఫ్ఫీ బౌలింగ్‌లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. శాంసన్ (15 బంతుల్లో 24, 3 ఫోర్లు, 1 సిక్స్) టచ్‌లోకి వచ్చినట్టే కనిపించినా శాంట్నర్ వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. హార్దిక్ పాండ్యా (2)నూ శాంట్నర్ బోల్తా కొట్టించాడు. ఈ క్రమంలో రింకూ, దూబె పోరాడారు. మూడో స్థానంలో వచ్చిన రింకూ.. ధాటిగానే ఆడినా ఫోక్స్ బౌలింగ్‌లో ఎల్బీగా నిష్క్రమించాడు. దీంతో జట్టు గెలుపు బాధ్యత తను తన భుజాల మీద వేసుకున్న దూబె.. సోధి వేసిన 12వ ఓవర్లో 4, 6, 4, 6, 6తో ఏకంగా 29 రన్స్ రాబట్టాడు. డఫ్ఫీ మరుసటి ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో 15 బంతుల్లోనే అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. జోరుమీదున్న దూబె.. దురదృష్టవశాత్తూ రనౌట్ అవడంతో భారత ఓటమి ఖరారైంది. దూబె నిష్క్రమించాక భారత లోయరార్డర్ పెద్దగా కష్టపడకుండానే చేతులెత్తేయడంతో ఈ సిరీస్‌లో భారత్‌కు తొలి ఓటమి ఎదురైంది.

మోత మోగించిన సీఫర్ట్, కాన్వే

ముందు బ్యాటింగ్ చేసిన కివీస్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ల ఆటే హైలైట్. సీఫర్ట్, కాన్వే బౌండరీలు, సిక్స్‌లతో మోతెక్కించి తొలి వికెట్‌కు 8.2 ఓవర్లలోనే వంద పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆ జట్టు భారీ స్కోరు చేసేందుకు దోహదపడ్డారు. అర్ష్‌దీప్ తొలి ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లతో బాదుడుకు శ్రీకారం చుట్టిన సీఫర్ట్.. క్రీజులో ఉన్నంతసేపూ అదే దూకుడును కొనసాగించాడు. అతడి మెరుపులతో పవర్ ప్లేలోనే కివీస్ వికెట్లేమీ నష్టపోకుండా 71 రన్స్ చేసింది. మరో ఎండ్‌లో కాన్వే సైతం.. బిష్ణోయ్ 6వ ఓవర్లో 4, 4, 6తో రెచ్చిపోయాడు. 8వ ఓవర్లో తొలి బంతిని మిడాఫ్ దిశగా సింగిల్ తీసిన సీఫర్ట్ ఈ సిరీస్‌లో తన తొలి అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగుతున్న కాన్వే.. కుల్దీప్ 9వ ఓవర్లో రింకూ సింగ్‌కు క్యాచ్ ఇవ్వడంతో కివీస్ తొలి వికెట్ కోల్పోయింది. మరుసటి ఓవర్లో రచిన్ (2).. బుమ్రా ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 13వ ఓవర్లో అర్ష్‌దీప్.. సీఫర్ట్‌ను ఔట్ చేశాడు. అదే ఊపులో భారత్.. ఫిలిప్స్ (24), చాప్‌మన్ (9), శాంట్నర్ (11) వికెట్లు పడగొట్టినా ఆఖర్లో డారిల్ మిచెల్ (39 నాటౌట్, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లకు 215/7 (సీఫర్ట్ 62, కాన్వే 44, అర్ష్‌దీప్ 2/33, కుల్దీప్ 2/39); **భారత్:** 18.4 ఓవర్లకు 165 ఆలౌట్ (దూబె 65, రింకూ 39, శాంట్నర్ 3/26, డఫ్ఫీ 2/33)

సెమీస్‌కు జొకో

గాయంతో నిష్క్రమించిన ముసెట్టి

రెండు సెట్లు కోల్పోయినా కలిసొచ్చిన అదృష్టం • క్వార్టర్స్‌లో స్వియాటెక్‌కు షాక్





మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం సుమారు రెండేండ్లుగా వేచిచూస్తున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు అదృష్టం ప్రత్యర్థికి గాయం రూపంలో కలిసొచ్చింది. ఐదో సీడ్ ఇటలీ కుర్రాడు లొరెంజొ ముసెట్టి వరుసగా రెండు సెట్లు గెలిచి సెమీస్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకున్నా దురదృష్టం అతడిని గాయం రూపంలో వెక్కిరించింది. కుడి కాలి పైభాగంలో తీవ్ర నొప్పి కారణంగా నడవలేని స్థితికి వచ్చి మ్యాచ్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవడంతో జొకో సెమీస్‌కు అర్హత సాధించాడు. బుధవారం రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో.. 4-6, 3-6, 3-1తో సెమీస్‌కు చేరాడు. ముసెట్టి విజృంభణతో రెండు సెట్లనూ కోల్పోయిన జొకో మ్యాచ్‌పై ఆశలు వదులుకోలేదు. మూడో సెట్‌లో 3-1తో ఆధిక్యంలో ఉండటంతో మరో రసవత్తర పోరు తప్పదనే అనుకున్నారంతా. కానీ అదే సమయంలో ముసెట్టి నడవడానికి ఇబ్బందిపడ్డాడు. మెడికల్ టైమౌట్ తీసుకున్నా అతడు ఆడే స్థితిలో లేకపోవడంతో మ్యాచ్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మ్యాచ్ ముగిశాక జొకో మాట్లాడుతూ.. 'నేడు నాకంటే ముసెట్టి చాలా బాగా ఆడాడు. నేనైతే రాత్రికి ఇంటికి వెళ్తానేమోనని ఫిక్స్ అయ్యా. మ్యాచ్ పూర్తయ్యుంటే తప్పకుండా అతడే విజేతగా నిలిచేవాడు. కానీ ఆటలో గాయాలు సాధారణం. గతంలో పలుమార్లు నాక్కూడా ఇలా జరిగింది. ముసెట్టి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా' అని చెప్పడం గమనార్హం. ప్రిక్వార్టర్స్‌లోనూ జాకుబ్ మెన్సిక్ (చెక్) గాయం కారణంగా జొకో నేరుగా క్వార్టర్స్ చేరుకున్న విషయం విదితమే. సెమీస్‌లో జొకో.. రెండో సీడ్ యానిక్ సిన్నర్ (ఇటలీ)తో జరుగబోయే బ్లాక్‌బస్టర్ సెమీస్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో క్వార్టర్స్‌లో సిన్నర్.. 6-3, 6-4, 6-4తో బెన్ షెల్టన్ (అమెరికా)పై వరుస సెట్లలో గెలిచి సెమీస్ చేరాడు.

స్వియాటెక్ నిష్క్రమణ

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్)కు కజకిస్థాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా షాకిచ్చింది. క్వార్టర్స్‌లో రిబాకినా.. 7-5, 6-1తో స్వియాటెక్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. రెండో క్వార్టర్స్‌లో యూఎస్ ప్లేయర్ జెస్సికా పెగులా.. 6-2, 7-6 (7/1)తో అమెరికాకే చెందిన అనిసిమొవను ఓడించింది. సెమీస్‌లో పెగులా.. రిబాకినాతో తలపడనుంది.

గోల్డ్ లోన్లకు గిరాకీ



పెరుగుతున్న ధరలే కారణం
రెండేండ్లలో రెట్టింపైన పోర్ట్‌ఫోలియో

ముంబై, జనవరి 28: దేశీయ లోన్ మార్కెట్‌లో బంగారం తనఖాపై ఇచ్చే రుణాలకు భలే గిరాకీ కనిపిస్తున్నది. తాజాగా విడుదలైన ఓ నివేదిక గోల్డ్ లోన్లకున్న డిమాండ్‌కు అద్దం పట్టింది మరి. ఏటా పుత్తడి ధరలు పెరుగుతూ పోతున్న విషయం తెలిసిందే. ఇటీవలికాలంలోనైతే రేట్లు విపరీతంగా పుంజుకుంటున్నది చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలోనే 2023 నవంబర్ నుంచి 2025 నవంబర్ మధ్య గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో రెట్టింపైనట్టు తేలింది. బుధవారం క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ క్రిఫ్ హై మార్క్ ఇచ్చిన రిపోర్టులో గత ఏడాది నవంబర్ నాటికి పసిడి రుణాల్లో దాదాపు 100 శాతం వృద్ధి నమోదైంది. 2023 నవంబర్‌లో రూ.7.9 లక్షల కోట్లుగా ఉంటే.. 2025 నవంబర్‌లో రూ.15.6 లక్షల కోట్లకు రుణాలు ఎగబాకాయి. 2024 నవంబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో గోల్డ్ లోన్లు 39 శాతం పెరిగితే.. ఆ తర్వాతి ఏడాది కాలంలో 42 శాతం పెరుగుదల కనిపించింది.

సేఫ్ జోన్..

గోల్డ్ లోన్లను రుణదాతలు (బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు) రక్షణాత్మక రుణాలుగా చూస్తున్నాయి. బంగారాన్ని తమ వద్ద తనఖా పెట్టుకుని ఆ రోజు మార్కెట్ ధర ఆధారంగా రుణగ్రహీతలకు చెల్లింపులు చేస్తున్నాయి. దీంతో ఎగవేతలకు తావు లేకుండా పోయింది. అందుకే అంతా గోల్డ్ లోన్ సెగ్మెంట్‌పై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆకర్షణీయ వడ్డీరేట్లనూ ఆఫర్ చేస్తున్నారు. పైగా చాలామందికి తమ తక్షణ నగదు అవసరాలకు బంగారమే సులభతర మార్గంగా ఉంటుండటం కూడా గోల్డ్ లోన్ మార్కెట్‌ను ఏటా పెంచేస్తున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక రిటైల్ లోన్ పోర్ట్‌ఫోలియోలో 2024 నవంబర్ నుంచి 2025 నవంబర్‌కు గోల్డ్ లోన్ల వాటా 8.1 శాతం నుంచి 9.7 శాతానికి పెరిగిందని తాజా నివేదిక సైతం తేటతెల్లం చేసింది.

భారీ రుణాలే అధికం

నిరుడు నవంబర్ నాటికిగల గోల్డ్ లోన్లలో దాదాపు సగం వాటా రూ.2.5 లక్షలకుపైగా ఉన్నవేనని క్రిఫ్ హై మార్క్ తెలిపింది. ఇక పసిడి రుణగ్రహీతల్లో 56 శాతం పురుషులే. అయితే మహిళా రుణగ్రహీతల్లోనే సకాలంలో సక్రమంగా అప్పు తీర్చుతున్నవారు ఎక్కువగా ఉన్నారని ఈ సందర్భంగా రిపోర్టు స్పష్టం చేయడం గమనార్హం. కాగా, గోల్డ్ లోన్ మార్కెట్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులదే మెజారిటీ వాటా. 60 శాతం వ్యాపారం వీరి చేతిలోనే ఉందని తాజా నివేదిక పేర్కొన్నది. కేవలం బంగారం తనఖాపైనే రుణాలిస్తూ వ్యాపారం చేస్తున్న బ్యాంకింగేతర సంస్థల వాటా 8.1 శాతమే. పసిడి రుణాల వృద్ధిలో గుజరాత్ 67 శాతంతో ముందున్నది. 50 శాతంతో ఆ తర్వాత కర్ణాటక, మహారాష్ట్రలున్నాయి. అయినప్పటికీ దక్షిణాది రాష్ట్రాల్లోనే గోల్డ్ లోన్ బిజినెస్ బాగా విస్తరిస్తున్నది. ఇక మొండి బకాయిల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిషా రాష్ట్రాల రుణగ్రహీతలవే ఎక్కువని తాజా నివేదిక స్పష్టం చేసింది.

రికార్డు ధరల్లోనే పసిడి-వెండి

తులం బంగారం రూ.1,71,000 • కిలో వెండి రూ.3,85,000

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ హై రికార్డుల్లోనే పరుగులు పెడుతున్నాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో బుధవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,71,000 పలికింది. ఈ ఒక్కరోజే రూ.5,000 పుంజుకున్నది. కిలో వెండి విలువ సైతం రూ.15,000 ఎగబాకింది. ఫలితంగా ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలో రూ.3,85,000గా నమోదైనట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్ రిటైల్ మార్కెట్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం పసిడి ధర రూ.1,53,150గా ఉన్నది. మంగళవారం ముగింపుతో చూస్తే.. రూ.4,700 ఎగబాకింది. కిలో వెండి ధర రూ.3,85,000కు ట్రేడ్ అవుతున్నది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు ఫారెక్స్.కామ్ వివరాల ప్రకారం 5,256.35 డాలర్లుగా ఉన్నది. ఒక్కరోజులో 74.57 డాలర్లు పెరిగింది. సిల్వర్ 112.22 డాలర్లు పలికింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు ఇన్వెస్టర్లు, ఇండస్ట్రీ వర్గాల నుంచి వెండికి డిమాండ్ ఉంటున్నది. అందుకే భారీ ఎత్తున రేట్లు పుంజుకుంటున్నాయని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

వాణిజ్య

ఏఏఐ 15 వేల కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 28: ఎయిర్‌పోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే మూడేండ్లకాలంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ ఆటోమేషన్, నావిగేషన్ సిస్టమ్స్, ఇతర కీలక మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి రూ.15 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు కంపెనీ చైర్మన్ విపిన్ కుమార్ తెలిపారు. దేశంలో అతిపెద్ద విమానాశ్రయాల నిర్వహణ సంస్థ అయిన ఏఏఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలదన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు. 2028 చివరినాటికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాల్లో ఏటీసీ టవర్లు ఆటోమేషన్, నావిగేషన్ సిస్టమ్స్‌ను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆధునీకరించనున్నట్టు చెప్పారు.

మారుతి లాభం 3,879 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 28: మారుతి సుజుకీ లాభాలకు నూతన కార్మిక చట్టాల సెగ తాకింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.3,879 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,727 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం 4 శాతం వృద్ధిని కనబరించింది. నూతన కార్మిక చట్టాలను అమల్లోకి తేవడానికి ఒకేసారి రూ.594 కోట్ల నిధులను కేటాయించడంతో లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. అలాగే కంపెనీ ఆదాయం రూ.49,904 కోట్లకు ఎగబాకింది.

3,300 విమానాలకు డిమాండ్

2044 నాటికి భారత్‌తోపాటు దక్షిణాసియా దేశాల్లో..
కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్‌లో బోయింగ్ వెల్లడి



బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఇండియా 2026ను ప్రారంభిస్తున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. చిత్రంలో ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తదితరులు

హైదరాబాద్, జనవరి 28: రెండేండ్లకొకసారి హైదరాబాద్‌లో జరిగే విమానాల పండుగ అంగరంగవైభవంగా ప్రారంభమైంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్..కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్(సీఎంవో)ను విడుదల చేసింది. 2044 నాటికి భారత్‌తోపాటు దక్షిణాసియా దేశాల్లో 3,300 విమానాలకు డిమాండ్ ఉంటుందని పేర్కొంది. భారత్‌లో విమానాలకు ఎనలేని డిమాండ్ నెలకొంటున్నదని, గడిచిన దశాబ్ద కాలంలో విమానాల సర్వీసుల సంఖ్య ఐదింతలు పెరగడమే ఇందుకు కారణమని విశ్లేషించింది. వీటిలో సింగిల్ జెట్ లేదా తక్కువ స్థాయి బాడీ కలిగిన విమానాల వాటా 90 శాతంగా లేదా 2,875గా ఉంటుందని పేర్కొంది. అలాగే 2044 నాటికి 45 వేల మంది పైలెట్లు, 45 వేల మంది టెక్నీషన్లు, 51 వేల మంది క్యాబిన్ క్రూలు అవసరమవుతారని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు తెలిపారు. వచ్చే 20 ఏండ్లలో భారత్‌తోపాటు దక్షిణాసియా దేశాల్లో విమాన ప్రయాణికుల్లో వృద్ధి వార్షికంగా 7 శాతం పెరుగుదల నమోదు చేసుకోనున్నదన్నారు. అలాగే విమానయాన సేవలు, నిర్వహణ, మరమ్మతులు, మాడిఫికేషన్, డిజిటల్ సర్వీసులు, శిక్షణ కోసం 195 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని ఆయన చెప్పారు. దేశీయ విమానయాన రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో విమానయాన సంస్థలు 1,500కి పైగా విమాన సర్వీసులకోసం ఆర్డర్లు ఇచ్చాయని, దీంతో దీని అనుబంధ రంగాలు కూడా పుంజుకుంటున్నాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి.

హెచ్ఏఎల్ ఎస్‌జే100 ఎయిర్‌క్రాఫ్ట్

వచ్చే మూడేండ్లకాలంలో సూపర్‌జెట్ 100(ఎస్‌జే 100) ఎయిర్‌క్రాఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు హెచ్ఏఎల్ సీఎండీ డీకే సునీల్ తెలిపారు. వచ్చే పదేండ్ల కాలంలో మొత్తం ఆదాయంలో సివిల్ ఏవియేషన్ నుంచి 25 శాతం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ అందుకు తగ్గట్టుగా ప్రణాళికను వేగవంతం చేసింది. దీంట్లో భాగంగానే ప్రతియేటా రూ.3 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.31 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్టు, ఈసారి 7-8 శాతం వృద్ధిని అంచనావేస్తున్నట్టు చెప్పారు.

వింగ్స్ ఇండియా ముఖ్య అంశాలు


- ఏకేఎస్ఐ ఏరోస్పేస్.. స్కైషిప్పర్ డ్రోన్‌ను వింగ్స్ ఇండియా 2026లో ఆవిష్కరించింది. కమర్షియల్, మెడికల్, ఇండస్ట్రియల్ అవసరాల దృష్ట్యా 30 కిలోల సరుకును తీసుకెళ్లనున్నది.
- ఎయిర్‌బస్‌కు 2025లో సివిల్, మిలిటరీకి సంబంధించిన 544 హెలిక్యాప్టర్ ఆర్డర్లను దక్కించుకున్నది. 50 దేశాలకు చెందిన 205 కస్టమర్ల నుంచి లభించాయి.

హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ డిజిటల్ హబ్!

హైదరాబాద్, జనవరి 28: ప్రముఖ కెమికల్స్ దిగ్గజం బీఏఎస్ఎఫ్..హైదరాబాద్‌లో గ్లోబల్ డిజిటల్ హబ్‌ను ప్రారంభించే యోచనలో ఉన్నది. ప్రస్తుత త్రైమాసికంలో ప్రారంభించనున్న ఈ హబ్..యూరప్, కౌలాలంపూర్ తర్వాత ఏర్పాటు చేయబోయేది ఇదే కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా తన వ్యాపారాన్ని విస్తరించడంలో భాగంగా ఇక్కడ డిజిటల్ హబ్‌ను నెలకొల్పబోతున్నట్టు కంపెనీ సీఎఫ్‌వో డిర్క్ ఎల్వర్మాన్ తెలిపారు.

భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ *487*, నిఫ్టీ *167* పాయింట్ల లాభం



ముంబై, జనవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. భారత్-ఈయూ దేశాల మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కుదరడంతో మదుపరుల్లో ఉత్తేజాన్ని నింపింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో బుధవారం కూడా సూచీలు కదంతొక్కాయి. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 487.20 పాయింట్లు అందుకొని 82,344.68 వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 167.35 పాయింట్లు ఎగబాకి 25,342.75 వద్ద ముగిసింది.

- బీఈఎల్ షేరు 8.90 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఓఎన్‌జీసీ, హెచ్ఏఎల్, కోల్ ఇండియా, ఎటర్నల్, హిందాల్కో, బజాజ్‌ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ షేర్లు రెండు శాతానికి పైగా ఎగబాకాయి.
- వీటితోపాటు ట్రెంట్, అదానీఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్‌ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్‌సిమెంట్, బజాజ్‌ఫినాన్సర్వ్, టీసీఎస్, అదానీపోర్ట్స్, సిప్లా, రిలయన్స్, విప్రో, టెక్‌మహీంద్రా షేర్లు కూడా బలపడ్డాయి.
- టాటా కన్జ్యూమర్ షేరు 4.70 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది.

దూరదృష్టితో బడ్జెట్ ఉండాలి

అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం • ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



న్యూఢిల్లీ, జనవరి 28: రాబోయే బడ్జెట్ తప్పనిసరిగా దూరదృష్టి కలిగిన లక్ష్యాలతో ఉండాలని, వాటి సాధనకు బాటలు వేసేదిగా నిలువాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అప్పుడే భారత ఆర్థిక వ్యవస్థ మరింత స్వతంత్రంగా, బలోపేతంగా మారగలదని అభిప్రాయపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో బుధవారం పీటీఐ వీడియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజన్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు (ఏఐ)లో అద్భుతమైన పెట్టుబడులకు వీలుండి, గొప్ప వృద్ధి అవకాశాలు కనిపిస్తున్నా ప్రస్తుతం భారత్, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రెండింటికీ అత్యంత ప్రమాదకర సమయమే నడుస్తున్నదని చెప్పారు. అందుకే ఈ క్లిష్ట పరిస్థితులను జయించేలా బడ్జెట్ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఈసారి బడ్జెట్ ఆ తరహాలోనే ఉంటుందన్న ఆశాభావాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. కాగా, గతంలోనూ భారత్‌కు ఐదేండ్ల ప్రణాళికలు ఉండేవని, కానీ అప్పుడు కూడా బడ్జెట్ వాటికి తగినట్టుగా ఉండేది కాదని రాజన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదిలావుంటే భౌగోళిక-రాజకీయ ఒడిదుడుకుల నడుమ దేశ జీడీపీని పరుగులు పెట్టించేలా బడ్జెట్ ఉంటుందన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. దిగుమతి సుంకాలు తగ్గితే సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడగలదన్నారు.

అనిల్ అంబానీ-ఈడీ కేసు

1,885 కోట్ల ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ, జనవరి 28: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ సంస్థలపై చేస్తున్న మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా మరో రూ.1,885 కోట్ల ఆస్తుల్ని జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం తెలిపింది. దీంతో ఇప్పటిదాకా ఈ కేసులో జప్తు చేసిన ఆస్తుల విలువ దాదాపు రూ.12,000 కోట్లకు చేరిందన్నది. కాగా, తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల్లో బ్యాంక్ డిపాజిట్లు, కొన్ని స్థిరాస్తులు, పెట్టుబడులున్నట్టు ఈడీ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్ మోసం, రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ తదితర సంస్థలకు సంబంధించిన కేసుల్లోవే ఈ జప్తులని కూడా వారు వివరించారు. అనిల్ గ్రూప్.. ఏ తప్పూ చేయలేదని వాదిస్తుండగా, వివిధ కంపెనీలు ప్రజా ధనాన్ని పక్కదారి పట్టించాయని ఈడీ అంటున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.